సంపుటి:78 సంచిక:41 పుటలు:52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ అషాఢ శుద్ధ త్రయోదశి
27 జూలై - 02 ఆగస్ట్ 2026
వెల:₹20/-

భారతీయతకు పల్లె పిలుపు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

భారతీయ సాహితీ ద్రష్ట
భండారు సదాశివరావుగారి స్మారక
కథల పోటీ-2026

జాగృతి వారపత్రిక దీపావళి సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు గారి స్మారక 'కథల పోటీ' నిర్వహిస్తున్నది. రచయితలకు ఆహ్వానం..

ప్రథమ బహుమతి : రూ. 12000/-
ద్వితీయ బహుమతి : రూ. 7000/-
తృతీయ బహుమతి : రూ. 5000/-

నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటుంది.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే.
8. ఈ కథలను దీపావళి సంచిక నుంచి వరుసగా ప్రచురిస్తాం.

కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 22 ఆగస్టు, 2026

కార్మిక భవిష్యత్తే లక్ష్యం

"చివరి కార్మికుడి వరకు సార్వత్రిక సామాజిక రక్షణను విస్తరించడమే ప్రపంచ అభివృద్ధికి కొత్త నినాదం కావాలి" – బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం 'హైదరాబాద్ డిక్లరేషన్' పిలుపు

ఈ ఏడాది సెప్టెంబర్‌లో న్యూఢిల్లీలో జరుగనున్న బ్రిక్స్ సదస్సుకు ముందుగా వివిధ అంశాలపై దేశవ్యాప్తంగా 100 నగరాలలో సదస్సులు జరుగు తున్నాయి. ఆ చట్రంలో భాగంగా హైదరాబాదులో ఇటీవల 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం (బ్రిక్స్ కార్మిక సంఘాల ఫోరం) సదస్సు జరిగింది. భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సదస్సుకు బ్రిక్స్ సభ్య దేశాల కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ కార్మిక సమస్యలను చర్చించి, వారికి రక్షణలను ప్రతిపాదిస్తూ "హైదరాబాద్ డిక్లరేషన్"ను ఆమోదించారు. ఈ ప్రకటన అన్ని వర్గాల కార్మికులకు సార్వత్రిక, సమగ్రమైన, స్థిరమైన సామాజిక రక్షణ వ్యవస్థలను బ్రిక్స్ దేశాల ప్రభుత్వాలు విస్తరించాలని పిలుపునిచ్చాయి. ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, వలస కార్మికులు, ప్లాట్‌ఫారం (గిగ్) కార్మికులు, వ్యవసాయ కార్మికులు, అలాగే అసాధారణ ఉపాధి విధానాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికీ సామాజిక భద్రత కల్పించాలని డిక్లరేషన్ స్పష్టం చేసింది.

జూలై 14 నుండి 16, 2026 వరకు జరిగిన బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం (బీయూఎఫ్) సదస్సు ముగింపు సందర్భంగా ఈ 'ప్రకటన'ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ చారిత్రాత్మక ప్రకటన న్యాయసమ్మతమైన, సమ్మిళితమైన, కార్మిక కేంద్రిత భవిష్యత్తు నిర్మాణానికి ప్రపంచస్థాయి సహకారానికి బలమైన పునాది వేసింది. ఈ సదస్సుకు భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అఖిల భారత అధ్యక్షులు సుంకరి మల్లేశం అధ్యక్షత వహించారు.

బీఎంఎస్ ఆతిథ్యమిచ్చిన ఈ మూడురోజుల సదస్సులో 13 సభ్య, భాగస్వామ్య దేశాలకు చెందిన జాతీయ కార్మికసంఘాల నుంచి 53మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అదనంగా 60మందికి పైగా ప్రముఖ కార్మిక నాయకులు, మానవ వనరుల నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, విద్యావేత్తలు, విధాన నిపుణులు చర్చల్లో పాల్గొని తమ సూచనలు అందించారు.

సదస్సు ముగింపు కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొని, 'హైదరాబాద్ డిక్లరేషన్'పై కుదిరిన చారిత్రాత్మక ఏకాభిప్రాయాన్ని అభినందిస్తూ, పారిశ్రామిక సంబంధాల్లో పరస్పర విశ్వాసం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఈ ప్రకటనలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), దాని త్రైపాక్షిక భాగస్వాములు 2026లో "డీసెంట్ వర్క్ ఇన్ ది ప్లాట్‌ఫారం ఎకానమీ" కన్వెన్షన్‌ను ఆమోదించినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కన్వెన్షన్ ఆమోదం ద్వారా ఐఎల్ఓ సమర్థత మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు.

హైదరాబాద్ డిక్లరేషన్ ముఖ్యాంశాలు

మహిళలు, భవిష్యత్ ఉపాధి, సార్వత్రిక సామాజిక భద్రత, భవిష్యత్ నైపుణ్యాల అభివృద్ధి, మానవ కేంద్రిత సాంకేతికత, కృత్రిమ మేధస్సు (AI)

ప్రధాన ఫలితాలు

1. శాశ్వత సంస్థాగత యంత్రాంగం

నిరంతర భాగస్వామ్యం కొనసాగించడానికి, అలాగే ప్రపంచ కార్మిక విధానాల రూపకల్పనలో సమర్థవంతమైన పాత్ర పోషించేందుకు శాశ్వత సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు చేయాలని సదస్సు అధికారికంగా పిలుపునిచ్చింది.

2. గిగ్, ప్లాట్‌ఫార్మ్ ఆర్థిక వ్యవస్థలో కార్మికుల రక్షణ

అంతర్జాతీయ కార్మిక సంస్థ రూపొందించిన తాజా అంతర్జాతీయ ప్రమాణాలను హర్షంతో ప్రతినిధులు స్వాగతించారు. ప్లాట్‌ఫార్మ్ (గిగ్) కార్మికులకు సామూహిక బేరసారాల హక్కు , సామాజిక భద్రత, రక్షణ హామీ కల్పించేలా బ్రిక్స్ దేశాలు తమ జాతీయ చట్టాలను వీలైనంత త్వరగా అనుసరణీయంగా సవరించాలని కోరింది.

3. బ్రిక్స్ కనెక్ట్

బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం తీసుకున్న నిర్ణయాలు బ్రిక్స్ కనెక్ట్ వేదిక లక్ష్యాలను నేరుగా పరిపూర్ణం చేస్తాయి. సీమాంతర నైపుణ్యాల మ్యాపింగ్ స్వచ్ఛందంగా జ్ఞానాన్ని పంచుకోవడానికి భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ వేదికను ప్రారంభించింది.

సదస్సు ముగింపులో పాల్గొన్న అన్ని దేశాల ప్రతినిధి బృందాలు హైదరాబాద్ డిక్లరేషన్లోని సిఫార్సులను సమర్థవంతంగా అమలు చేయడానికి తమ తమ ప్రభుత్వాలపై నిరంతర ఒత్తిడి తీసుకు రావడంతో పాటు, అవసరమైన కృషి చేయాలని ఏకగ్రీవంగా ప్రతిజ్ఞ చేశాయి. ప్రపంచ ఆర్థిక పరివర్తనల ఫలితంగా ప్రపంచకార్మిక వర్గంలో ఏ ఒక్క కార్మికుడూ వెనుకబడిపోకుండా చూడటమే తమ ఉమ్మడి లక్ష్యమని పునరుద్ఘాటించాయి. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Managing Editor : Kurra Durga Reddy.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,
వ్యాపార ప్రకటనల వివరాల కోసం
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
9959991304
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

సినిమా కేవలం వినోదాన్నేకాదు, జీవన విలువలను కూడా సమాజానికి అందించే సాధనం. కానీ, కొందరు వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడానికీ, అసమానతలను, ఒక వర్గానికి చెందిన అన్యాయాలను విశేషంగా పట్టి చూపిస్తూ, మన దేశ పరిస్థితి ఇంతే, బాగుపడదు అనే నిరాశా వాదాన్ని వ్యాప్తి చేయడానికి సినిమాలను నిర్మించడం, వాటికే జాతీయ అవార్డులు రావడం ఈ మధ్యకాలంలో ప్రారంభమైన దురదృష్టకర ప్రక్రియ. దీనికి భిన్నంగా, జాతీయ సమైక్యతను, జీవన విలువలను ప్రధానాంశంగా చేసుకొని నిర్మించిన సినిమాలను జాతీయ సినిమా అవార్డుల కమిటీ (జ్యూరీ) ఈసారి ఎంపిక చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం.

జాతీయ సినిమా అవార్డుల కమిటీ ఇటీవల ప్రకటించిన విజేతల జాబితాలో జాతీయభావం, విలువలతో కూడిన సినిమాలకు పెద్దపీట వేశారు. ప్రతి ఏడాదీ సినిమాఅవార్డులు ప్రకటన వెలువడగానే ఏదో ఒక మూలనుంచి విమర్శలు వస్తుండేవి. కానీ ఈసారి అటువంటివాటికి జ్యూరీ అవకాశం ఇవ్వలేదు. దానికి ప్రధానకారణం వారు ఎంపికచేసిన చిత్రాలు అత్యంత ప్రజాదరణ పొందినవి కావడమే. ఇటీవలి కాలంలో దేశ హితానికి సంబంధించిన సినిమాలను ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. బలగం వంటి కుటుంబ కథాచిత్రాలు,దురంధర్ వంటి చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారు.

ఉత్తమ చిత్రంగా 'ఆర్టికల్ 370' ఎంపిక, దేశం పట్ల ప్రేమ ఉన్న వారికి ఆనందాన్ని ఇచ్చింది. భారతదేశంలో అంతర్భాగమైన కశ్మీర్‌ను ఆర్టికల్ 370తో దూరం చేసిన కుట్రను ఎన్నో తరాలు చూసి ఉన్నాయి. ఈ ఆర్టికల్ ద్వారా కశ్మీర్‌ను ఈ దేశానికి దూరం చేసే ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయాలని నాటి భారతీయ జనసంఘ్ నేత శ్యామాప్రసాద్ ఉద్యమించారు. ఆ పోరాటంలోనే తన ప్రాణాలను సైతం త్యాగం చేశారు. ఇంతటి చరిత్ర గల ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికి దక్కింది. ఇందుకోసం ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేసింది, విజయవంతంగా దానిని ఎలా రద్దు చేయగలిగిందనే కథాంశంతో తెరకెక్కిన సినిమా 'ఆర్టికల్ 370'. దేశ సమైక్యత, సమగ్రతలకు మోదీ ప్రభుత్వం ఎలాంటి ప్రాధాన్యం ఇస్తుందనేది ఈ

శాలివాహన 1948 శ్రీ పరాభవ ఆషాఢ శుద్ధ త్రయోదశి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

భారతీయతకు పల్లె పిలుపు

ధారావాహిక నవల

46 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో

జాతీయం

స్వావలంబనకే ఇథనాల్

26లో

జాగృతి
సంపాదకీయం

ఆర్టికల్ 370 సినిమాకు జయహో

సినిమాలో దర్శకుడు ఆదిత్య సుహాగ్ కళ్లకు కట్టినట్టు చూపించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంలో 'ఆర్టికల్ 370'కి ఉత్తమచిత్రంగా అవార్డు రావడం విశేషం. ఇదే చిత్రంలో ఎన్.ఐ.ఎ. ఏజెంట్ జూనీ హక్సర్ పాత్రకు జీవంపోసిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఈ సినిమాకు స్వరాలు సమకూర్చిన శాశ్వత్ సచిదేవ్‌కు ఉత్తమ సంగీత దర్శకుడిగా అవార్డు లభించడం ఆహ్వానించదగినది.

ఈసారి అవార్డులు లభించిన చిత్రాలలో భారతీయసంస్కృతీ సంప్రదాయలకు, పురాణేతిహాసాలకు ప్రాధాన్యమిచ్చిన చిత్రాలు ఉన్నాయి. అలానే సామాజి కాంశాలకు, స్ఫూర్తిదాయక కథాంశాలకు జ్యూరీ పెద్ద పీట వేసింది. భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కిన తెలుగు సినిమా 'కల్కి 2898 ఎ.డి.' ఉత్తమ వినోదాత్మక చిత్రంగా అవార్డు గెలుచుకుంది. నేటి విద్యావిధానంలోని ప్రధాన లోపాలను ఎత్తిచూపుతూ, ఎలాంటి విద్యాబోధన ద్వారా పిలల్ల మనుసుల్ని వికసింప చేయవచ్చో తెలిపే '35:చిన్నకథ కాదు' ఉత్తమ బాలలచిత్రంగా ఎంపికైంది. ఉత్తమ ప్రాంతీయ చిత్రాల్లో తెలుగు నుంచి ఎంపికైన 'కమిటీ కుర్రోళ్ళు' కూడా సామాజిక అంశాల నేపథ్యంలో తెరకెక్కింది. ఇదే కేటగిరిలో హిందీ నుంచి ఎంపికైన బయోపిక్ 'శ్రీకాంత్' సైతం గొప్పచిత్రం. పుట్టుకతోనే అంధుడైన శ్రీకాంత్‌బొల్లా పట్టుదలతో, తల్లిదండ్రుల సహకారంతో అమెరికాలోని ఎం.ఐ.టీ.లో మేనేజ్‌మెంట్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం భారత్‌కు తిరిగివచ్చి, ఇండస్ట్రీని స్థాపించి, పారిశ్రామికవేత్తగా ఎదిగారు. శ్రీకాంత్ జీవనప్రస్థానాన్ని ఈ చిత్రంలోచూపించారు. శ్రీకాంత్ పాత్రను రాజ్‌కుమార్‌రావు సమర్థవంతంగా పోషించారు. అలానే ఉగ్రదాడిలో అమరుడైన మేజర్ ముకుంద్‌వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అమరన్' చిత్రానికి మూడు అవార్డులు లభించాయి.

ఉత్తమనటుడిగా తొలిసారి అవార్డు అందుకున్న కార్తీక్ ఆర్యన్ పోషించిన పాత్ర కూడా ఈ తరానికి స్ఫూర్తినిస్తుంది. కబీర్‌ఖాన్ దర్శకత్వం వహించిన 'చందుఛాంపియన్'లో కార్తీక్ ఆర్యన్ 1972లో భారతదేశపు మొట్టమొదటి పారాఒలింపిక్ స్వర్ణపతాక విజేత మురళీ కాంత్ పెట్కర్ పాత్రను పోషించాడు. ఎన్నో సంవత్సరాలపాటు అజ్ఞాతంతర్వాత ఈ క్రీడాకారుడికి 2018లో పద్మశ్రీ పురస్కారం లభించింది. అతడి పాత్రలో జీవించిన కార్తీక్ ఆర్యన్‌ను జాతీయ అవార్డుకు కమిటీ ఎంపికచేసింది. అలానే సీనియర్ నటుడు మమ్ముట్టి సైతం 'భ్రమయుగం'లోని నటనకుగానూ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి ధనుష్‌కూ జాతీయ అవార్డులలో ప్రత్యేక స్థానం దక్కింది. ప్రముఖ నటుడు రణదీప్ హూడా 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' చిత్రానికిగానూ ఉత్తమ నూతన దర్శకుడు అవార్డుకు ఎంపిక కావడం విశేషం.

ప్రజల అభిరుచులు మారిన విషయాన్ని ఇప్పుడు నిర్మాతలు, దర్శకులే కాదు జ్యూరీ కూడా గుర్తించినట్టుంది. ఒక సినిమా చూపే ప్రభావానికి జ్యూరీ అవార్డే కొలమానంకాకపోవచ్చు. కానీ, ఆ సినిమా ఇచ్చిన సందేశానికి విస్తృత స్థాయిలో దీనివల్ల ఆమోదం లభించిందని భావించవచ్చు. విలువలు లేకుండా తీసిన సినిమాలను నేడు 'సి'సెంటర్లలో కూడా ఆడించలేని పరిస్థితులు నెలకొన్నాయి. సహజంగా యువత వినోదాన్ని కోరుకుంటుంది, కానీ దాని ముసుగులో చూపే అశ్లీలతను,అరాచకాలను ఇప్పుడు వారే తోసి పుచ్చుతున్నారు.ఈ అవార్డులు సినిమాప్రపంచంలో ఒక మేలిమలుపుకావాలని ఆశిద్దాం.

36లో

కథ

త్రివేండ్రం వెళ్లాలి కాకి కోసం!

- టిఎస్‌ఏ కృష్ణమూర్తి



పాక్‌పై భస్మాసురహస్తం: పీఓజేకే (అంతర్జాతీయం) - 12
ప్రతి కుటుంబానికి ప్రాణజలం (సంక్షేమం) - 14
బడిలో అస్వమత బోధనతో అలజడి (తెలంగాణ) - 16
బెంగాల్‌కు 'కాంతి' కమలం (మహిళ) - 24
బోనాలతో భోగభాగ్యాలు (ప్రత్యేక వ్యాసం) - 29
తెలుగు తోటలో జ్ఞాన పుష్పం (గళమెత్తిన గతం) - 30
శ్రీ గురవే నమః!! (ప్రత్యేక వ్యాసం) - 33
సంఘ కార్యమే వారి జీవితం (ఆర్ఎస్ఎస్-100) - 36
జీవిత సత్యాల పాఠం (వ్యక్తిత్వ వికాసం) - 40
యువతే నవ భవిషత్తు (యువవాణి) - 44
భారత క్రికెట్ మహిళాద్భుతం! (క్రీడ) - 43
అవార్డుల తెలుగు 'తెర' దరహాసం! (సినిమా) - 50

గోధూళి ధూసరిత కోమల గోపవేషం
గోపాల బాలకశతైః అనుగమ్యమానం।
సాయన్తనే ప్రతి గృహం పశుబంధనార్థం
గచ్ఛన్తమచ్యుత శిశుం ప్రణతోస్మి నిత్యం ॥

(సమస్త గోవులు నడుచుట వలన లేచిన ధూళితో (గోధూళి) ధూసరితమైన (కప్పబడిన) కోమలమైన గోప వేషము కలిగినవాడూ, వందలాది గోప బాలురు తనను వెంట అనుసరించి నడుచుచుండగా, సాయంకాల సమయమున ఆవులను ఇళ్లలోని దొడ్లలో కట్టుటకు (లేదా మందకు తోలుకొనుచు) వెళుతున్న అచ్యుతుడైన (నాశనము లేని) ఆబాలగోపాలునికి ప్రతినిత్యము నమస్కరించుచున్నాను).

హైదరాబాద్‌కు 120 కి.మీ.ల దూరంలో, మారుమూల ప్రాంతంలో 104 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్. జాగృతి పత్రిక బృందంలో ఒకడిగా అక్కడి ప్రాంగణంలో పర్యటిస్తున్న సమయంలో దేశీయ గోవులు గుంపులు గుంపులుగా కనిపించినప్పుడు పై శ్లోకం గుర్తుకు వచ్చింది. దాదాపు పుష్కరకాల ప్రస్థానంలో గ్రామీణ వికాసం లోనూ, భారతీయతకు పట్టం కట్టడంలోనూ ఎన్నో విజయాలను సాధించింది ఫౌండేషన్. పల్లె ప్రగతి దిశగా మైలు రాళ్లను నెలకొల్పింది. ప్రాంగణం ఆరంభంలో ఆంజనేయస్వామి దేవాలయం మొదలుకొని ఏకలవ్య సేంద్రియ పాలిటెక్నిక్ కళాశాల, సభామందిరం, నిరామయ ఉత్పాదనల కేంద్రం, కపిల గోశాల, వ్యవసాయ క్షేత్రం, ఉద్యానవన పంటల మడులు, వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటితో కళకళలాడుతున్న చెరువులు, చదువు చెప్పడంలోనూ, నేర్చుకోవడంలోనూ సనాతన భారతీయతను, ఆధునికతను మేళవించుకొని సత్ సంకల్పంతో కూడుకున్న సమాజ నిర్మాణం దిశగా విద్యార్థులతో ఇప్పుడిప్పుడే బుడిబుడి అడుగులు వేస్తున్న సాందీపని గురుకులం వరకు

భారతీయతకు

మనం మనవారి కోసం పనిచేయాలి

గ్రామాలలో కష్టపడి పనిచేసే రైతులకు వ్యవసాయ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువులు, షాంపూ, ఫినాయిల్, నూనెలు, సబ్బులు, మునగాకు, మొరింగ, అర్జున టీ లాంటి ఉత్పత్తుల ద్వారా గ్రామాలలో ఉంటూనే ఆర్థికసమృద్ధితో జీవించే స్థితి రావాలి. యోగ ద్వారా మంచి ఆరోగ్యం, సాంస్కృతిక కార్యక్రమాలు ద్వారా మానవ జీవన విలువల నిర్మాణం మనందరి బాధ్యత. గ్రామవికాసానికి పెద్దలు, యువతీయువకులు తమ అమూల్యమైన జీవితాన్ని సమర్పించాలి. జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. రండి, ముందుకు రండి.. చేయిచేయి కలుపుదాం. రసాయన విషాలులేని ఆరోగ్యవంతమైన భోజనాన్ని సమాజానికి అందిద్దాం.

ఫౌండేషన్ ధ్యేయనిష్ఠకు, అనిర్వచనీయమైన కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అనాదిగా మన దేశానికి వెన్నెముకగా వ్యవసాయం నిలుస్తున్నది. గడచిన కొద్ది దశాబ్దాల కాలంలో ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థికవిధానాలు, ప్రైవేటీకరణ కారణంగా ఉపాధికి మూలాలుగా పట్టణాలు, నగరాలు వెలిశాయి. దీనికి తోడు పాశ్చాత్య జీవనశైలి పట్ల భారతీయులు వ్యామోహం పెంచుకున్నారు. కట్టూ బొట్టూ మారిపోయింది. వస్త్రధారణ వింతపోకడలు పోయింది. పాశ్చాత్యులను అనుకరించే క్రమంలో , పాంటూ, చొక్కా నలగని ఉపాధి అవకాశాల కోసమని పల్లె ప్రజలు పట్టణాలు, నగరాల బాట పట్టారు. బోసిపోయిన పల్లె బావురుమంది. కాయకష్టం చేసుకుంటూ నేలతల్లిని తరతరాలుగా నమ్ముకుంటూ వస్తున్న అన్నదాతలకు సరైన ప్రోత్సాహం లేకుండా పోయింది. ఇదే కాకుండా ప్రకృతి కన్నెర్ర చేసిన కారణంగా వర్షాభావ పరిస్థితులలో నారు పోయడానికి కూడా రైతు నీరు వెదుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. అధిక దిగుబడి కోసమని మనదేశంలోకి ప్రవేశించిన రసాయన ఎరువులు, పురుగుమందులు భూసారాన్ని పీల్చి పిప్పి చేశాయి. కొన్ని తరాల కళ్లెదుటే చోటు చేసుకున్న ఈ పరిణామాలు రైతుకు శాపంగా మారాయి. ఈ నేపథ్యంలో భారతీయతకు నిదర్శనమైన సహజ వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ, గ్రామీణులు స్వంత ఊరిలోనే ఆత్మాభిమానం కలిగిన రైతులుగా జీవనం సాగించేలా మార్గం చూపడానికి ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. కేవలం వారికి పూర్వవైభవం తీసుకురావడంతో సరిపుచ్చక విద్య, వైద్యం వంటి రంగాల్లో గ్రామీణుల వెంట నడుస్తూ, తనతో నడిపిస్తూ గ్రామం కేంద్రంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇదంతా గ్రామీణ వికాసం కోసం, నగరాలకు వలసలు పోకుండా స్వగ్రామంలోనే ప్రశాంత వాతావరణంలో రైతులకు ఆదాయాన్ని ఇచ్చే వృత్తి, వ్యాపకాలను కల్పించడంలో భాగం అని 'జాగృతి'తో ముఖాముఖిలో ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వల్లభజోస్యుల శ్రీనివాస్ తెలిపారు.

పల్లె పిలుపు

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఎలా ఆవిర్భవించింది. ఈ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం ఏమిటి?

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ 2015లో ఆవిర్భవించింది. ఆర్ఎస్ఎస్‌లో ఉన్న చాలా మంది పెద్దలు కలిసి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంలో వారి వంతు కృషిగా ఈ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. దీనిలో అనేక శాఖలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవిగా విద్య, వైద్యం, వ్యవసాయం, గో ఆధారిత వ్యవసాయం, గోవుల పోషణ, పరిరక్షణ, గో ఆధారిత ఉత్పత్తులు ఉన్నాయి. గ్రామీణాభివృద్ధికి దోహదపడే ఒక యజ్ఞంగా ఈ ఫౌండేషన్‌ను పరిగణనలోకి తీసుకొని ఇందులోని అన్ని శాఖలు గ్రామ జీవనానికి ప్రాముఖ్యతను ఇస్తాయి. విద్య విషయానికి వస్తే భారతీయ కళలు, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించే విధంగా మా సాందీపని గురుకులం ఉంది. 2024లో ఈ గురుకులాన్ని స్థాపించాము. ఇందులో విద్యార్థులకు సర్వసాధారణమైన విద్యాబోధనతో పాటుగా 64 భారతీయ కళలను కూడా దశలవారీగా నేర్పించడం జరుగుతుంది. అలాగే ఇదే ప్రాంగణంలో ఏకలవ్య సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఉంది. తెలంగాణలో మొట్టమొదటిసారిగా ఇలాంటి ఒక కళాశాల ఇక్కడ ఏర్పాటైంది. ఈ కళాశాలలో విద్యార్థులకు సహజ వ్యవసాయం (నేచురల్ ఫామింగ్) నేర్పిస్తాము. ఇక్కడ నేర్చుకోవడమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలలో ఆసక్తి ఉన్న రైతులకు ఈ వ్యవసాయ విధానం పట్ల అవగాహనను విద్యార్థులు కలిగిస్తుంటారు. నిరామయ పేరిట గో ఆధారిత ఉత్పత్తులు కూడా ఇక్కడ తయారవుతుంటాయి. దీని కోసం ఇదే చోట కపిల గోశాలను నిర్వహిస్తున్నాము.

గోశాలలో గిర్, పుంగనూరు, ఒంగోలు, దేవుని అనే నాలుగు రకాల ఆవులు ఉన్నాయి. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు రెండు ప్రాంగణాలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది జింగుర్తి ప్రాంగణం. ఇది అనంతగిరి జిల్లా, తాండూరు మండలంలో 104 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ 104 ఎకరాలలో కళాశాల, గురుకులం, వ్యవసాయం, గోశాల, వైద్య సేవలు, తదితర కార్యకలాపాలు నడుస్తున్నాయి. అదే విధంగా మెదక్ జిల్లా, తునికి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్ర పేరిట రెండవ ప్రాంగణం ఉంది. భారత ప్రభుత్వ పథకం కింద కృషి విజ్ఞాన కేంద్రం నడుస్తున్నది. సినీ నిర్మాత డాక్టర్ రామానాయుడు కుటుంబం ఇచ్చిన భూమిలో దాని కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అక్కడ కూడా వ్యవసాయానికి సంబంధించిన విభాగాలను ఏర్పాటు చేశాము.

దాదాపు ఈ పుష్కర కాలంలో, ఈ ప్రాంతంలో తన కాళ్ల మీద తాను స్వతహాగా నిలబడి, రైతుగా జీవించడానికి అవసరమైన ఆదాయాన్ని కల్పించ డానికి ఫౌండేషన్ కృషి చేస్తున్నది. వ్యవసాయం మీద తగినంత ఆదాయంరాని పక్షంలో గో ఆధారిత ఉత్పత్తులను తయారుచేయడంలో గ్రామీణులకు శిక్షణ ఇస్తుంది. వారి ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతుంది. వాటి అమ్మకాలతో అదనపు ఆదాయాన్ని అందిస్తున్నది. తద్వారా గ్రామీణ జీవనాన్ని ఆనందమయం చేస్తున్నది. ఇందుకోసమని చుట్టుపక్కల గ్రామాల్లో గ్రామవికాసం అనే కార్య క్రమాన్ని మేం నిర్వహిస్తున్నాం. దానిలో భాగంగా విద్యార్థి వికాస్ యోజన అనే కార్యక్రమం కూడా ఉంది. గతేడాది అనంతగిరి జిల్లాలో దీన్ని ప్రారం భించాము. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా ట్యూషన్ తరగతులు నిర్వహిస్తున్నాము. అలా తరగతులు నిర్వహించడం సర్పంచులకు సహజ వ్యవసాయంలో సాంకేతిక మెళకువలను నేర్పిస్తున్నాము. అలా నేర్చుకున్నవారు వారి వారి గ్రామాల్లో సుస్థిర సహజ వ్యవసాయానికి కారకులవుతున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం అనంతగిరి, మెదక్ జిల్లాలలో 100 గ్రామాలకు విస్తరించింది. తద్వారా సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుతున్న అన్నదాతలను గో ఆధారిత వ్యవసాయం వైపునకు మళ్లించడంలో సఫలీకృతులమవుతున్నాము.

సహజ వ్యవసాయానికి దేశీయ విత్తనాలను ఎలా సమకూర్చుకుంటున్నారు?

దేశవ్యాప్తంగా సహజ వ్యవసాయం సాగిస్తున్న అనేక మంది రైతులు రకరకాలైన దేశీయ విత్తనాలను ఎప్పటికప్పుడు భద్రపరుస్తున్నారు. అలాంటి రైతులతో మా ఫౌండేషన్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ఉదాహరణకు మీరు మా బొప్పాయి తోటను

నేచురల్ ఫామింగ్(సహజ వ్యవసాయం), ఆర్గానిక్ ఫామింగ్(సేంద్రియ వ్యవసాయం)ల గురించి తరచుగా ప్రస్తావిస్తుంటారు. ఈ రెండింటి మధ్య తేడా ఏమిటి?

సేంద్రియ వ్యవసాయం.. ఆర్గానిక్ అని మనం ప్రత్యేకంగా చెప్పి చేయాల్సిన పనిలేదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. నేను పనిచేస్తున్న ఈ సంస్థ అభిప్రాయం కూడా అదే. ఆర్గానిక్ అని ఎలాఅంటారు మీరు? రసాయనాలు లేకుండా ఏదీ ఉండదు. మానవ శరీరం రసాయనాలతో నిర్మితమైనది. మనం చేస్తున్న వ్యవసాయంలో రసాయనాలు లేవని మీరు ఎలా చెప్పగలరు? సహజ (నేచురల్) పద్ధతిలో చేసే వ్యవసాయంలో కూడా రసాయనం ఉంటుంది. మనల్ని ఇబ్బంది పెట్టకుండా చేసే రసాయనాలతో చేసేదే సహజ వ్యవసాయం (నేచురల్ ఫామింగ్) అవుతుంది. అదే భారతీయత. ఇది ఇప్పటిదికాదు. అనాదిగా ఉంది. కాకపోతే మనం దానిని మర్చిపోయాం. అంతే. అందరూ ఇళ్లలోని ఆవులను ఎప్పుడో అమ్మేశారు. అదే ఆవులను ఆధారంగా చేసుకొని ఉత్పత్తులను తయారు చేయవచ్చు. వానపాములతో ఎరువు (వర్మి కంపోస్ట్) చేయవచ్చు. చివరకు ఆవు పేడతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఇన్ని విధాలుగా గోమాత మనకు సేవలు అందిస్తున్నది. అందుకు కృతజ్ఞతగా గోమాతకు మనం సేవ చేయాల్సిన అవసరం ఉంది.

ఎలాంటి అభివృద్ధికి ఫౌండేషన్ దోహదపడింది. ఈ కార్యకలాపాల్లో స్థానికుల భాగస్వామ్యం ఏ మేరకు ఉంది?

స్థానికుల భాగస్వామ్యం చాలా ఎక్కువగా ఉంది. ఇక్కడి గ్రామీణుల బాగోగుల కోసమే ఈ ఫౌండేషన్ ఏర్పాటైంది. అది నిర్దేశించుకున్న లక్ష్యాలలో ముఖ్యమైనది పట్టణాలు, నగరాలకు గ్రామీణుల వలసలను అరికట్టడం. గ్రామాలలో ఉన్నవారు నగరాలకు వెళ్లి వాచ్‌మెన్, డ్రైవర్ లాంటి ఉద్యోగాలు చేసే అవసరం లేకుండా, స్వగ్రామంలో ఉంటూ, గో ఆధారిత వ్యవసాయం చేసుకుంటూ ప్రశాంతమైన జీవనం సాగించవచ్చు అని నిరూపించడమే ఫౌండేషన్ ముఖ్యమైన ఉద్దేశ్యం. ఒక గ్రామీణుడు పట్ల ఆసక్తి ఉన్న స్థానిక యువతీయువకులకు బోధనలో శిక్షణ ఇస్తున్నాము. విద్యార్థులకు భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహనను పెంచి, వారిలో వాటిని పాదుగొల్పడంతో పాటుగా వారిని యోగసాధకులుగా తయారుచేస్తున్నాము. నగరాలు, గ్రామాలలో మనం కోల్పోయిన భారతీయ కళలను పునరుద్ధరించే పనిలో ఉన్నాము. ఆ క్రమంలో చుట్టుపక్కల గ్రామాలలో సాంస్కృతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఇక్కడ ప్రధానంగా సామర్థ్య నిర్మాణ కార్యక్రమం (కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్) గురించి చెప్పుకోవాలి. ఈ కార్యక్రమంలో భాగంగా జింగుర్తి ప్రాంగణంలో నెలకు ఒకసారి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు, చూశారు. దేశవ్యాప్తంగా ఫిలిప్పైన్స్, థాయ్‌ల్యాండ్ దేశాలకు చెందిన బొప్పాయి మాత్రమే అందుబాటులో ఉంది. ఇక్కడ మాత్రం దేశీయ బొప్పాయి లభిస్తుంది. ఇదేదో లాభార్జన కోసం చేస్తున్న సాగుబడి కాదు. దేశంలో ఎక్కడ బొప్పాయిని రుచిచూసినప్పటికీ దాని రుచి గడ్డి తిన్నట్టుగా ఉంటుంది. మీరు మా బొప్పాయిని రుచి చూడండి. ఇక్కడ దొరికేది మన దేశపు బొప్పాయి. దీనికి సంబంధించిన విత్తనాలను మా నర్సరీలోనే అభివృద్ధి చేస్తాం. వాటిని భద్రపరుస్తాం. అదే విధంగా కృషి విజ్ఞాన కేంద్రలో వరికి సంబంధిం చిన దేశీయ వంగడాలను అభివృద్ధి చేయడం మొదలుపెట్టాం. కలిసివచ్చే రైతులను కలుపుకొని ముందుకు సాగడమే

దీనికి శ్రేయదాయకంగా ఉంటుంది.

నీటి వనరుల లభ్యత ఎలా ఉంది?

నీటి వనరులకు సంబంధించి మేం భూగర్భ జలాల కన్నా కూడా వర్షాల మీదనే ఎక్కువగా ఆధార పడుతుంటాం. వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవడంపైన దృష్టిని కేంద్రీకరిస్తుంటాం. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు చెందిన జింగుర్తి ప్రాంగణంలో ఏడు చెరువులున్నాయి. ఇవి అంతర్గతంగా అనుసంధానమై ఉంటాయి. వర్షాలు పడినప్పుడు ఆయకట్టుకు సమీపంలో ఉండే చెరువులో నీరు చేరుతుంది. అది చుట్టపక్కల ఉన్న బోరుబావులలో భూగర్భ జలాల మట్టాన్ని పెంచుతుంది. మిగిలిన చెరువులలో నీటి మట్టం పెరిగేలా చూస్తుంది. అలా మా ప్రాంగణం అంతా నీటి తడుపునకు నోచుకుంటుంది. ఇప్పుడైతే ఎలాంటి వర్షాలు లేవు. అయినప్పటికీ మా చెరువులలో నీరు పుష్కలంగా ఉంది.

ఇక్కడ బిందుసేద్యం(డ్రిప్ ఇరిగేషన్) వినియోగానికి ప్రత్యేక కారణం ఉందా?

బిందుసేద్యం అనేది లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుంటుంది. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నది అయినప్పటికీ నీటి వృథా ఉండదు. పంటకు ఎంత కావాలో అంతే తేమను అందిస్తుంది. దీనిని ఐదు నుంచి పదేళ్లుగా వాడుతున్న రైతులు ఉన్నారు. మేం ఐదేళ్లుగా బిందుసేద్యాన్ని ఆచరణలో పెడుతున్నాం. చివరకు వర్మికంపోస్ట్(వానపాములతో ఎరువు తయారీ)లో తేమను నిలకడగా ఉంచడానికి బిందుసేద్యాన్ని వాడుతున్నాం.

సాందీపని గురుకులంలో సనాతనం, ఆధునికతల మేళవింపును వివరిస్తారా?

భారతీయ విద్యావిధానాన్ని పరిపుష్టం చేసే దిశగా 2024లో ప్రారంభమైన సాందీపని గురుకులంలో ప్రవేశాలు నాల్గవ తరగతి నుంచి మాత్రమే ఉంటాయి.కేంద్ర ప్రభుత్వం పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)కు లోబడి గురుకులం పాఠ్య ప్రణాళిక ఉంటుంది. ఎన్ ఐఓఎస్ అందించే కోర్సులకు, సాందీపని గురుకులం ధ్యేయానికి ఎంతో సారూప్యం ఉంది. ప్రస్తుతం కోర్సుల నుంచి భవిష్యత్తులో నైపుణ్యాల అభివృద్ధి, ఆంట్రో పెన్యూర్ (ఔత్సాహిక



పారిశ్రామికవేత్త) కోర్సుల వరకు విద్యార్థులకు అందించాలని అనుకుంటున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే గురుకులంలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకొని బయటి ప్రపంచంలో అడుగుపెట్టే విద్యార్థులు 10 మందికి ఉద్యోగాలను అందించే వారిగా(జాబ్ గివర్స్) అవతరించాలే తప్ప ఉద్యోగాలను ఆశించేవారిగా(జాబ్ సీకర్స్) ఉండ కూడదనే దిశగా ఇక్కడి విద్యావిధానం పనిచేస్తుంది. అందుకనే గురుకులం విద్యార్థులు ఒకవైపు వేదాలను చదువుకుంటూనే మరోవైపు డ్రోన్లు ప్రయోగిస్తుంటారు. ఇక్కడ విద్యార్థులు తెల్లవారుజామున నాలుగన్నర గంటలకే నిద్ర లేస్తారు. వారి దినచర్య ఉదయం నాలుగున్నర గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగుతుంది. ఉదయం ఏడు గంటలకు యజ్ఞాలు చేస్తారు. దాంట్లో మీకు భారతీయత కనిపిస్తుంది. మధ్యాహ్నం కంప్యూటర్ ల్యాబ్‌లో కృత్రిమ మేధస్సు(ఏఐ)ను నేర్చుకుంటారు. ఏడవ తరగతి నుంచి కంప్యూటర్ ల్యాబ్‌తో పాటుగా జీవశాస్త్రం, రసాయన శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగశాలలు గురుకులంలో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) వాటిని సమకూర్చాయి. ఈ ప్రయోగ శాలల్లో సాధారణ పాఠ్య ప్రణాళికతో పాటుగా అధునాతన నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పిస్తున్నాం.

గురుకులంలో విద్యార్థులకు సామూహిక ఉపనయనం చేయిస్తారని విన్నాము. విద్యాభ్యాసంలో దానికి అంతటి ప్రాముఖ్యత ఉందా?

గురుకులం విద్యార్థులు 12 సంవత్సరాలపాటు బ్రహ్మచర్య దీక్ష చేపట్టాల్సి ఉంటుంది. మా గురుకులంలో చేరిన విద్యార్థులు బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తారు కాబట్టి కులమతాలకు అతీతంగా కొత్తగా నాల్గవ తరగతిలో చేరిన విద్యార్థులతో గురుపూర్ణిమ నాడు సామూహిక ఉపనయనం చేయిస్తాము. ఆ రోజున తల్లిదండ్రులు, గురువులు ఇలా అందరి ఆశీస్సులతో వారు ఆ దీక్షకు నాంది పలుకుతారు. ఇక్కడ కులాలు, మతాల పట్టింపు ఉండదు. వాటిని గురించి పిల్లలను అడిగే ప్రసక్తి ఉండదు. కేవలం ప్రభుత్వానికి సమర్పించే రిజిస్టర్‌లో మాత్రమే పిల్లల కులం, మతం వివరాలు ఉంటాయి. గురుకులానికి సంబంధించిన రిజిస్టర్‌లో వాటి ఊసే ఉండదు. విద్యార్థులకు ఎలాంటి ఫీజులు ఉండవు. విద్యార్థుల ఆసక్తి ప్రధానంగా ఇక్కడ విద్యాబోధన ఉంటుంది.

గురుకులంలో ప్రవేశాల ప్రక్రియ ఎలా ఉంటుంది?

సాందీపని గురుకులంలో ప్రతి సంవత్సరం కేవలం నాల్గవ తరగతిలోకి మాత్రమే విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను ఇప్పటివరకు మేం నిర్వహిస్తూ వస్తున్నాం. 40మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రతిసంవత్సరం అక్టోబర్, నవంబర్ మాసాలలో దసరా సెలవులలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ అవుతుంది. మొదటగా అభ్యర్థులకు పరీక్ష ఉంటుంది. ఇక్కడి గురుకులం బాలురకు ఉద్దేశించినది అయితే విజయవాడలో మాకు అనుబంధ సంస్థ అయిన నివేదిత గురుకులం బాలికల కోసం నడుస్తున్నది. రెండు గురుకులాలకు కలిపి ప్రవేశ పరీక్ష ఉంటుంది.

సీయీఓ వల్లభజోస్యుల శ్రీనివాస్‌తో జాగృతి ప్రతినిధి మహేష్ ధూళిపాళ్ళ

పరీక్ష రాయడానికి దాదాపు 700 మంది దరఖాస్తు చేసుకుంటారు. దరఖాస్తుల వడపోత తర్వాత ఎంపికైన వారు పరీక్ష రాస్తారు. ఉత్తీర్ణులైన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తాము. సాందీపని గురుకులానికి సంబంధించి తల్లిదండ్రులు, బాలుడు, నివేదిత గురుకులం విషయానికి వస్తే తల్లిదండ్రులు, బాలిక ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుంది. వారి ఆలోచనాధోరణి ఎలా ఉంది? పిల్లవాడి మనోగతి ఎలా ఉంది? తెలుసుకోవడానికి ఈ ఇంటర్వ్యూ జరుగుతుంది. విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇదే ప్రాంగణంలో విద్యార్థులకు వేసవి శిబిరం నిర్వహిస్తాము. విద్యార్థుల భావజాలం, వారిలో ఎంతవరకు సర్దుకొనిపోయే మనస్తత్వం ఉన్నది తెలుసుకోవడమే శిబిరం ముఖ్యోద్దేశ్యం. ఆ తర్వాత జూన్‌లో గురుకులంలో తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం నాల్గవ తరగతిలో మూడవ బ్యాచ్ విద్యార్థులు చేరారు. ఈ బ్యాచ్‌లో 42 మంది విద్యార్థులు ఉన్నారు.

ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల గురించి చెప్పండి

పదవ తరగతి తర్వాత రెండేళ్ల కోర్సు ఇక్కడ ఉంటుంది. ఇక్కడ కోర్సు చేసిన మొదటి, రెండవ బ్యాచులకు చెందిన విద్యార్థులు మా దగ్గరే ఉద్యోగాలు చేస్తున్నారు. ఇక్కడ ఉత్తీర్ణులై ఆ తర్వాత అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన వారిలో కొందరు సైతం ఈ ప్రాంగణంలో ఉపాధి పొందుతున్నారు. అలా కాకుండా కళాశాల నుంచి బైటకు వెళ్లిన మిగిలిన వారు కూడా ఫౌండేషన్ కార్యకలాపాల్లో ఏదో రూపంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అయితే కళాశాల స్థాయి నుంచి కాకుండా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో భారతీయతను పాదుగొల్పడానికే సాందీపని గురుకులం నెలకొల్పాము.

దేశీయ ఉత్పత్తులకు సంబంధించి నిరామయ ఉత్పాదన ఎలాంటి పాత్రను పోషిస్తున్నది?

విదేశీ ఉత్పత్తులపైన, నగరంలో దొరికే వస్తువులపై ఆధారపడటానికి బదులుగా నిరామయ ఉత్పాదన కేంద్రంగా మనకు స్థానికంగా లభించే కుంకుడుకాయలు, శీకకాయ వంటి వాటితో సబ్బులు, షాంపూలు, తలనూనె, పళ్ల పొడి లాంటి 25 దేశీయ ఉత్పత్తులను తయారుచేస్తున్నాము. వాటిని తయారుచేసే విధానాన్ని చుట్టుపక్కల గ్రామాలవారికి నేర్పుతున్నాము. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ మార్గాన్ని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చూస్తున్నది. అలొవెరా సబ్బులకు సంబంధించిన తయారీ ప్రక్రియను కృషి విజ్ఞాన కేంద్రంలో చేస్తున్నాం. ఇందులో స్థానిక మహిళల భాగస్వామ్యం మిన్నగా ఉంది. ఆ విధంగా చూసినప్పుడు నిరామయ ఉత్పాదన విషయంలో మేం అనతికాలంలోనే విజయాన్ని సాధించాము.

ఈ ప్రాంగణంలో వేర్వేరు వృత్తి,వ్యాపకాల్లో ఎక్కువగా జెన్‌జెడ్, యువతీయువకులు కనిపిస్తున్నారు. మీరు యువకులు కావడం వల్ల ఇక్కడ జెన్‌జెడ్ పాత్ర ప్రముఖంగా ఉన్నదని భావించవచ్చా?

ఇప్పటి జెన్‌జెడ్ ఇలా ఆలోచిస్తున్నదంటే(గ్రామీణ వికాసం, భారతీయత) ముమ్ముందు తరాలు ఇంకెంత గొప్పగా ఆలోచించాలి అనే ఆశయంతో మా పెద్దలు చేపట్టిన మహా యజ్ఞమిది(ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్). అలా మేమంతా ఆకర్షితులయ్యాము. నేను కూడా కార్పొరేట్ ఉద్యోగాన్ని కాదనుకొని ఇక్కడకు వచ్చేశాను. ఒక స్ఫూర్తిగా మేమంతా ఇక్కడి పనులలో పాలుపంచుకుంటున్నాము. జెన్‌జెడ్ మాత్రమే కాదు జెన్‌జెడ్ ప్లస్ కూడా ఇక్కడ ఉన్నారు. మా గురుకులం విద్యార్థులు కూడా ఇందులో భాగస్వాములే. భారతీయత అంటే ఇదే. సమష్టి పాలన (కలెక్టివ్ గవర్నెన్స్), సామాజిక బాధ్యత (సోషల్ రెస్పాన్స్‌బిలిటీ)ల మేలు కలయిక.

ఎక్కడాలేని సమీకరణ ఇక్కడ ఎలా సాధ్యమైంది?

ఆలోచన గట్టిదైతే సమీకరణ దానంతట అదే సాధ్యమవుతుంది. ఇక్కడ మనుషుల కన్నా ధ్యేయం గొప్పది. మనుషులు మారతారు. ఆ బాధ్యత (సమష్టి పాలన, సామాజిక బాధ్యత) అలా ఇచ్చారు. అది మా పెద్దల సంకల్ప బలం తప్ప మరొకటి కాదు.

కార్పొరేట్ ఉద్యోగాన్ని కాదనుకున్న మీ నేపథ్యం

పాలిటెక్నిక్ ప్రయోగశాల

గురించి చెబుతారా?

నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదివాను. 2009లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చేశాను.ఆ తర్వాత చాలా కంపెనీల్లో పని చేశాను. చివరగా భారత్ ఫోర్జ్ కంపెనీలో కార్పొరేట్ ఎఫైర్స్‌లో విధులు నిర్వర్తించాను. మా పెద్దల ప్రోద్బలంతో దీంట్లోకి (ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్) అడుగుపెట్టాను. ఒక విధంగా నాకు ఇది కల్చర్ షాక్ (సాంస్కృతిక ఆఘాతం.. పూర్తిగా కొత్త రంగంలోకి అడుగుపెట్టడం). చాలా దేశాల్లో తిరిగాను. విదేశాలలో పనిచేశాను. ఇక్కడ లేని అభివృద్ధి అక్కడ(విదేశాలు) ఎలా వచ్చిందంటే అక్కడి వారు వారి గ్రామాలను మర్చిపోలేదు. భారత్ కూడా ఎప్పుడూ మర్చిపోలేదు (గ్రామాలను). మనదేశం మళ్లీ తన పూర్వ వైభవానికి చేరుకుంటుంది అనేందుకు నిదర్శనమే ఈ ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆవిర్భావం.

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్క ఆలోచనకు ప్రచారం కీలకంగా మారింది. మీ ఫౌండేషన్‌ను ఏ విధంగా ప్రచారం చేస్తున్నారు?

ప్రస్తుతానికి మేము ఆ దిశగా ఆలోచన చేయలేదు. అంటే అందరినీ కలుపుకొనిపోవాలనే ఆలోచన ఐతే మాకు వచ్చింది కానీ మేం చేస్తున్న పనిని ప్రచారం చేసుకోవాలనే ఆలోచనైతే ఇప్పటి వరకు రాలేదు. అలాంటి ఒక ఆలోచన మా వ్యవస్థాపకులకు రాలేదు.. మాకూ రాలేదు. కానీ మాకు సంబంధించిన ప్రచారం అంతా కూడా నోటి మాట ద్వారానే జరుగుతున్నది. మీడియా, ప్రచురణ కర్తలు ద్వారా కొంత ప్రచారం లభిస్తున్నది. కానీ మేము ఫలానా పని చేస్తున్నాము అని చెప్పుకోవడంలో కన్నా కూడా ఎలాంటి ప్రచారం లేకుండా గుర్తింపు పొందడంలోనే ఎక్కువ ఆనందం ఉంటుంది. మేం చేస్తున్న కృషిని గుర్తించండి. మేం మీతో కలిసి నడుస్తాము. మీరూ మాతో కలిసి నడవండి. అందరం కలిసే నడుస్తాం కదా. అయితే మా ఉత్పత్తులకు సంబంధించినంతవరకు మార్కెటింగ్ చేయకతప్పదు. అది కూడా చేయడం ఎందుకు అంటే చుట్టుపక్కల గ్రామాలలో మేం చేస్తున్న ఉత్పత్తుల పట్ల ఆసక్తి కలిగిన ప్రజలు వాటిని స్వయంగా తయారు చేసినప్పుడు వాటికి మార్కెట్ సృష్టించాలి. లేకపోతే ఉత్పత్తి దారుడు మోసపోయాను అనే భావనలో మిగిలిపోతాడు. అలాంటి భావన కుదరదు.. కుదిరించ కూడదు అని మార్కెటింగ్ వైపు కృషి మాత్రం చాలానే చేస్తున్నాము. చుట్టుపక్కల గ్రామాలకు, హైదరాబాద్ నగరంలో కొన్ని చోట్లా నిరామయ ఉత్పాదనలను విక్రయిస్తున్నాము. కృషి విజ్ఞాన్ కేంద్ర ఉత్పత్తులను కూడా విక్రయిస్తున్నాము. అలాగే దేశీయ పసుపును ఇక్కడే పండిస్తున్నాము. ఇక్కడే పసుపును చూర్ణంగా

చిన్న చెరువు

చేసి నగరానికి చేరవేస్తున్నాము. మా కళాశాల, గురుకులం.. ఇలా ఇక్కడ ఉన్న అన్ని శాఖలు కూడా ఇక్కడ తయారయ్యే వాటినే వినియోగిస్తున్నాయి. వాటితోనే నరిపెట్టుకుంటు న్నాయి. తద్వారా భారతీయతను, గ్రామీణ జీవనాన్ని త్రికరణశుద్ధితో పాటిస్తున్నాయి.

ఫౌండేషన్ కార్యకలాపాలపై వలసల ప్రభావం ఎలా ఉంది?

ఈ ఫౌండేషన్ పెట్టిందే రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్ (వలస పోయిన వారిని తిరిగి రప్పించే ప్రక్రియ) చేయడానికి. ఉన్నచోటనే చేసి చూపించాలి కానీ.. దీనిని(గ్రామీణ వికాసం) నగరంలో ఉండి చేసి చూపిస్తానంటే అది ఎంతవరకు సమంజసం అవుతుంది? ఇది (జింగుర్తి ప్రాంగణం) హైదరాబాద్ నగరానికి 120 కి.మీ.ల దూరంలో ఉంది. ఎంతో ప్రశాంతమైన జీవనం ఇక్కడ ఉంది. నగరాలకు వలసవెళ్లిన రైతులు అక్కడ ఆత్మాభిమానంతో జీవిస్తున్నారా? ఇక్కడే ఉండి ఆత్మాభిమానంతో జీవించడానికి ఇదే దారి అని చూపించడమే ఈ ఫౌండేషన్ ముఖ్యోద్దేశ్యం. ఇక్కడ ఉండి కూడా

సంపాదన చేయవచ్చు.

దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ, సహకారాలు లభిస్తున్నాయి?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)గా పలు కంపెనీలు మాకు సంపూర్ణ సహాయ, సహకారాలను అందిస్తు న్నాయి. ఆలోచన ఒకటే అయినప్పుడు సహాయ సహకారాలకు కొదవ ఉండదు.

భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తారా?

చుట్టుపక్కల 100 గ్రామాలతో పాటుగా మా అనుబంధ సంస్థలతో కలిసి మేం చేస్తున్న పనిని ఒక రోల్ మోడల్ (ఆదర్శ నమూనా)గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పెట్టుకున్నాము. ఇదే మోడల్‌ను మీరు ఎక్కడైనా అమలు చేయవచ్చు. ఇప్పటికే మేం చేస్తున్న దాంట్లో విజయం సాధించాము. సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. వైద్య, ఆరోగ్య సేవల రంగంలోకి అడుగుపెట్టాము. వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాము. వైద్య సేవలు అందుబాటులో లేని గ్రామాలలోకి కూడా మా సేవలను విస్తరిస్తున్నాము. ఇదే జింగుర్తి ప్రాంగణంలో హృద్రోగాలకు సంబంధించిన వైద్య శిబిరాలను నిర్వహించాము. ప్రతి నెలా రెండవ, నాల్గవ మంగళవారాల్లో నేత్ర శిబిరాలను చేపడుతున్నాము. కంటిలో శుక్లాలతో ఇబ్బందిపడేవారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాము. ఆ క్రమంలో వారిని ఇంటి నుంచి ఆస్పత్రికి సురక్షితంగా తీసుకొని వెళ్లి, శస్త్ర చికిత్స అనంతరం వారిని ఇంటికి తిరిగి చేర్చే బాధ్యతను కూడా మేమే తీసుకుంటున్నాము.మా తదుపరి కార్యాచరణగా మహిళలు, బాలికల ఆరోగ్యంపై దృష్టిని కేంద్రీకరించనున్నాము. మూత్రపిండాలకు సంబంధించిన వైద్య, ఆరోగ్య కార్యక్రమాన్ని చేపట్టాలని అనుకుంటున్నాము. ఈ విధంగా ఒక గ్రామాన్ని ఎన్ని విధాలుగా ఆదుకో గలమో అన్ని విధాలుగా ఆదుకుంటూ, అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్లాలనేదే ఈ ఫౌండేషన్ ధ్యేయం.

ఇంటర్వ్యూ: మహేష్ ధూళిపాళ్ల

పాక్‌పై భస్మాసురహ

పాకిస్తాన్‌కు భస్మాసుర హస్తంగా మారిన ఆక్రమిత జమ్ము కశ్మీర్ (పీఓకే)లో ప్రస్తుతం తీవ్రమైన ప్రజా తిరుగుబాటు, పౌర అశాంతి నెలకొంది. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జాక్) ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు పాకిస్తాన్ ప్రభుత్వం సైనిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా భారీ నిరసనలు, లాంగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నారు. భద్రతాదళాల కాల్పులు, హింసాత్మక ఘర్షణల కారణంగా ఇప్పటి వరకు సుమారు 30 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వందలాదిమంది గాయపడ్డారు. నిరసనలను అణచివేయడానికి పాక్ ప్రభుత్వం 'జాక్' (జెఎఎసి)సంస్థను ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధించింది. ఆ సంస్థ ముఖ్య నాయకుడు షౌకత్ నవాజ్ మీర్‌తో పాటు 600మందికి పైగా సామాజిక కార్యకర్తలను అరెస్ట్ చేసింది. ఈ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసారు, కఠినమైన కర్ఫ్యూ విధించారు.

సరిహద్దులు, రహదారుల దిగ్బంధనం కారణంగా ఆహార పదార్థాలు, మందుల సరఫరా నిలిచిపోయి తీవ్ర మానవతా సంక్షోభం ఏర్పడింది. నిరసనకారుల నేతృత్వంలోని 'జాక్' నాయకులు ఇప్పటికే ఆహార, మందుల కొరత దృష్ట్యా తమకు సహాయం చేయాలని, నియంత్రణ రేఖ మార్గాలను తెరవాలని భారతదేశానికి బహిరంగ విజ్ఞప్తిచేస్తున్నారు. కొందరు నిరసనకారులు తమను భారత్‌తో విలీనం చేయాలని, అందుకు సహాయం చేయాలని బహిరంగంగా కోరుతున్నారు. మొదట్లో నిరసనకారులు భారత్‌తో విలీనం కోరలేదు. కాకపోతే తమకు కావలసిన ఆహారపదార్థాల సరఫరాతో పాటు, తమ హక్కుల పరిరక్షణకు పాక్ ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. తర్వాత క్రమంగా తమకు స్వాతంత్ర్యం కావాలనే స్థాయికి వీరి డిమాండ్లు చేరాయి. తాజాగా తమకు పాక్ వద్దు, భారత్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తిరుగుబాటుకు కారణాలు

పీఓకేలో మంగ్లా డ్యామ్‌వంటి జలవిద్యుత్ ప్రాజెక్టుల ద్వారా చౌకగా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కానీ, ఆ విద్యుత్‌ను పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రాంతానికి తరలించి, స్థానిక పీఓకే ప్రజలకు మాత్రం విపరీతమైన పన్నులతో భారీ కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్నారు. గోధుమలు, పిండివంటి ప్రాథమిక ఆహారపదార్థాలపై పాక్ ప్రభుత్వం సబ్సిడీలను ఎత్తివేయడంతో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందకుండాపోయాయి. పీఓకే పరిపాలన అంతా పాకిస్తాన్ మిలిటరీ, పంజాబీ రాజకీయ నాయకుల చేతుల్లోనే ఉంది. స్థానిక కాశ్మీరీలకు ఎలాంటి స్వయంప్రతిపత్తి లేదా సరైన ప్రాతినిధ్యం లేదు. జూలై 27న జరగబోయే స్థానిక ఎన్నికల కోసం, పీఓకే శాసనసభలో శరణార్థుల పేరిట 12 స్థానాలను పాక్ కేంద్ర ప్రభుత్వం రిజర్వ్ చేసింది. దీనిద్వారా పాక్ పాలకులు తమకు నచ్చిన వెలుపలి వ్యక్తులను గెలిపించుకుని స్థానిక అసెంబ్లీని నియంత్రిస్తున్నారని, ఈ 12 సీట్లను రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం దశాబ్దాలుగా ఈ ప్రాంత వనరులను వాడుకుంటూ, ఇక్కడి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యరంగాలను పూర్తిగా నిర్లక్ష్యంచేసింది. తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న వారిపై సైన్యం తూటాల వర్షం కురిపించడం ప్రజల్లో తిరుగుబాటు కసిని మరింత పెంచింది.

పాక్ సైన్యం, ఐఎస్ఐ వ్యూహం

జూలై15న జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జాక్) నేతృత్వంలో ముజఫరాబాద్‌కు భారీ "లాంగ్ మార్చ్"కు పిలుపునిచ్చారు. పాకిస్తాన్ ప్రభుత్వం, దాని నిఘా సంస్థ ఐఎస్ఐలు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జాక్) నేతృత్వంలో నిర్వహించ తలపెట్టిన దీనిని అణచి వేయడానికి, పక్కదారి పట్టించడానికి నిషేధిత ఉగ్రవాద సంస్థలను వాడుకోవాలని చూస్తున్నట్లు అంతర్జాతీయ నిఘావర్గాలు హెచ్చరికలు జారీచేశాయి. దీనిని నేరుగా అణచివేస్తే ప్రపంచవ్యాప్తంగా చెడ్డపేరు వస్తుందని భావించిన పాక్ సైన్యం, తమ గుప్పిట్లో ఉండే జైషే మహ్మద్ (జెమ్), లష్కర్-ఎ-తొయిబా (లెట్) వంటి ఉగ్రవాద గ్రూపుల సహాయంతో ఈ నిరసనల్లోకి చొరబడి హింసను, అల్లర్లను రేపాలని చూస్తోంది. ప్రస్తుతం ఈ ప్రజా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తుండడంపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు రక్షణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ మార్చ్‌ను జూలై 21వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, రావలాకోట్, మీర్‌పూర్, కోట్లి, బాగ్‌వంటి ప్రధాన నగరాల్లో ధర్నాలు, నిరసన శిబిరాలు కొనసాగుతున్నాయి. విద్యుత్ బిల్లుల తగ్గింపు, గోధుమపిండిపై సబ్సిడీలు, అదనపు పన్నుల రద్దు, తమ కార్యకర్తలను విడుదల చేయాలని శరణార్థుల పేరిట అసెంబ్లీలో కేటాయించిన 12 స్థానాలను రద్దుచేయాలని, పాక్ ప్రధాన రాజకీయపార్టీల జోక్యాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇస్లామాబాద్‌పై ఒత్తిడి

ఈ నిరసనలు పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వ పరిపాలనా నియంత్రణకు మునుపెన్నడూ లేని విధంగా ఒక పెద్ద సవాలుగా మారాయి. నిరసన కారుల డిమాండ్లను నెరవేరిస్తే పాక్ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుంది, నెరవేర్చకపోతే ఉద్యమం మరింత

హింసాత్మకంగా మారుతుందని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం భయపడుతోంది. ఇదిలావుండగా జేఏఏసీ కీలక నాయకుడు సర్దార్ అమ్మాన్‌ఖాన్ మాట్లాడుతూ, ఈ ప్రాంతాన్ని ఇకపై 'వివాదాస్పద ప్రాంతం' అని కాకుండా పాకిస్తాన్ "బలవంతంగా ఆక్రమించిన ప్రాంతం" అని పిలవాలని బహిరంగంగా పిలుపునిచ్చారు. ఈ ప్రకటన పాకిస్తాన్ దశాబ్దాలుగా ప్రచారం చేస్తున్న అంతర్జాతీయవాదనను దెబ్బతీసింది. పీఓకేలో జూలై 27న స్థానిక అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది.

పరిస్థితి నియంత్రణ తప్పితే...

పాక్ రేంజర్లు, సైన్యం భారీగా బలగాలను ప్రయోగించి కాల్పులు జరుపుతుండడంతో, ప్రజలు

స్తం: పీఓకే

కూడా ఎదురుదాడికి దిగే అవకాశం ఉంది. ఇది పీఓకేని ఒక స్వతంత్ర సాయుధపోరాటం లేదా అంతర్యుద్ధంవైపు నెట్టవచ్చు. ఇప్పటికే ఆహారం, మందుల సరఫరా నిలిచిపోయింది. ఇంటర్నెట్, కమ్యూనికేషన్ బ్లాకౌట్ వల్ల లక్షలాదిమంది ప్రజలు ఆకలితో, వైద్యం అందక అల్లాడిపోయే తీవ్ర సంక్షోభం ఏర్పడుతుంది. గిల్గిత్–బల్టిస్తాన్, పీఓకేలోని స్థానిక పోలీసు బలగాలు కూడా పాక్ ఆర్మీ పంజాబీ ముఠా చర్యలను వ్యతిరేకించి, సొంత ప్రజలవైపు నిలబడే ప్రమాదం ఉంది. ఇది పాక్ సైన్యంలో

అంతర్గత చీలికకు దారితీయవచ్చు. బలూచిస్తాన్ ఇప్పటికే స్వాతంత్ర్యం ప్రకటించుకుంది (ఇంతవరకు ఏ దేశం దాన్ని గుర్తించలేదు). ఖైబర్ పఖ్తున్‌ఖ్వా (కేపీకే)లో ఇప్పటికే తీవ్రవాద దాడులు, అశాంతి ఉన్నాయి. ఇప్పుడు పీఓజేకే కూడా పూర్తిగా చేజారితే, పాకిస్తాన్ దేశం ముక్కలయ్యే పరిస్థితి వస్తుంది.

భారత్‌కు నైతిక విజయం

పాకిస్తాన్ దశాబ్దాలుగా అంతర్జాతీయ సమాజం ముందు "కశ్మీరీ ప్రజలు భారత్‌ను వ్యతిరేకిస్తున్నారు" అని అబద్ధపు ప్రచారం చేస్తోంది. కానీ ప్రస్తుతం తమ ఆధీనంలో ఉన్న పీఓజేకే ప్రజలే పాక్ సైన్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం, భారత్ నుండి మానవతా సహాయంకోరడం, భారత్‌లో కలిసి పోతామని చేసిన హెచ్చరికతో పాక్ ముసుగు పూర్తిగా తొలగిపోయింది. ఇది అంతర్జాతీయ వేదికలపై భారతదేశ దౌత్యపరమైన నైతిక విజయాన్ని చాటి చెబుతున్నది. ఒకవేళ పీఓకేలో పరిస్థితి చేయిదాటి, అది అధికారికంగా భారతదేశంలో విలీనమైతే భారత్‌కు అపారమైన వ్యూహాత్మక బలం చేకూరుతుంది. ప్రస్తుతం భారత్‌కు ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా దేశాలతో వ్యాపారం చేయడానికి నేరుగా భూమార్గం లేదు. పీఓకే భారత్ చేతికి వస్తే, పాకిస్తాన్‌తో సంబంధం లేకుండానే భారత్ ఆయా దేశాలతో అనుసంధానం కాగలదు. ప్రపంచంలో చైనా విస్తరణవాదానికి అడ్డుకట్ట వేసిన ఏకైక గ్లోబల్ లీడర్‌గా భారత్ అవతరిస్తుంది. పీఓకేలో ఉన్న అపారమైన జలవిద్యుత్ వనరులు, పర్యాటక రంగాన్ని భారత్ సుస్థిర పద్ధతిలో అభివృద్ధి చేయగలదు. ఇప్పటికే ఆర్టికల్ 370 రద్దు తర్వాత భారత జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధిని చూసే పీఓకే ప్రజలు ఆకర్షితులవుతున్నారు. 1994 ఫిబ్రవరి 22న భారత పార్లమెంట్ ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానం ప్రకారం పీఓకే భారతదేశంలో అంతర్భాగం.

స్వాధీనానికి చట్టపరమైన అవకాశాలు

భారతదేశం ఒకవేళ పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్(పీఓకే)ని చట్టబద్ధంగా తిరిగి స్వాధీనం చేసుకోవాలని భావిస్తే, అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి (యూఎన్ఎస్సీ) తీర్మానాల ప్రకారం భారత్‌కు బలమైన, తిరుగులేని చట్టపరమైన అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, 1947 అక్టోబర్ 26న జమ్మూ కశ్మీర్ పాలకుడైన మహారాజా హరిసింగ్ 'ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ యాక్సెషన్'పై సంతకం చేసి, తన రాజ్యాన్ని పూర్తిగా భారత్‌లో విలీనం చేశారు. 1947నాటి 'ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్' ప్రకారమే ఈ విలీనం జరిగింది. కాబట్టి, పీఓకే, గిల్గిత్ –బల్టిస్తాన్‌లతో సహా మొత్తం జమ్మూ కశ్మీర్ భూభాగం చట్టబద్ధంగా భారత్‌దే. పాకిస్తాన్ అక్కడ కేవలం ఒక 'ఆక్రమణదారుడు' మాత్రమే. 1948 నాటి యూఎన్ఎస్సీ తీర్మానం ప్రకారం మూడు దశలున్నాయి. మొదటి దశగా పాకిస్తాన్ తన సైన్యాన్ని, గిరిజన ముఠాలను జమ్మూ కశ్మీర్ మొత్తం భూభాగం నుండి పూర్తిగా ఉపసంహరించుకోవాలి. పాకిస్తాన్ తన సైన్యాన్ని ఉపసంహరించుకున్న తర్వాతే, శాంతి భద్రతల పరిరక్షణ కోసం భారత సైన్యం అక్కడ మోహరించాలని తీర్మానం పేర్కొంది. పాకిస్తాన్ గత 78 ఏళ్లుగా మొదటి షరతునే అమలు చేయలేదు కాబట్టి, ఆ తీర్మానం ప్రకారం కూడా ఆ భూభాగంపై పాక్‌కు ఎలాంటి హక్కులేదు. బాంగ్లాదేశ్ యుద్ధం తర్వాత భారత్–పాక్‌ల మధ్య కుదిరిన 'సిమ్లా ఒప్పందం' ప్రకారం, కశ్మీర్ వివాదాన్ని కేవలం ఇరు దేశాలే ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. పీఓకేని తిరిగి తీసుకునే క్రమంలో అంతర్జాతీయ జోక్యాన్ని చట్టబద్ధమని భారత్ తిరస్కరించవచ్చు. అంతర్జాతీయ చట్టంలోని "యూటిపోసిడెటిస్ జురిస్" సూత్రం ప్రకారం, ఒక దేశం సుదీర్ఘకాలం పాటు ఒక భూభాగాన్ని నియంత్రిస్తుంటే, దానిని మార్చడం అంత సులభం కాదు. పీఓకేలో చైనా బిలియన్ల డాలర్ల సీపెక్ పెట్టుబడులు పెట్టింది కాబట్టి, భారత్ అక్కడ సైనికచర్యకు దిగితే చైనా అంతర్జాతీయ వేదికలపై (ఐరాసలో వీటో ద్వారా) భారత్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఒకవేళ పీఓకేలో ప్రజా తిరుగుబాటు తీవ్రమై, అక్కడి ప్రజలే స్వచ్ఛందంగా పాక్ నియంత్రణను ధిక్కరించి భారత్‌లో విలీనం కావాలని కోరితే, అంతర్జాతీయ చట్టం ప్రకారం 'స్వయం నిర్ణయాధికారం', 'మానవతా దృక్పథ జోక్యం' కింద భారత్ ఆ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తిరుగులేని గ్లోబల్ మద్దతు లభిస్తుంది.

భారత్‌పై ప్రభావం

పాక్ సైన్యం దాడులు తట్టుకోలేక, ఆకలితో అలమటించే పీఓకే ప్రజలు సరిహద్దులు దాటి భారతదేశం (జమ్మూ కశ్మీర్) వైపు వచ్చే ప్రమాదం ఉంది. నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) ద్వారా తమకు మానవతా సహాయం అందించాలని నిరసనకారులు ఇప్పటికే విజ్ఞప్తి చేస్తున్నారు. పాక్ సైన్యం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి భారత్‌తో సరిహద్దు ఘర్షణలు సృష్టించవచ్చు. భారత సైన్యం ఎల్ఓసీ వెంబడి అత్యంత కఠినమైన నిఘా ఉంచాల్సి వస్తుంది."మాకు పాకిస్తాన్ వద్దు, భారత్‌తో విలీనం చేయండి" అనే పీఓకే ప్రజల నినాదాలు ప్రపంచవేదికలపై భారతదేశ వాదనను బలపరుస్తాయి. 1947 నుండి పీఓకే భారత్‌లో అంతర్భాగమేనన్న ఢిల్లీ పార్లమెంట్ తీర్మానానికి ఇది మరింత ఊతాన్ని ఇస్తుంది. పీఓకేలో మానవ హక్కుల ఉల్లంఘనపై పాకిస్తాన్‌ను ప్రపంచ దేశాలు దోషిగా నిలబెట్టేలా భారత్ దౌత్యపరమైన ఒత్తిడి తీసుకురాగలదు. చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) ప్రాజెక్టులు పీఓకే, గిల్గిత్ మీదుగానే సాగుతాయి. ఇక్కడ అశాంతి ఎక్కువైతే చైనా పెట్టుబడులు ఆగిపోతాయి. ఇది వ్యూహాత్మకంగా చైనా, పాక్ కూటమిని దెబ్బతీస్తుంది.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఒక బిందెడు నీటి కోసం మైళ్ల దూరం నడవడం, బావి దగ్గర గంటల తరబడి వరుసలో నిరీక్షించడం.. ఇది కొన్ని తరాల గ్రామీణ భారత స్త్రీల నిత్య అనుభవం. ఆరేళ్ల క్రితం వరకూ దేశంలోని 19.36 కోట్ల గ్రామీణ కుటుంబాల్లో కేవలం 3.23 కోట్ల మందికి, అంటే 17శాతానికి మాత్రమే, ఇంటి వద్ద కుళాయి కనెక్షన్ ఉండేది.

భారత ప్రధాని నరేంద్ర మోదీ 2019 ఆగస్టు 15న ప్రారంభించిన 'జల్ జీవన్ మిషన్' ఈ చిత్రాన్ని సమూలంగా మార్చింది. 2026 నాటికి దేశ వ్యాప్తంగా 15.80 కోట్ల కుటుంబాలకు (81.6%) కుళాయి నీరు చేరింది. ప్రతి వ్యక్తికీ రోజూ 55 లీటర్ల సురక్షిత నీటిని ఇంటి వద్దే అందించడం ఈ మిషన్ ప్రాథమిక లక్ష్యం.

కేంద్ర ప్రభుత్వ సంకల్పం - జాతీయ స్థాయి జల యజ్ఞం

ఈ పరివర్తన వెనుక కేంద్ర ప్రభుత్వ స్పష్టమైన దార్శనికత, సుస్థిర నిబద్ధత ఉన్నాయి. ఎర్రకోట బురుజుల నుంచి ప్రధాని ప్రకటించిన 'హర్ ఘర్ జల్' (ప్రతి ఇంటికీ కుళాయి నీరు) అనే లక్ష్యం ఒక పథకం స్థాయిని దాటి జాతీయ ప్రాధాన్యాంశంగా మారింది. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని తాగునీరు, పారిశుధ్య విభాగం (DDWS) దీన్ని అమలు చేస్తోంది. ప్రతి గ్రామీణ ఇంటికీ క్రియాశీల గృహ కుళాయి కనెక్షన్ (FHTC) ద్వారా రోజుకు తలసరి కనీసం 55 లీటర్ల సురక్షిత నీరు అందించడమే ప్రామాణిక లక్ష్యం. ఆరేళ్లలోనే దేశంలో కవరేజ్ 17 శాతం నుంచి 81 శాతానికి చేరడం, సుమారు 12 కోట్లకు పైగా కొత్త కుటుంబాలకు నీరు చేరడం అన్నది బలమైన రాజకీయ సంకల్పం, నిరంతర నిధుల ప్రవాహం లేకుండా సాధ్యమయ్యేది కాదు.

ఈ లక్ష్యం వెనుక గణనీయమైన ఆర్థిక నిబద్ధత ఉంది. 2019లో సుమారు రూ. 3.60 లక్షల కోట్ల వ్యయ అంచనాతో ప్రారంభమైన ఈ మిషన్లో నిధుల భాగస్వామ్యం స్పష్టమైన నమూనాలో సాగుతుంది. సాధారణ రాష్ట్రాలకు కేంద్ర–రాష్ట్ర వాటా 50:50, హిమాలయ, ఈశాన్య రాష్ట్రాలకు 90:10, కేంద్రపాలిత ప్రాంతాలకు పూర్తిగా కేంద్రమే (100%) నిధులు సమకూరుస్తుంది. మిగిలిన కుటుంబాలను చేర్చడంతో పాటు సరఫరా నాణ్యత, నిర్వహణపై దృష్టి సారిస్తూ 2025–26 కేంద్ర బడ్జెట్లో దీనిని 2028 డిసెంబర్ వరకు పొడిగించి, ఏడాదికి రూ. 67,000 కోట్లు కేటాయించారు; మొత్తం వ్యయ అంచనాతో పాటు కేంద్ర వాటానూ గణనీయంగా పెంచారు.

మిషన్ ఎలా అమలులో ప్రజల భాగస్వామ్యమే పునాది

జల్ జీవన్ మిషన్ కేవలం పైపులు, ట్యాంకుల నిర్మాణం కాదు. ఇది 'కింది నుంచి పైకి' సాగే డిమాండ్ ఆధారిత నమూనా. గ్రామ స్థాయిలో పథకాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేసే బాధ్యత గ్రామ పంచాయతీ లేదా గ్రామ నీరు–పారిశుధ్య కమిటీ (నీటి సమితి)దే. ఈ కమిటీలో కనీసం సగం మంది మహిళలు ఉండటం తప్పనిసరి. చాలా గ్రామాల్లో మౌలిక నిర్మాణ మూలధన వ్యయంలో 10శాతాన్ని (గిరిజన, ఎస్సీ/ఎస్టీ జనాభా ఎక్కువున్న గ్రామాల్లో 5శాతం) స్థానిక సమాజమే నగదు లేదా శ్రమరూపంలో భరిస్తుంది. తద్వారా నిర్మించిన సదుపాయంపై గ్రామస్థులకే యాజమాన్య భావన, బాధ్యత కలుగుతాయి.

నీటి నాణ్యత పర్యవేక్షణకు మిషన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుంది. క్షేత్రస్థాయి పరీక్షా కిట్ల (FTK) వినియోగంలో దేశవ్యాప్తంగా లక్షలమంది గ్రామీణ మహిళలకు శిక్షణ ఇచ్చి, నీటి నమూనాలను ప్రయోగ శాలల్లో పరీక్షించే వ్యవస్థను ఏర్పాటుచేశారు. అయితే కుళాయి కనెక్షన్ ఇవ్వడం ఒక మెట్టు మాత్రమే; నీరు క్రమం తప్పకుండా, తగినంత పీడనంతో, సురక్షితంగా అందడమే అసలు పరీక్ష. ప్రభుత్వ సర్వేల ప్రకారం కనెక్షన్లు దాదాపు అందరికీ చేరినా, నిత్యం నమ్మదగిన సరఫరా పొందుతున్నది మూడొంతుల వరకే. అందుకే మిషన్ ఇప్పుడు కనెక్షన్ల సంఖ్య నుంచి క్రియాశీలత, దీర్ఘకాలిక నిర్వహణ (O&M), జల వనరుల సుస్థిరత, ప్రజా భాగస్వామ్యం (జన్ భాగీదారీ) వైపు దృష్టి మళ్లిస్తోంది.

మిషన్ ఆవశ్యకత, గొప్పతనం

నీరు అందుబాటులో లేకపోవడం కేవలం అసౌకర్యం కాదు, అది ఒక సామాజిక, ఆర్థిక భారం. ఇంటి అవసరాల కోసం నీరు మోసుకురావడంలో దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలు రోజూ ఖర్చు చేసే సమయం 5.5 కోట్ల గంటలు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా; ఇందులో మూడొంతుల భారం మహిళలదే. ఈ శ్రమ నుంచి విముక్తి కల్పించడమే మిషన్ గొప్పతనం.

సురక్షిత నీరు దేశంలో దాదాపు 4 లక్షల అతిసార మరణాలను నివారించగలదని ప్రపంచ

నీరు అంటే కేవలం దాహం తీర్చే ద్రవం కాదు. అది గౌరవం, ఆరోగ్యం, సమానత్వం, జీవించే హక్కు. జల్ జీవన్ మిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ తాగునీటి కార్యక్రమాల్లో ఒకటి. లక్షలమంది మహిళల శ్రమను తగ్గించి, వేల ప్రాణాలను కాపాడగల సత్తా దానిది.

ఆరోగ్య సంస్థ పేర్కొంది. నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త మైకేల్ క్రెమర్ పరిశోధన ప్రకారం, సురక్షిత నీటి విస్తరణ ఐదేళ్లలోపు పిల్లల మరణాలను దాదాపు 30 శాతం తగ్గించగలదు. ఐఐఎం బెంగళూరు, అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా ప్రకారం, ఈ మిషన్ 59.9 లక్షల ప్రత్యక్ష ఉపాధి వ్యక్తి-సంవత్సరాలను సృష్టిస్తుంది. ఆరోగ్యం, లింగ సమానత్వం, గ్రామీణ ఆర్థికాభివృద్ధి కలిసిన ఒక సమగ్ర సామాజిక పెట్టుబడి ఇది.

నూరు శాతం సాధించిన తెలంగాణ

దేశంలో నూరు శాతం గ్రామీణ కుళాయి కనెక్షన్లు సాధించిన తొలి పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. రాష్ట్రంలోని మొత్తం 53.98 లక్షల గ్రామీణ కుటుంబాలకూ కుళాయి నీరు చేరింది. 2019 ఆగస్టు నాటికి కేవలం 15.68 లక్షల ఇళ్లకు (29.05%) మాత్రమే కనెక్షన్ ఉండగా, మిషన్ ద్వారా అదనంగా 38.29లక్షల ఇళ్లకు నీరు అందింది. రెండేళ్లలోపే ఈ లక్ష్యాన్ని చేరడం విశేషం.

2016లో రాష్ట్రం చేపట్టిన 'మిషన్ భగీరథ'తో జల్‌జీవన్ మిషన్ సమన్వయం ద్వారా గోదావరి, కృష్ణా నదుల ఉపరితల జలాలను శుద్ధి చేసి, భారీ నీటి నిల్వ ట్యాంకుల (OHSR) ద్వారా 23,930 గ్రామాలకు పంపిణీ చేసే ఈ గ్రిడ్ నమూనా, కేంద్ర ప్రమాణం తలసరి 55 లీటర్లకు బదులు దాదాపు 100 లీటర్ల నీటిని అందిస్తోంది. తద్వారా బోరుబావుల ఆధారిత అస్థిరత తొలగి, స్థిరమైన ఉపరితల జల సరఫరా అందుబాటులోకి వచ్చింది.

ఇళ్లతో పాటు సంస్థాగత కవరేజ్‌లోనూ తెలంగాణ ముందంజలో నిలిచింది. 22,832 పాఠశాలలు (99%), 27,248 అంగన్వాడీ కేంద్రాలు (99%), 13,281 గ్రామ పంచాయతీలు/ఆరోగ్య కేంద్రాలు (100%) కుళాయి నీటిని పొందాయి. రాష్ట్ర పథకం, కేంద్ర మిషన్ కలిసి పనిచేస్తే ఒక రాష్ట్రాన్ని ఎలా సంతృప్తపరచవచ్చో తెలంగాణ ఒక నమూనాగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ సైతం ఈ మిషన్లో గణనీయ ప్రగతి సాధించింది. 2019 ఆగస్టు నాటికి 30.74 లక్షల ఇళ్లకు (32.18%) ఉన్న కవరేజ్, 2025 మార్చి నాటికి 70.51 లక్షల ఇళ్లకు (73.81%) చేరింది. అంటే మిషన్ ద్వారా కొత్తగా 39.77 లక్షల కుటుంబాలకు కుళాయి నీరు అందింది.

2026 మార్చిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల్‌శక్తి మంత్రిత్వ శాఖతో అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుని, 2028 నాటికి ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి కనెక్షన్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. నిరంతర నీటి సరఫరా కోసం 2025 సెప్టెంబర్లో సమగ్ర నిర్వహణ (O&M) విధానాన్ని ప్రవేశపెట్టడం, నీటి నాణ్యత పరీక్షల్లో డ్వాక్రా మహిళా బృందాలను భాగస్వాములను చేయాలన్న ప్రతిపాదన, సుస్థిర సరఫరా, మహిళా సాధికారతపై దృష్టి సారించింది.

చిత్తూరు జిల్లాలో మొత్తం 3,65,655 ఇళ్లకుగాను 3,07,183 ఇళ్లకు ఇప్పటికే కుళాయి కనెక్షన్ అందగా, మిగిలిన 58,472 ఇళ్లకు 147 పనుల ద్వారా (సుమారు రూ. 29.36 కోట్ల అంచనా వ్యయంతో) చేరే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. జిల్లాలో ఆరు నీటి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలు పనిచేస్తున్నాయి. గుంటూరులోని పల్నాడు ప్రాంతానికి బహుళ-గ్రామ పథకం (MVS) వంటి పెద్ద ప్రాజెక్టులూ అమలవుతున్నాయి. మిగిలిన కుటుంబాలను 2028 నాటికి సంతృప్తపరచడమే రాష్ట్ర లక్ష్యం.

తెలుగు రాష్ట్రాల్లో
జల్ జీవన్ మిషన్ అమలు

2019 ఆగస్టు నాటికి రెండు తెలుగు రాష్ట్రాలూ దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. తెలంగాణలో 15.68 లక్షల ఇళ్లకు (29.05%), ఆంధ్రప్రదేశ్‌లో 30.74 లక్షల ఇళ్లకు (32.18%) మాత్రమే కుళాయి నీరు ఉండేది. మిషన్ అమలులో తెలంగాణ అదనంగా 38.29 లక్షల కుటుంబాలను చేర్చి 53.98 లక్షల ఇళ్లకు (100%) చేరగా, ఆంధ్రప్రదేశ్ 39.77 లక్షల కొత్త కనెక్షన్లతో 70.51 లక్షల ఇళ్లకు (73.81%) (2025 మార్చి నాటికి) చేరింది. తెలంగాణ తన మిషన్ భగీరథ గ్రిడ్‌తో సమన్వయం చేసుకుని నూరు శాతం సంతృప్తిని సాధించగా, ఆంధ్రప్రదేశ్ జల్‌జీవన్ మిషన్ 2.0 ఒప్పందం, నిర్వహణ (O&M) విధానం ద్వారా 2028 నాటికి నూరు శాతం లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

దేశవ్యాప్త పురోగతి, జల్ జీవన్ మిషన్ 2.0

తెలుగు రాష్ట్రాలే కాదు, దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇప్పటికే నూరు శాతం లక్ష్యాన్ని సాధించాయి. గోవా తొలి రాష్ట్రంగా నిలవగా, తెలంగాణ, హరియాణా, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ తదితరాలు 'హర్ ఘర్ జల్' సాధించాయి. 2026 ఆరంభం నాటికి దేశంలో 2.7 లక్షలకు పైగా గ్రామాలు, అన్ని ఇళ్లకూ, ప్రభుత్వ సంస్థలకూ కుళాయి నీరు చేరి, 'హర్ ఘర్ జల్' గ్రామాలుగా ధ్రువీకృతమయ్యాయి. అయితే మిగిలిన కుటుంబాల్లో ఎక్కువ భాగం కష్టతరమైన భౌగోళిక ప్రాంతాలు, భూగర్భ జల ఒత్తిడి, వనరుల కొరత ఉన్న చోట్ల ఉండటంతో చివరి మైలు ఒక సవాలుగా మిగిలింది.

ఈ నేపథ్యంలో మిషన్ రెండో దశ కేవలం కనెక్షన్ల లెక్క నుంచి క్రియాశీల జలభద్రత వైపు మళ్లుతోంది. ప్రతి ఇంటికీ నిత్యం, నాణ్యమైన, తగినంత నీరు అందేలా చూడటం; జల వనరులను సుస్థిరంగా కాపాడటం; నిర్మించిన వ్యవస్థల దీర్ఘకాలిక నిర్వహణకు రాష్ట్రాలతో ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకోవడం దీని కేంద్రబిందువులు. 2028 డిసెంబర్ నాటికి దేశంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికీ సురక్షిత కుళాయి నీరు అందించడమే తుది లక్ష్యం.

నీరు అంటే కేవలం దాహం తీర్చే ద్రవం కాదు. అది గౌరవం, ఆరోగ్యం, సమానత్వం, జీవించే హక్కు. జల్ జీవన్ మిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ తాగునీటి కార్యక్రమాల్లో ఒకటి. లక్షలమంది మహిళల శ్రమను తగ్గించి, వేల ప్రాణాలను కాపాడగల సత్తా దానిది. తెలుగు నేలపై దీని ప్రయాణం ఆశాజనకంగా సాగుతోంది. తెలంగాణ మిషన్ భగీరథతో సమన్వయం చేసుకుని నూరు శాతం సంతృప్తిని సాధించి చూపగా, ఆంధ్రప్రదేశ్ జల్ జీవన్-2.0 ద్వారా 2028 కల్లా 100 శాతం లక్ష్యంగా పెట్టుకుంది.

రెండు తెలుగు రాష్ట్రాలూ 'హర్ ఘర్ జల్'ను పేపర్ మీద నుంచి ప్రతి కుళాయికి చేర్చే దిశగా సాగుతున్నాయి. ప్రతి కుటుంబానికి ప్రాణజలం అనేది నినాదం కాదు, ప్రతి ఇంటి హక్కు.

డాక్టర్ కాత్తపల్లి శ్రీనివాస వర్మ
సీనియర్ జర్నలిస్ట్

విద్యాలయం అనేది మతాలకతీతమై. విజ్ఞానాన్ని, నైతిక విలువలను అందించే పవిత్రమైన ప్రదేశం. అందుకు భిన్నంగా హైదరాబాద్, సైదాబాద్‌లో సక్సెస్ స్కూల్ అనే ఒక ప్రైవేటు పాఠశాలలో హోంవర్క్ వివాదం ప్రకంపనలు సృష్టించింది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రెండో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి డైరీలో హోం వర్క్ గురించి రాస్తూ.. అన్యమత గ్రంథానికి సంబంధించిన అంశాలు నేర్చుకోవాలంటూ ఆదేశించడంతో మొదలైన ఈ వ్యవహారం క్రమంగా రాజకీయ, సామాజికంగానే కాక, న్యాయపరమైన చర్చలకు కూడా దారి తీసింది. తల్లిదండ్రుల అభ్యంతరం, పాఠశాల యాజమాన్యం స్పందన, పోలీసుల జోక్యం, హిందూ సంఘాలు, బీజేపీ నేతల ఆందోళనలు, రాజకీయ పార్టీల ప్రతిస్పందనలు నుంచి ఏకంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జోక్యానికి దారి తీసింది.

బడిలో అన్యమత బోధ

హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి ఇచ్చిన హోంవర్క్‌లో, ఇతర మత ప్రార్థనలకు సంబంధించిన అంశాలు చదవాలని క్లాస్ టీచర్ సూచించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని స్కూల్ డైరీలో కూడా స్పష్టంగా నమోదు చేసినట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. కుమారుడి హోంవర్క్ వివరాలను పరిశీలించిన తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మత విశ్వాసాలకు సంబంధం లేని అంశాలను ఎందుకు బోధిస్తున్నారని నేరుగా పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ అంశాన్ని నేర్చుకోవాలంటూ గత కొన్ని రోజులుగా విద్యార్థిపై మానసిక ఒత్తిడి తీసుకొచ్చారని కూడా వారు ఆరోపించారు. పాఠశాల నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాక పోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ, హిందూ సంఘాల నిరసనలు

ఈ ఉదంతంపై విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యా సంస్థవద్ద తల్లి దండ్రులు ఆందోళనకు దిగారు.బీజేపీ నాయకులు, హిందూ సంఘాలు పెద్ద ఎత్తున స్కూల్ వద్దకు చేరుకుని నిరసన చేపట్టాయి. వివిధ సంఘాలు, పార్టీల నేతలు ఆ ఆందోళనకు మద్దతు ప్రకటించారు. విద్యార్థిని వేధిస్తూ, ఇలాంటి హోంవర్క్ ఇచ్చిన ఉపాధ్యాయురాలిపైనే కాకుండా పాఠశాల యాజమాన్యంపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కూడా కొంతమంది నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పాఠశాల పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంతమంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అనివార్యంగా స్కూల్ యాజమాన్యం వివరణ

ఈ ఉపాధ్యాయురాలి తీరుకు నిరసనగా వీహెచ్‌పీ, బీజేపీ సహా పలు సంఘాలు, పార్టీలు కన్నెర్ర జేశాయి. భాగ్యనగర్ జిల్లా బీజేపీ నాయకులు, హిందూవాహిని ప్రతినిధులు కూడా స్కూల్ దగ్గర నిరసనలకు దిగారు. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్రికలు, టీవీ ఛానెళ్లు, డిజిటల్ మీడియా వేదికలుగా ఈ వివాదం ముమ్మరంగా ప్రచారం, ప్రసారం అయింది. అన్ని

> **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఈ ఘటనను తీవ్రంగా ఆక్షేపించారు. తల్లిదండ్రులు ధైర్యంగా ముందుకు వచ్చి విషయాన్ని వెలుగులోకి తీసుకురావడాన్ని అభినందించారు. కేవలం ఒక ఉపాధ్యాయురాలిని తొలగించడం ద్వారా సమస్య ముగిసినట్లుకాదని, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరగాలని అన్నారు.**

వైపుల నుంచి పాఠశాల యాజమాన్యంపై ఒత్తిడి పెరగడంతో తాము ఉద్దేశపూర్వకంగా అలాంటివి బోధించడంలేదని పాఠశాల యాజమాన్యం వివరణ ఇచ్చింది. అంతేకాదు.. విద్యార్థికి హోంవర్క్ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ఫేక్ ఆయేషా పర్వీన్‌ను సర్వీసు నుంచి తొలగించామని, ఆమెకు భవిష్యత్తులో కూడా తమ విద్యాసంస్థల గ్రూపులో ఎలాంటి ఉద్యోగావ కాశాలు ఉండవని స్పష్టం చేస్తూ, అనివార్యంగా క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. తమ పాఠశాలలో అధిక సంఖ్యలో ఒక మతానికి చెందిన విద్యార్థులకు మాత్రమే ''దీనియత్'' అనే ప్రత్యేక సబ్జెక్టు బోధిస్తామని, ఇతర మతాలకు చెందిన విద్యార్థులకు అలాంటి బోధన ఉండదని యాజమాన్యం వివరణ ఇచ్చింది.

పాఠశాలలపై ప్రత్యేక నిఘా పెట్టాలి: కిషన్ రెడ్డి

ఈ సంఘటనపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెండో తరగతి చిన్నారిపై మతపరమైన అంశాలను హోంవర్క్ రూపంలో రుద్దడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పసిపిల్లల మనసుల్లో మతపరమైన భావాలను బలవంతంగా నాటే ప్రయత్నంగా దీన్ని అభివర్ణించారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే పరిస్థితులు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఉందని ఎవరైనా మతాంతీకరణకు ప్రయత్నిస్తే.. చూస్తూ ఉరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఇటీవల ఆర్మూరులో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా భరత్‌చంద్ర కాన్వెంట్‌లో హిందూమతానికి చెందిన పిల్లలకు మరో మతానికి చెందిన భాష నేర్పించారని, దానిని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకొన్న స్థానిక హిందూసంఘాలు,

నతో అలజడి

బీజేపీ నాయకులు పాఠశాలను మూసివేయాలని డిమాండ్ చేయడం గమనార్హం. ఇలాంటి దుర్మార్గమైన ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సంస్కృతిపై దాడికి కుట్ర:బండి సంజయ్

ఒక మతానికి చెందిన విద్యార్థికి మరో మతానికి చెందిన ప్రార్థనల హోంవర్క్ ఇవ్వడాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఇది హిందూ సంస్కృతిపై దాడిగా భావిస్తున్నట్లు చెప్పారు. చిన్న పిల్లల మనసుల్లో మతపరమైన అంశాలను బలవంతంగా నాటే ప్రయత్నాలను సమాజం మొత్తం ఖండించాలని పిలుపునిచ్చారు. సంబంధిత పాఠశాల యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కొందరు లౌకిక వాదులు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని, హిందూ విద్యార్థులకు తిలక ధారణను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

బోధనే తప్ప మత ప్రచారం కూడదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఈ ఘటనను తీవ్రంగా ఆక్షేపించారు. తల్లిదండ్రులు ధైర్యంగా ముందుకు వచ్చి విషయాన్ని వెలుగులోకి తీసుకురావడాన్ని అభినందించారు. కేవలం ఒక ఉపాధ్యాయురాలిని తొలగించడం ద్వారా సమస్య ముగిసినట్లుకాదని, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరగాలని అన్నారు. విద్యాసంస్థలు చదువు మాత్రమే చెప్పాలని, ఏ మతాన్నీ విద్యార్థులపై రుద్దే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. అవసరమైతే సంబంధిత పాఠశాల గుర్తింపును కూడా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాదు.. కాంగ్రెస్ మార్క్ 'ఎడ్యుకేషన్ జిహాద్'పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత మార్పిడికి ప్రయత్నాలు జరుగుతున్నాయని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే సంబంధిత పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరోవైపు.. సక్సెస్ స్కూల్‌లో అన్యమత ప్రార్థనలకు సంబంధించిన హోంవర్క్‌గా ఇవ్వడాన్ని విశ్వహిందూపరిషత్ జాతీయ కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఇది ఏదైనా 'కుట్ర'లో భాగమా? అనే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించాలని డిమాండ్ చేసింది. ఇందులో ప్రమేయం ఉన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు జరపాలని వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ డిమాండ్ చేశారు.

జనసేన పార్టీ కూడా ఈ అంశంపై స్పందించింది. సాధారణ విద్యాసంస్థల్లో ఏ ఒక్క మతానికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదని పేర్కొంది. పాఠశాలలు రాజ్యాంగ విలువలు, నైతిక విద్య, విజ్ఞానాన్ని బోధించాలే తప్ప మత ప్రచార కేంద్రాలుగా మారకూడదని స్పష్టం చేసింది. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయా అనే అంశంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరింది.

నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్

వివాదం తీవ్రతను గుర్తించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ , ఈ అంశంపై రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు నిజమైతే ఇది మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించవచ్చని కమిషన్ అభిప్రాయపడింది.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

భాగం-46

ఏకసత్తావాదం

రాజనీతి శాస్త్రానికి చెందిన అనేక వాదాలలో ఏకసత్తావాదం ఒకటి. దీనిని అనుసరించి ఒకే ప్రదేశానికి చెందిన వ్యక్తుల సమూహానికి సర్వోచ్ఛ సత్తాధారి (అధికారం కలిగినవాడు) అయిన ఒకే ఒక వ్యక్తి లేదా సంస్థ ఉంటుంది. అందరు పౌరులూ, సంస్థలూ కూడా ఈ సత్తాధారిక సంస్థకు అధీనమై ఉండాలి.

ఏకసత్తావాదాన్ని అనుసరించి పోలీసు, జైలు, న్యాయాలయం వంటివన్నీ రాజ్యాధికారానికి లోబడి ఉంటాయి. ఆజ్ఞా ఉల్లంఘనకు ప్రభుత్వమే దండన విధిస్తుంది. రాజ్యంలో సభ్యత్వం తీసుకోవడం ప్రతి ఒక్కరికీ అనివార్యం. రాజ్యమే చట్టాలను నిర్మించే సంస్థగా ఉంటుంది. అట్టి రాజ్యమనే సంస్థ ఏదేని నియమాలకు, పరంపరకు లోబడి ఉండదు. రాజు ఆజ్ఞను పాలించడం పౌరులందరికీ అనివార్య కర్తవ్యం. 16వ శతాబ్దంలో ఏకసత్తావాదం రాజసత్తను వ్యాఖ్యానించిన విధానం వివాదాస్పదం అయింది.

అంతకుముందు, యూరప్ అంతటా మతపరమైన విషయాలలో పోప్‌కు, ఇతర విషయాలలో రోమన్ చక్రవర్తికి సర్వోన్నత స్థానం ఉండేది. జాతీయతా వాదంవల్ల సామంతవాదం క్షీణించింది. కేంద్ర ప్రభుత్వం శక్తి సంపన్నం అయింది. ప్రతి రాష్ట్రంలోనూ స్వతంత్ర సత్తాధికారం కలిగిన ప్రభుత్వాలు, నాయకులు ఉద్భవించారు. బోదిన్ జరిపిన మతసంస్కరణ ఉద్యమాల వల్ల క్రైస్తవ మతంలో అనేక శాఖలు, ఉపశాఖలు ఏర్పడడంతో పోప్ ఏకస్వామ్యం అంతరించిపోయింది. రాజనీతిలో కూడా రోమన్ చక్రవర్తుల సర్వోచ్ఛస్థానం కూడా పడిపోయింది. ఈ సమయంలో పూర్వ సంప్రదాయాలు అంతరించిపోవడంతో ప్రజలలో కొంత అనిశ్చితితోపాటు వ్యాకులత ఉత్పన్నం అవుతూ వచ్చింది. అప్పుడు బోదిన్, 'రాజ్యం ఆజ్ఞలను పాటించడమే ప్రజలకు పరమ కర్తవ్యం' అని చెప్పాడు. అయినప్పటికీ బోదిన్ చెప్పిన 'రాజసత్తాధారి అయిన రాజ్యం' నైసర్గిక నియమాలకు లోబడి ఉండేది.

హాబ్స్ సిద్ధాంతం రాజు ఖడ్గం ద్వారానే అన్ని పౌర నియమాలనూ చక్కగా పాటింప చేయగలదని భావించింది. రూసో కూడా హాబ్స్ చెప్పిన ఏకసత్తావాదాన్ని సమర్థించాడు. అతని అభిప్రాయంలో కూడా రాజ్యం, రాజసత్త నిరపేక్షమైనది, అవిభాజ్యమైనది. విస్తృతమైనది. శాశ్వతమైనది. హాబ్స్ ప్రకారం రాజసత్త అనేది 'లెవియథాన్' (దీర్ఘకాయుల రాజ్యం)లో నిహితమై ఉంది. అయితే రూసో ప్రకారం సామాన్యుల ఇచ్ఛను గౌరవించే ప్రజాస్వామ్యంలోనే అది సాధ్యమవుతుంది. హాబ్స్ చెప్పిన నిరపేక్షతను, లాంక్ చెప్పిన జనస్వీకృతిని రూసో సమన్వయపరిచాడు. బెంథామ్ కూడా ఉపయోగితావాద ప్రతిపాదన కోసం 'ఏకసత్తావాదాన్ని' స్వీకరించాడు.

జాన్ ఆస్టిన్ ఏకసత్తావాద 'రాజసత్త' అనే పదానికి ఒక ప్రామాణిక నిర్వచనం ఇచ్చాడు. అతడు బెంథామ్ శిష్యుడు. అతని నిర్వచనం ఇలా ఉంది – 'ఒక నిశ్చిత జనశ్రేష్ఠుడైన వ్యక్తి ఆజ్ఞను, శ్రేష్ఠులైన ప్రజలు సహజంగానే పాటించకపోయినా కూడా, బహుసంఖ్యాకులైన సమాజం అంతే సహజంగా అతడి ఆజ్ఞలను పాటిస్తున్నప్పుడు, అట్టి శ్రేష్ఠుడైన వ్యక్తియే రాజసత్తాధారి అవుతాడు. ఆ వ్యక్తితో పాటు ఆ సమాజం కూడా రాజనీతి దృష్టిలో స్వతంత్రంగా ఉంటుంది.' ఆస్టిన్ చెప్పిన ఈ నిర్వచనానికి రెండు దృష్టి కోణాలున్నాయి. అవే మీమాంస, రాజనీతి. రాజసత్తకు నిరపేక్షత వంటివి లక్షణాలుగా ఉంటాయి.

మొదటి లక్షణం ప్రకారం ప్రతి రాజ్యంలోనూ నిశ్చిత జనశ్రేష్ఠుడైన వ్యక్తి ఉంటాడు. అతడే రాజసత్తాధారి అవుతాడు. మీమాంస అనే దృష్టికోణం నుంచి రాజసత్తాధారి అయినవాడి ఆజ్ఞయే చట్టంగా మారుతుంది. దైవీయ, ప్రాకృతిక, లౌకిక నియమాలు.. సంఘం నియమాలను పరంపరాగతంగా చట్టంగా స్వీకరించడం సాధ్యంకాదు. అతడి అభిప్రాయం ప్రకారం ప్రతి నియమానికి ఒక నిశ్చిత మూలం ఉండడం తప్పనిసరి. నియమం ఆజ్ఞాసూచకంగా ఉండాలి. నియమాలకు వెనకాల ఏదైనా ఒక ప్రమాణం ఉండాలి. అట్టి ప్రమాణం చేతనే శిక్షాస్మృతుల నిర్ణయం జరగాలి.

ఏకసత్తావాద వ్యవస్థ వల్ల ప్రభుత్వాలు బలపడినప్పటికీ, అలా బలపడడం మంచిదే అయినా, దీనిలోనూ అత్యంత అవసరమైన ధర్మనియంత్రణ తొలగిపోతుంది. నియంత్రణలేని జనులు నియంత్రణలేని యంత్రం వలె భయంకరంగా మారవచ్చు. అయినప్పటికీ ఆధునికులైన ఆలోచనాపరులు దీనిని ప్రగతిశీలక ముందడుగుగా భావిస్తారు.

17వ శతాబ్దంలో 'చక్రవర్తి – పార్లమెంటు' అనే రెండు వ్యవస్థలూ పరస్పరమూ సంఘర్షించుకున్నాయి. ఈ చారిత్రక సంఘర్షణలో కూడా అక్కడ నియమాలకు ప్రధాన స్థానం ఉంది. పార్లమెంటు సభ్యులు, న్యాయమూర్తులు కూడా, 'చక్రవర్తి లౌకిక నియమాలను ఉల్లంఘించలేడు' అనే వాదించాయి. ఇట్టి నియమం ఇప్పటికీ కూడా అలిఖితపూర్వకంగా అక్కడ కొనసాగుతోంది. ఆస్టిన్ తన దేశంలో ఈ సంప్రదాయం ఉందని తెలిసి కూడా కళ్లుమూసుకుని విస్మరిం చాడు. భారతదేశంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ భారతీయ పాలనావ్యవస్థలో ఎప్పటినుంచో ధర్మవిధులు – సదాచార సంప్రదాయాలకు అత్యధిక ప్రాముఖ్యం ఉంది. 'తదేతత్ క్షత్రస్య క్షాత్రమ్' అనే బృహదారణ్యక ఉపనిషత్ వాక్యం (1.4.14) అంటే, ధర్మంపై రాజుకు అధిక్యం ఉండదు కానీ, ధర్మమే రాజును శాసిస్తుంది. మధ్యయుగ యూరప్‌లో ధార్మిక – సహజ నియమాలను సర్వోన్నతంగా భావించేవారు. వాస్తవానికి, ఏకచ్ఛత్రాధికారమనే విధానం రాజ్యస్థాపనకు సంబంధించినదే కానీ; అది ప్రాచీన సమాజాన్ని ప్రతిబింబించదు.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

SURYA

Shaping Structures That Shape Tomorrow

Steel is what turns plans into lasting structures. Surya provides high-quality steel solutions that support construction, infrastructure, and development. Engineered for strength and consistency, they help projects move forward with confidence.

Because the future is built on what holds firm today.

SURYA HAI TOH BHAROSA HAI

Lighting | Wires and Cables | Professional Lighting | Fans | Appliances | Water Pumps | PVC and Water Tanks | Steel Pipes

I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY

SURYA ROSHNI LIMITED | consumercare@surya.in | www.surya.co.in

TOLL FREE 1800 102 5657

తన స్థాయి ఏమిటో.. వ్యక్తిగతంగా తన బలిష్టత ఏమిటో గణపతిదేవ మహారాజుకు తెలుసు. తన రాజ్యం.. దాని సైనికశక్తి.. మహావీరులైన తన మండలేశ్వరులు.. కుశాగ్రబుద్ధులయిన ప్రధానులు, తిమ్మినిబమ్మిని చేయగల సంధి విగ్రహులు, చెప్పింది చెప్పినట్లు నిర్వహించగల మంత్రులు, అద్భుతమైన గూఢచారి వ్యవస్థ.. ఇలా ఏ అంశం తీసుకున్నా అది అత్యంత పరిణితి చెందిన స్థాయిలోనే ఉంది గాని ఇలాంటి పిల్లచేష్టలకు భయపడిపోయేంత బేలగా లేదు.

అవన్నీ ఒకెత్తు. తన వారసులు..ముఖ్యంగా రుద్రమ ఒక్కటి చాలు ఈ పిచ్చి బాలకవ్వల ఆట కట్టించడానికి.

కాని.. తనే ఈమె పగను గుర్తించాడు.. గౌరవించాడు.. తలవొగ్గాడు. కాబట్టే ఆమె, ఆమె బృందం నడిపిస్తే నడిచాడు. మోస్తే పల్లకిలో కూర్చున్నాడు. ఆమె చంపుతాను అంటే శిరస్సు వాల్చి నిలబడ్డాడు.

ఇక్కడ కాదు అక్కడ ఆ కోష్టాగారం వద్ద అంటే సరే వెళదాం పదండి.. మీ ఇష్టం అక్కడే చంపండి.. అంటూ మౌనంగా వాళ్లకు సహకరిస్తూ ఇక్కడికి వచ్చాడు. అన్నిటికి సిద్ధం.

'నా ప్రియసఖి.. నా కవ్వలా.. నీ మరణం నన్ను ఎంత దుఃఖపెడుతుందో.. నాకు తప్ప ఎవరికీ తెలియదు. తెలియడం కూడా నేను అంగీకరించను. అది కూడా మనిద్దరి మధ్యనే ఉండాలి. కానీ కాని.. నీ తోడబుట్టిన ఈ బాలకవ్వల పగ చూస్తుంటే ముచ్చటేస్తుంది. పాపం..అమెది నాకంటే పెద్ద దుఃఖంలా గుర్తించాను. అందుకే బలి కోసం వెళ్లే మేకలా ఆమె వెంటే నడిచాను. నా దుఃఖానికి ఉపశమనం లేకపోవచ్చు.. వద్దు కూడా. బాల దుఃఖానికి ఉపశమనం నా మరణమే అయితే.. కవ్వలా! నేను ఆనందంగా చనిపోవడానికి సిద్ధం! నన్ను అర్థం అర్థం చేసుకుంటావు కదూ..'

"లోపలోకి పద.." కవ్వల గర్జన వినిపించి ఆలోచన ఆగింది.

కాని విచిత్రమైన ఆనందం పెదవులపై మాయం కావడం లేదు ఆ మహా ప్రేమికుడు గణపతిదేవునికి!

* * *

పగ.. పగ.. పగ.. దాని శక్తి బలీయం. ఊహాతీతమైన బలం ఏదో ఆ పగలో ఉంటుంది. కాని దానిని ఛేదించాలన్న పట్టుదల కూడా అంతే బలమైనదేమో..

బాలకవ్వల బృందం మూడు నెలల్లో దేవగిరి చేరితే ఆమె వెనకనే అంతే వేగంగా వచ్చి దేవగిరి చేరింది రుద్రమ బృందం. మహా మండలేశ్వరుని రహస్యంగా తరలించడం కవ్వల బృందం చేస్తే, మహిళ అయిన తన గురించి, కాకతీయ గణపతిదేవుడు బందీ అయి అదృశ్యమైన సంగతి ఎవ్వరికీ తెలియకుండా ప్రయాణించడం కూడా రుద్రమ బృందానికి సవాలు వంటిదే.

దేవగిరి చేరిన కవ్వల బృందం మహారాజు పరోక్ష సహకారంతో గణపతి దేవుని శిథిలకోష్టాగారం వద్దకు చేర్చగలిగింది. కాని రుద్రమదేవి లోపలికి వెళ్లడానికి పాలకుల సహకారం లభించదు.

రుద్రమ అడిగేది లేదు సింఘణదేవుడు సహకరించేదీ లేదు.

బెలగావి నుండి దేవగిరికి బయలుదేరుతున్నప్పుడే రుద్రమదేవి ముగ్గురికి లేఖలు పంపింది.

ఒకటి మహాప్రధాని శివదేవయ్యకు. అవతల యుద్ధం జరుగుతున్న తరుణంలో రాజ్యంలో ఎలాంటి ఉద్రిక్తతలు చెలరేగకుండా చూసుకోవాలని కోరింది.

మరొకటి ఆమె భర్త వీరభద్రునికి. ముగ్గురు పిల్లలను జాగ్రత్తగా చూడవలసినది అని..

మూడవ లేఖ ఆమె తల్లి సోమలదేవికి రాసింది.

"తల్లీ.. మనం అనుకున్నట్లు బాలకవ్వల నేనూ ఎదురెదురయ్యాం. ఆ ఏకవీరా దేవి, ఆ కాకతమ్మ దీవెనల వల్ల నేను ఆమె సమస్యను పరిష్కరించగలను. కానీ దీనికి ముగింపు పలకాల్సింది నువ్వే. ఆ సమయం వచ్చినప్పుడు నేను నీకు మరొకలేఖ పంపుతాను. తదనుగుణంగా నువ్వు నేను చెప్పినచోటుకి రావలసి ఉంటుంది."

కాకతీయ సైనిక వీరులు ఎవ్వరికి రుద్రమ ఏమీ చెప్పలేదు. అంతా త్రిముఖ యుద్ధాలలో ఉన్నారు.

ఆమె జరిగింది మొత్తం చెప్పింది ఒకే ఒక్కరికి.

పృథ్వీశెట్టి అంకాలకు మాత్రమే. ఆయన సహకారంతో, ఆయన సూచించిన వణిజుల గృహాలలో బస చేస్తూ.. ముందుకు కదులుతూ.. దేవగిరి చేరింది.

కానీ ఇప్పుడు ఇక్కడ అసలు సిసలు సమస్య ఎదురయ్యింది.

కోటలోకి ఎలా ప్రవేశించాలి? ఆ కవ్వల ఇప్పటికే శిథిల కోష్టాగారం చేరింది.

సమయంలేదు. క్షణక్షణానికి తండ్రి భవితవ్యం ప్రశ్నార్థకం అవుతోంది. రుద్రమ, ఆమె అంగరక్షకులు, ఆమెకు సహాయంగా వచ్చిన కొందరు వణిజులు తీవ్రంగా ఆలోచిస్తున్నారు కాని మార్గం తోచడం లేదు. దేవగిరి ప్రధాన సమయసెట్టి బాపయశెట్టి అంకాలకు మిత్రుడే కాని అతడు అప్పటికే బాల కవ్వలాబాయి అనుచరుడుగా గుర్తింపు పొందినవాడు.

రుద్రమ, ఆమె బృందం చేతులు పిసుక్కుంటూ కోట పరిసర ప్రాంతాలలో తిరుగాడుతున్నారు.

తెలిసింది ఏమిటంటే సింఘణ దేవుడు కోటలో లేడు. కాశీ యాత్రకు కుటుంబ సమేతంగా వెళ్లాడట. ఆయన తమ్ముళ్లు వాళ్ల కుటుంబాలు కూడా ఎవ్వరూ రాజప్రాసాదంలో లేరు.

గణపతిదేవుడు

46

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

సమయానికి అంతా మాయమవడం రుద్రమకు ఆశ్చర్యం కలిగించలేదు. కవ్వలకు చేయాల్సిన సహాయం చేశారు. మేనకోడలుగా తను వచ్చి సహాయం కోరితే వచ్చే ఇబ్బంది గుర్తించి ముందే తప్పుకున్నారన్నమాట.

అసలు వాళ్లను అడిగే ఉద్దేశ్యమే లేని రుద్రమ.. భారం ఏకవీరాదేవి అమ్మ వారిపై వేసి కోట ముందు భాగంలో మండుటెండలో తిరుగాడుతోంది. ఆమెకు కవచంలా దూరదూరంగా లెంకలు..

అనూహ్యంగా ఆమెకు బాసటగా ఓ బృందం ముందుకు వచ్చింది.

అది బిచ్చగాళ్ల బృందం.

* * *

మూడురోజులుగా బాలకవ్వల గణపతిదేవుని ఏమీ చెయ్యలేదు.

ఆమె ఏమి చేసినా ఆహ్వానిస్తూ.. అన్నిటికి గణపతిదేవుడు పూర్తిగా సిద్ధమై ఉన్నాడు.

భార్యలు, పిల్లలు, ప్రజలు, రాజప్రాసాదం, నియోగాలు, మిత్రులు, తెలుగు భాష, తిక్కనా మాత్యుడు, ఆంధ్రజాతి.. అన్ని.. ఇప్పుడాయనకు ఏమీ లేవు.

మనసంతా ఓ ఖాళీ.. నిరాసక్తత.. బహుశా తను లేకపోయినా కాకతీయ రాజ్యానికి వచ్చిన సమస్య ఏమీలేదన్న భరోసా ఏదో మనసు మూలల్లో ఉన్నదేమో. అన్నింటిని వదిలేసి కేవలం మరణాన్ని ఆహ్వానిస్తూ ప్రశాంతంగా ఉన్నాడు.

కేవలం కవ్వల స్మరణ మాత్రమే.

మనసు! పెదవులు జపిస్తున్నది.. "కవ్వలా.. కవ్వలా.."

కవ్వల ఆమె బృందం..దాదాపు యాభై మంది ఉంటారు. అంతా కిరాతకులు. ఏ దుర్మార్గానికయినా సిద్ధపడినవాళ్లను ఏరికోరి తన బృందంగా ఏర్పాటు చేసు కుంది. దేవగిరి వస్తున్నప్పుడు మధ్యలో అనేకమంది మారారు కాని అందరూ దుర్మార్గ మనస్తత్వం ఉన్నవాళ్లే. మరాఠీ వణిజుల సహాయంతోనే ఆమె కార్య కలాపాలు నిర్వహిస్తోంది. వణిజుల సైన్యం అంతా సాంప్రదాయ యుద్ధ యోధులే కానీ కిరాతకులు కాదు.

అందుకే వాళ్లను మార్చేసింది. ప్రస్తుతం ఉన్న వాళ్లంతా కిరాతక మూక.

ఇక్కడికి వచ్చిన మూడురోజులుగా కవ్వల కొంత విశ్రాంతిగా..అంటే ప్రధాన ఘట్టం పూర్తయినట్లుగా ఇక పతాక ఘట్టమే మిగిలింది కాబట్టి.. అందుకు తొట్రుపడకుండా స్థిత ప్రజ్ఞతతో కొంత సమయం తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. గణపతిదేవునికి, బాలకవ్వలకు, వెంట వచ్చినవాళ్లకు కూడా రాజప్రాసాదపు వంటశాల నుండే ఆహారం వస్తోంది. సాధారణ కోట రక్షణభటులు, గస్తీ భటులు కూడా ఎవ్వరూ అటువైపు రావడంలేదు. దగ్గరగా ఉన్నది కారాగారం మాత్రమే. దాని వెనుక వైపున్న శిథిల భవనమే ఈ కోష్టాగారం. అందువల్ల కూడా పూర్తిగా కోటలో ఓ నిర్మానుష్య ప్రదేశంగా దీనిని చెప్పుకోవాలి.

అది ఒకరకంగా బాలకవ్వలకు అనుకూలంగా ఉంది.

ఆమెకు సింఘణ సహకారం ఉండబట్టే ఎవ్వరూ ఇటు రావడం లేదని గణపతిదేవుడు గుర్తించినా ఆయనకు సింఘణపై తొలి నుండి ఉన్న సందేహం బలపడింది కానీ పెద్దగా స్పందించలేదు.

'కాసేపటికి చచ్చేవాడికి ఆసక్తులు ఏముంటాయి.'

నాలుగవ రోజున ఊహించని సంఘటనలు జరిగాయి.

కవ్వల బృందం కవ్వల తల్లిదండ్రులను.. మానసికస్థితి సరిగా లేక దేవగిరి కోటలోని రాజనగరిలో వైద్యుల సంరక్షణలో ఉన్న వాళ్లిద్దరిని అక్కడికి తీసుకు వచ్చారు. వారు గణపతిదేవుని చూశారు కాని గుర్తుపట్టలేదు. బాల కవ్వల మాత్రం రెచ్చిపోయింది.

"చూశావా దుర్మార్గుడా..! నీ వల్లనే నా తల్లిదండ్రులు ఇలా పిచ్చివాళ్లయ్యారు. ఇలా నలభై ఏళ్లుగా.. ఈ ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలియదు. ఏదో వాళ్ల లోకంలో వాళ్లున్నారు. మహారాజు సింఘణదేవులవారు అన్నీ భరించి వీరిద్దరిని ప్రేమతో రాజనగరిలోనే ఉంచి వైద్యులతో చికిత్స చేయిస్తున్నారు. నువ్వేమో నా అక్కను చంపి సోమలను పెళ్లిచేసుకుని.. ఆవిడ చాలక మళ్లీ ఇద్దరిని పెళ్లాడావ్. ఒకరిని చంపేశావ్. ఇద్దరు పెళ్లాలతో కులుకుతున్నావ్. మా బాధలు ఎన్నడైనా తెలుసు కున్నావా? లేదే.. ద్రోహి నిన్ను ఏమి చేసినా పాపం లేదురా.." ఉద్రేకంతో ఊగిపోయింది.

గణపతిదేవుడు వారిద్దరిని చూశాక పశ్చాత్తాప ధోరణిలో వంగి వారి పాదాలను స్పృశించాడు. క్షమించమన్నట్లుగా వారి పాదాల వద్ద కూలబడ్డాడు. ఆయన చేసిన ఈ చర్యకు అక్కడున్న వారంతా నిర్ఘాంతపోగా కవ్వల తండ్రి కూడా అక్కడే గణపతి దేవుని ముందు కూర్చుండి ఆయన ముఖాన్ని స్పృశిస్తూ ఆయనకు దండాలు పెట్టసాగాడు. అందరూ విభ్రాంతిగా చూస్తుండగా ఆయన గణపతిదేవుని కాళ్లకు మొక్కసాగాడు. భర్తను చూసి కవ్వల తల్లి కూడా యాం త్రికంగా గణపతిదేవునికి కాళ్లకు మొక్కసాగింది.

కవ్వల అచేతనురాలైపోయింది. లిప్తల కాలంలో తేరుకుని తల్లిదండ్రులను పక్కకు లాగింది.

"ఎంత నీచుడివిరా! నా తల్లిదండ్రులతోనే దండాలు పెట్టించుకున్నావంటే.. నిన్ను వదల కూడదు. నిన్నిప్పుడే పొడిచి పారేస్తా.. నరికేస్తా.."

అరుస్తూ సిద్ధం చేసుకున్న ఖడ్గాన్ని చేతపట్టింది. రెండు చేతులలో ఎత్తి పట్టింది.

అనుచరులు ఆమె తల్లిదండ్రులను ప్రక్కకు లాగి ఆమె మరింత దూకుడుగా ఆయన పైకి వెళ్లడానికి సహాయపడుతున్నారు.

అప్పుడొక ఊహాతీతమైన.. ఎవ్వరూ ఊహించని వ్యక్తి ప్రవేశించింది.

"ఆగు కవ్వలా.. ఆగాగు.."

పరుగుపరుగునా అక్కడికి వచ్చిపడింది ఆమె. ఆమె సోమలదేవి. కాకతీయ రాజ్య పట్టమహిషి.

మత్తి భానుమూర్తి

దేవగిరిరాజ్య మహానేత జైత్రపాల మహారాజుగారి ఏకైక కుమార్తె. ప్రస్తుత పాలకుడు సింఘణదేవుని ఆత్మీయ చెల్లెలు.

"నువ్వు చేస్తోంది తప్పు. పాపం, దారుణం. నా భర్త అమాయకుడు. ఆ మహామనిషికి సమస్త రాజ్యాలూ చేతులెత్తి నమస్కరిస్తుంటే నువ్వు తెలిసీ తెలియక అక్క కవ్వల మరణానికి ఆయనను బాధ్యుడిని చేస్తావా? తప్పు. క్షమించరాని నేరం."

ఆమె గొంతు వణికిపోతోంది. ఈ సంగతి ఇటీవలే తెలిసినట్లు భరించరాని బాధతో పరుగు పరుగున వచ్చిపడినట్లుంది సోమల శారీరక భాష.

అప్పుడు అక్కడ సోమలను చూడటం బాలకవ్వల కూడా ఊహించలేనట్లుంది.

"నువ్వా సోమలా! ఎలా వచ్చావ్? ఎందు కొచ్చావ్? కాస్త ఆగి వస్తే నీ మొగుడి శరీరభాగాలు మూటకట్టి ఇచ్చే దానిని. తీసుకుపోయి సహగమనం చేసుకునేదానివి. రేయ్.. దీన్ని బంధించండిరా.. పెడరెక్కలు విరిచి కట్టేయండి. మరి వాగకుండా మూతికి గుడ్డ చుట్టండి. మహాపతివ్రత.. నాకు నీతులు చెబు తోంది. ఈమె మొగుడొక వీరుడట. చూడు నీ మొగుడుని ఎక్కడో బెలగావిలో బంధించి మూడు నెలలు ఎవ్వరికి తెలియకుండా ప్రయాణించి ఇక్కడకి తెచ్చి బంధించాను. ఎవ్వరూ.. ఒక్కరు కూడా రాలేదే. నీ సైన్యం..మీ కాకతీయ వీరులు ఏరి? పెద్ద ప్రగల్భాలు పలికింది నీ కూతురు. ఎక్కడ? హహ్హహ్హ.. హహ్హహ్హహ్హ.." వికటాట్టహాసాలు చేస్తోంది.

కిరాతకులు సోమలను గట్టిగా పట్టుకుని ఓ కుడ్యానికి కట్టారు. ఆమె నోటికి గుడ్డ చుట్టబోతుండగా విదిలించుకుంటూ...

"నా కూతురు రుద్రమ నాకు లేఖ రాస్తేనే నేను పరుగున వచ్చాను.. మరి కొద్ది.." ఆపై ఆమె మాట్లాడలేకపోయింది. నోటిని గుడ్డతో మూసేశారు.

"వస్తోందా.. రమ్మను. దాన్ని అక్కడే బెలగావి లోనే చంపేద్దామనుకున్నాను. కానీ దాని తండ్రి చావు దాని కళ్లతో చూడాలని వదిలేశాను. అది ఇక్కడకు వస్తుందని తెలుసు. దాని కోసమే ఇంతసేపూ ఆగాను. కానీ నిన్ను పంపింది. దాని బదులు నిన్నూ, ఆ నీచుడ్ని.. ఇద్దరిని కలిపి చంపేస్తాను. రేయ్.. మంచి ఖడ్గాన్ని ఇవ్వండి.."

అప్పుడు కలగజేసుకున్నాడు గణపతిదేవుడు.

"ఒక్క మాట బాలకవ్వలా! తప్పు నాది. నేను అందుకు అంగీకరిస్తున్నాను. సోమల ఏమి పాపం చేసింది?దయచేసి నన్ను చంపేయ్. కానీ ఆమెను వదిలేయ్.. నీకు పుణ్యముంటుంది.."

"నువ్వు నోర్ముయ్." భవనం మారుమోగేలా అరిచింది బాలకవ్వల.

"మూడునెలలుగా నోరెత్తని వాడివి.. పెళ్లాన్ని చూసుకున్నాక నోరు లేస్తోందే.. ఒరే. వాడి నోటికి కూడా గుడ్డ కట్టండిరా.."

నోటికి గుడ్డకడుతుండగా ఆయన అక్కడున్న పల్యంకంలో కూలబడ్డాడు. ఇద్దరు ముగ్గురు అనుచరులు ఆయన నోటికి కూడా ఓ గుడ్డ కట్టబోయారు. అప్పుడు అనుకోకుండా ఆయన కూర్చున్న పల్యంకం ప్రక్కనున్న వస్త్రం తొలగిపోయి ఆయన చేతికి అందే దగ్గరలో ఓ పెద్ద ఖడ్గం ఉండటం అందరికి కనపడింది.

అది చూసి అందరూ నిర్ఘాంతపోయారు.

బహుశా రుద్రమ తన కంటే ముందే ఇక్కడికి వచ్చేసి తనపై ఆయుధాలను, సిద్ధం చేసింది. చివ్వున కదిలింది. "రేయ్ ముందు నిన్ను చంపేస్తా.." అంటూ ఖడ్గం తిప్పసాగింది.

ఆమె వెంట కదలుతున్నారు కిరాతకులు. అప్పుడు మళ్లీ మరో చురక వేగంగా వచ్చి ఓ కిరాతకుడ్ని తాకింది. వాడు కింద పడేలోగా కవ్వల అతనిపై నుండి ఎగిరి గణపతిదేవుని వైపు దూకింది. అప్పుడు మరో ఖడ్గం వచ్చి ఆమెను తాకింది కాని అప్పుడే ఆమె పక్కనున్న కిరా తకుడుని తాకడంతో ఇద్దరూ ప్రక్కకు పడిపోయారు.

అది ఉన్న విధానం చూస్తే.. అంటే ఆ పల్యంకంలో కూర్చున్నవారు ఎవరైనా.. వారికి అందేటంత ప్రణాళికతో అక్కడ ఆ ఖడ్గం ఉంది.

అది చూసిన వారెవరికైనా వెంటనే అర్థం అవుతుంది. అది కావాలని ముందు జాగ్రత్తగా అక్కడ ఉంచారని..

అర్థం కాగానే పెద్దగా అరిచింది కవ్వల.

"ఇక్కడేవరో ఉన్నారు. ఎవడ్రా.. ఈ కాకతీయం గాడికి సహకరిస్తోంది? ఎవడు వాడు.. ధైర్యముంటే నా ముందు కు రారా.." ఆగింది.

లిప్తకాలం ఆలోచించింది. అది రుద్రమ పనే కావచ్చుననిపించింది.

"వసే రుద్రమా! వచ్చావా? వస్తే ఎదురుగా రావాలి. దొంగ యుద్ధాలు అర్థం నేను సహించను. నిన్ను నీ అమ్మాబాబులతో కలిపి చంపేస్తాను. లేదా వాళ్లను చంపి ఆ శరీర భాగాలు నీ చేతిలో పెడతాను. రా రా.. నా ముందుకు రా.."

రెండు చేతులతో ఖడ్గం పట్టుకుని తిప్పుతూ తీవ్రంగా అరుస్తోంది.

గణపతిదేవుడు పల్యంకంలో కూర్చుని ఉండగా సోమలదేవి ఓ కుడ్యానికి కట్టబడి ఉంది.

ఉన్నట్టుండి ఎక్కడినుండో ఓ బల్లెం దూసుకు వచ్చింది. అది వచ్చి వచ్చి ఆమె అనుచరుల్లో ఓ కిరాతకుడికి బలంగా గుచ్చుకుంది. వాడు హాహాకారాలు చేస్తూ గిలగిల కొట్టుకుంటూ ప్రాణాలు విడిచాడు.

అంతా స్థాణువులై నిలబడిపోయారు. ముఖ్యంగా కిరాతకులు బెదిరిపోయారు. అప్రమత్తమై యుద్ధ భంగిమలతో అన్నివైపులా చూస్తూ చురుగ్గా కత్తులు తిప్పుతున్నారు.

అందరి చూపు ఇప్పుడా భవంతిలోని వస్తువులపై పడింది. అది ఎన్నో ఏళ్లుగా వాడుకలోలేని భవనం. అది ప్రధాన మందిరమైతే..లోలోపల మందిరాలు చాలా ఉన్నాయి. అన్నిటా నిండుగా దుస్తులు. కానీ అన్నీ వాడుకలో లేనివి కావడం వల్ల పట్టుకుంటే చిరిగిపోయే వస్త్రాలు, దుప్పట్లు, శాలువలు, మగవారి రాజోచిత దుస్తులు, రాజకుటుంబ మహిళల కోకలు, రవికెలు, కంచుకాలు, వలిపెములు, లోదుస్తులు, ద్వారాలంకరణ బట్టలు..అన్ని గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. మధ్య మధ్య కొన్ని విరిగిన పల్యంకాలు, చెక్క బల్లలు లాంటివి కూడా ఉన్నాయి. అన్ని అడ్డదిడ్డంగా నడవడానికి వీలులేకుండా ఉన్నాయి. పై కప్పు చాలా ఎత్తులో ఉంది. పైకి చూస్తే అంతా బూజు వట్టి గబ్బిలాల్లాంటి జీవులు కదలాడుతున్నాయి.

అందరికి అర్థమైంది ఒక్కటే.

కవ్వల చనిపోయినప్పటి నుంచి ఇది వాడుకలో లేదు. అంటే నలభై ఏళ్లుగా పూర్తిగా పాడుపెట్టారు. ఎవ్వరూ దీనిలోకి రావడం లేదని అర్థం అవుతోంది. ఏది ముట్టుకున్నా దుమ్ము రేగుతోంది. మురికి వాసన. దగ్గరిలోని కారాగారం నుండి దుర్గంధం..

అయితే ఆ బల్లెం ఎక్కడి నుండి ఎలా వచ్చింది??

అందరూ పైకి చూశారు. గోడలకు సహజంగా ఏర్పడ్డ పగుళ్లు. అక్కడక్కడా రంధ్రాలు.. ఓ పగులు నుండి ఆ బల్లెం వచ్చినట్లుగా అందరికి అర్థం అయ్యింది.

కవ్వల గుర్తించింది ఏమిటంటే గణపతిదేవుని అనుకూల శక్తులు ఇక్కడ ఉన్నాయి. అవి క్షణక్షణానికి బలం పుంజుకుంటున్నాయి.

బహుశా రుద్రమ తన కంటే ముందే ఇక్కడికి వచ్చేసి తనపై ఆయుధాలను, సిద్ధం చేసింది. చివ్వున కదిలింది. "రేయ్ ముందు నిన్ను చంపేస్తా.." అంటూ ఖడ్గం తిప్పసాగింది.

ఆమె వెంట కదలుతున్నారు కిరాతకులు.

అప్పుడు మళ్లీ మరో చురక వేగంగా వచ్చి ఓ కిరాతకుడ్ని తాకింది. వాడు కింద పడేలోగా కవ్వల అతనిపై నుండి ఎగిరి గణపతిదేవుని వైపు దూకింది. అప్పుడు మరో ఖడ్గం వచ్చి ఆమెను తాకింది కాని అప్పుడే ఆమె పక్కనున్న కిరా తకుడుని తాకడంతో ఇద్దరూ ప్రక్కకు పడిపోయారు. ఖడ్గం ఎవ్వరినీ తాకకుండా నేలపై పడిపోయింది. అప్పుడే మరో

బాకు వచ్చి గణపతిదేవునికి దగ్గరగా నిల బడిన కిరాతకుడి చేతిని తాకింది.

చేయి సగం తెగిపోయింది. మరో వైపు నుండి మరో ఆయుధం.. ఇంకో వైపు నుండి ఇంకో ఆయుధం!

గణపతిదేవుని దగ్గరగా వెళితే చాలు ఏదో ఆయుధం దూసుకువస్తోంది. ఆయన దగ్గరకు కూడా ఎవ్వరూ వెళ్లలేనట్లు.. ఆయనను రక్షించడానికి.. ఆయుధాలను అమర్చినతీరు చూస్తుంటే అందరికీ మతిపోతోంది.

అందరిలో భయకంపనాలు మొదలయ్యాయి. గణపతిదేవుడు నిమ్మకు నీరెత్తి నట్లు కళ్లు మూస్తూ తెరుస్తూ మౌనంగా ఉండగా, సోమలదేవి అన్నీ చూస్తూ భర్తను చంపడానికి చేస్తున్న యత్నాలకు బెంబేలెత్తిపోతోంది.

ఆయనను ఇక్కడికి తీసుకువచ్చి చంపడం అనే తన పగ తీరబోతున్నందుకు.. తన ప్రయత్నాలు నూటికి నూరు శాతం విజయవంతం అయినందుకు.. ఆ సంతోష క్షణాలతో కాస్త ఆలస్యం చేసిన కవ్వల, ఆమె బృందం ఇప్పుడు పూర్తి అప్రమత్తమయ్యారు. గణపతిదేవుని అనుయాయులు, అతని రక్షణవర్గం ముఖ్యంగా కుమార్తె రుద్రమ, సింఘణదేవునికి, కోట దండనాయకుడికి, దేవగిరి రాజ్య గూఢచార నియోగానికి కూడా తెలియకుండా తనకంటే ముందుగా ఇక్కడికి వచ్చేసి.. పూర్తిగా రక్షణ వలయాన్ని నిర్మించుకున్నాదని కవ్వల భావించింది. ఆ భావన ఆమెను భయకంపితురాలిని చేస్తోంది.

ఎంత తెలివి.. ఎంత తెగువ!!..

కవ్వల, ఆమె కిరాతకముఠా పెద్దపెద్ద ఖడ్గాలను రెండు చేతులతో పట్టి తిప్పుతూ శత్రువు ఎక్కడున్నదో ఎక్కడి నుండి ఆయుధం వదలుతున్నదో తెలియక గుండ్రంగా తిరుగుతున్నారు. ఆ సమయంలో మరొక కత్తి వేగంగా వచ్చి గణపతి దేవుని దగ్గరగా ఉన్నవాడిని తాకింది. వాడు తెలివిగా తప్పుకున్నాడు.

అప్పుడు కవ్వల బయట నుండి లోపలికి ఆయుధాలు ఎలా వస్తున్నాయో చూడాలని.. ఒకడిని ఆయనకు దగ్గరగా ఉంచి అందరిని బయటకు తీసుకు వెళ్లింది.

లోపలివాడు ఆయనపై కత్తి ఎత్తగా మరో బల్లెం వేగంగా లోపలికి దూసుకు వెళ్లింది.

అది ఎక్కడి నుండి లోపలికి వెళ్లిందో చూసిన కవ్వల బృందం అవాక్కయింది.

అది ఈ భవంతికి ఎదురుగా ఉన్న కారాగారం గోడలకున్న పెద్ద పెద్ద కన్నాల నుండి వెళ్లింది.

వివరంగా చూస్తే కారాగారం ముందున్న ఎత్తైన ప్రహారీకి ఎన్నో రంధ్రాలు.. పగుళ్లు. పై కప్పుకు కూడా రంధ్రాలు..అంటే కోష్ఠాగారం భవంతి నుండే కాక పక్కనున్న చెరశాల ప్రహారీగోడ నుండి కూడా లోపల గణపతిదేవునికి పూర్తి రక్షణ ఏర్పాటై ఉంది.

“నిజం. నన్ను గణపతిదేవులవారికిచ్చి వివాహం చేయాలని ఆమె తలపోత. అందుకు అడ్డుగావున్న అక్క కవ్వలను ఆ రాత్రి ఇక్కడ చంపింది అమ్మ నియమించిన మనుష్యులు. అందుకు ఆ రోజు రాత్రి పరిస్థితులు ఆమెకు సహక రించాయి. ఆ వివాహం రోజునే పెద్ద కవ్వలను చంపవలసినదిగా ఆమె మనుష్యులను నియమించింది.

ఇది నిన్నో మొన్నో కాదు కొంతకాలంగా ఆలోచించి నిర్మించిన పకడ్బందీ రక్షణ.

దీనికి కారాగార ఉద్యోగులు కూడా సహకరించినట్లు అర్థమౌతోంది.

అప్పటికి అర్ధరాత్రి అవుతోంది. దగ్గరలో కాగడాలు కూడా లేవు. ఏదో మసక వెలుతురు తప్ప అంతా చీకటి..

అప్పుడు గుర్తించింది కవ్వల.

దగ్గరగా మిలమిల మెరుస్తున్న కత్తులు ఏవో తన దగ్గరగా వస్తున్నాయని.

“వచ్చేశా.. కవ్వలా.. నువ్వు కోరుకున్న నీ శత్రువును. నేనే రుద్రమదేవిని. మహానేత గణపతి దేవుని కుమార్తెను. ఆయన యుద్ధ వారసురాలిని. కాచుకో.. ముందు నన్ను తొలగించు. ఆపై నా తల్లిదండ్రుల మీద చెయ్యి వెయ్యి. వాళ్లకు నీ కత్తి మొన తాకినా నిన్ను నిలువునా చీరుస్తాను.. జాగ్రత్త!!”

రావడం రావడమే రుద్రమ ప్రళయకాల కాళికలా మిన్నూమన్నూ ఏకం చేసి ఆ చీకటిలో అరుస్తోంది.

రుద్రమ అంగరక్షకులైన లెంకలు కవ్వల బృందాన్ని ఎదుర్కొంటున్నారు.

అయితే అంతా చీకటి..

ఆ ప్రాంతమంతా ఉన్నట్టుండి అప్పుడే దివిటీల వెలుగు ఏర్పడింది. చెరశాల పైకప్పు నుండి కోట ప్రహరీ పైనుండే రక్షణభటుల్లా కొందరు వ్యక్తులు.. వాళ్లుకారాగార ఉద్యోగులో, కారాగార నివాసులో కాదు.. చిరిగిపోయిన పంచే.. లేదా కౌపీనంతో గెడ్డాలు, మీసాలు పెరిగిపోయి ముష్టివాళ్లలా ఉన్నారు. అందరూ దివిటీలతో క్రిందికి ఉరికారు. ఆ వెలుగులో సంకుల సమరం మొదల య్యింది.

కవ్వలతో రుద్రమ తలపడగా ఆమె అంగరక్షకు లైన లెంకలు కిరాతకులను ఎదుర్కొంటున్నారు. దివిటీలతో వచ్చిన ముష్టివాళ్లు ఒకరిద్దరు లోపలికివెళ్లి గణపతిదేవుని, సోమలను విడిపించి బయటకు తీసుకువచ్చారు.

అక్కడ జరుగుతున్న యుద్ధాన్ని చూస్తూ గణపతిదేవుడు, సోమల నిస్త్రాణంగా నేలపై కూర్చుండిపోయారు.

దివిటీ పట్టుకున్న వొకరు దివిటీ వెలుగులో గణపతిదేవుని చూస్తూ కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నాడు.

అతని దుఃఖం చూస్తున్న గణపతిదేవుడు అతన్ని ఎక్కడో చూసినట్లుంది కానీ గుర్తించలేకపోతున్నాడు. అతడు అలా ఏడుస్తూనే ఉన్నాడు.

సోమల లేచి కత్తులతో భీకరంగా యుద్ధం చేస్తున్న రుద్రమ, కవ్వల దగ్గరకు వెళ్లి వాళ్లను ఆపడానికి శతధా ప్రయత్నిస్తోంది.

“రుద్రమా.. ఆపండి.. యుద్ధం వద్దు. నేను చెప్పేది విను.. కవ్వలా నేను చెప్పేది విను. అక్క కవ్వలను చంపింది ఎవరో నాకు తెలుసు. నేను చెప్పేది విను. దయచేసి విను. నీ పగ యుద్ధాలు అర్థం పర్థం లేనిది. అనవసరంగా జీవితాన్ని పగతో నాశనం చేసుకున్నావు. కవ్వలను చంపింది ఎవరైనా.. చంపించింది నా తల్లి.. నీ మేనత్త చిల్లాదేవి.”

వినగానే వారిద్దరూ ఆగారు..

సోమల వైపు చివ్వున తిరిగింది బాలకవ్వల.

“నిజం. నన్ను గణపతిదేవులవారికిచ్చి వివాహం చేయాలని ఆమె తలపోత. అందుకు అడ్డుగావున్న అక్క కవ్వలను ఆ రాత్రి ఇక్కడ చంపింది అమ్మ నియమించిన మనుష్యులు. అందుకు ఆ రోజు రాత్రి పరిస్థితులు ఆమెకు సహకరించాయి. ఆ వివాహం రోజునే పెద్ద కవ్వలను చంపవలసినదిగా ఆమె మనుష్యులను నియమించింది. అయితే మెరుపుదాడి కూడా ఆ రోజే జరగడంతో కవ్వలను చంపింది కాకతీయ సైనికులా? దేవగిరి సైనికులా?అనే అందరూ ఊహించారు కానీ మూడో వ్యక్తి చంపారని ఎవరికీ అనుమానం రాలేదు. అమ్మే ఇంత దారుణానికి సిద్ధపడిందని నాకూ తెలియదు. బందీగా ఉన్న ఆయనను రాజప్రాసాదంలోనికి మార్పించింది అమ్మే. హోయసాల బల్లాల మహా రాజుతో మంత్రాంగం నెరపి ఆయన ద్వారా వివాహం జరిపించింది ఆమె. నాన్నగారు మావారికి ఉరిశిక్ష విధిస్తే దానిని ఆపించింది అమ్మే. నిజం! నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇవన్నీ నిజాలే. అమ్మ చనిపోయే ముందు నాకు చెప్పింది కానీ ఆమె చెప్పకుండా చనిపోతే ఆ నెపం నా భర్త పైనే ఉండేది. ఆయన ఈ విషయంలో అమాయకుడు. కవ్వలను ఆయన నిజంగానే ప్రేమిం చారు. ఇద్దరూ ఇక్కడికి రావడం.. ఇక్కడే ఆమె హత్య కావడం జరిగి పోయాయి. జరిగింది ఒకటైతే అందరూ భావించింది మరొకటి. ఇవన్నీ అర్థంచేసుకోవచ్చు. కానీ నీ పగ.. అది మరీ బాధాకరం. అర్థం పర్థంలేని పగ. ఆయన్ను చంపుతాననడం చాలా అన్యాయం కవ్వలా.. ఇప్పటికైనా అర్థం చేసుకో..”

(ముగింపు వచ్చేవారం)

బెంగాల్‌కు 'కాంతి'

పశ్చిమ బెంగాల్‌లో కొత్త వెలుగులు నిండుతున్నాయి. నలభై ఏళ్ల నిర్దిష్ట పరిపాలనలో కమ్మిన చీకట్లు మెల్లమెల్లగా కరిగిపోతున్నాయి. ప్రజాపాలనే ధ్యేయంగా కాంతి కమలాలు వికసిస్తున్నాయి. ప్రఖ్యాత బాంగ్లా రచయిత్రి తస్లీమా నస్రీన్, మూడు సంస్థల సంయుక్త ఆహ్వానంతో సుదీర్ఘ కాలం తర్వాత మాతృ భాషా సోదరులను కలవనున్నారు. భావప్రకటనా స్వేచ్ఛకు, మత విమర్శలకు సంబంధించి దక్షిణాసియాలో ఒక చెరగని ముద్ర వేసిన సాహస రచయిత్రిగా నిలిచారు. భావ ప్రకటన స్వేచ్ఛను ప్రోత్సహించే కేంద్రంలోని అధికార పక్షం ఆమెను బెంగాల్‌కు ఆహ్వానించింది.

తస్లీమా నస్రిన్ ఈ తరానికి తెలియకపోవచ్చు. స్త్రీవాద మానవ హక్కుల కార్యకర్త, వామపక్ష సభ్యురాలైన ఆమె నిజమైన లౌకికవాదానికి ప్రతీక. బాంగ్లాదేశ్‌లోని మైమన్సింగ్‌లోని ఆగస్టు 25,1962న ముస్లిం కుటుంబంలో ఆమె జన్మించిన ఆమె వృత్తిరీత్యా వైద్యులు అయినా, సాహిత్యంపై ఉన్న ఆసక్తితో పూర్తిస్థాయి రచయిత్రిగా మారారు. బాంగ్లాదేశ్‌లో బెంగాలీ హిందువులపై జరుగుతున్న దాడులతో సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితిని విశదీకరిస్తూ, 'లజ్జ'(1993)పేరుతో నవల రాశారు. 1992లో బాబ్రీ కట్టడం కూల్చివేత అనంతరం బాంగ్లాదేశ్‌లోని మైనారిటీ హిందువులపై జరిగినా దాడులు, హింసను ఇతివృత్తంగా రాసిన ఈ నవల ఆమెను స్వదేశానికి దూరం చేసింది. ఈ పుస్తకం అక్కడ తీవ్ర వివాదాన్ని రేపింది.ఆమె ఇస్లాంను అవమానించిందని ఆరోపిస్తూ ముస్లిం ఛాందసవాద గ్రూపులు ఆమెపై ఫత్వాలు జారీ చేయడమే కాకుండా, ఆమె తలపై వెల కట్టాయి. భద్రతా కారణాలను చూపుతూ ఆ దేశ ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది.

ఆ పరిణామాలతో 1994లో ఆమె తన మాతృభూమిని వదిలిపెట్టవలసి వచ్చింది స్వీడన్, జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా వంటి దేశాల్లో ప్రవాస జీవితం గడిపిన ఆమెకు స్వీడిష్ పౌరసత్వం కూడా ఉంది. కాగా ఆ తరువాత బాంగ్లాదేశ్‌లో ఏర్పడిన ఏ ప్రభుత్వమూ ఆమెపై గల నిషేధం ఎత్తివేతకు మొగ్గు చూపలేదు. బాంగ్లాదేశ్‌లో రాజకీయ మార్పులు జరిగిన ప్రతిసారీ ఆమె స్వదేశానికి తిరిగి వెళ్లాలని, అక్కడి ప్రజల మధ్య జీవించాలని ఆశిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఆమె న్యూయార్క్, ఢిల్లీలలో నివసిస్తూ భారత ప్రభుత్వ దీర్ఘకాలిక 'రెసిడెన్స్ పర్మిట్' ద్వారా ఇక్కడే కొనసాగుతున్నారు.

భారతదేశ సంస్కృతితో గల అనుబంధంతో తస్లీమా 2004లో కోల్‌కతాలో నివాసం ఏర్పరచుకున్నారు. అయితే, ఆమె ఆత్మకథ 'ద్విఖండితో'పై తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో, ఆమె కోల్‌కత్తాను వీడవలసిందిగా 2007లో అప్పటి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆదేశించింది. అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, వారిని శాంతింపజేయడానికి రాత్రికి రాత్రే కోల్‌కతా నగరం విడిచి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇది స్పష్టమైన రాజకీయ తుష్టీకరణకు నిదర్శనమని విమర్శకులు, హక్కుల కార్యకర్తలు అప్పట్లో తీవ్రంగా ఖండించారు. కోల్‌కతాను వీడి తస్లీమా ప్రభుత్వ రక్షణలో ఢిల్లీలో నివసిస్తూ వచ్చారు. తమ వ్యాఖ్యలు, రచనల ఫలితంగా మతాధికారుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొని, దేశాన్ని వీడినా సామాజిక మాధ్యమం, వ్యాసాల ద్వారా మహిళా హక్కుల కోసం తన గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు.సొంతగడ్డలోని మైనారిటీలపై దాడులు, మహిళలపై హింసాత్మక సంఘటనలను చోటు చేసుకున్నప్పుడు వాటిని ప్రపంచానికి ఎత్తి చూపడంలో దూరంగా ఉండి కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె భౌతికంగా బాంగ్లాదేశ్‌కు దూరంగా ఉండడంతో స్థానికులు ఒక బలమైన సంస్కర్త సేవలను నేరుగా అందుకోలేకపోవడం కొరతేనని విశ్లేషకులు అంటున్నారు. పితృస్వామ్య వ్యవస్థ, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా అంత ధైర్యంగా మాట్లాడే మరో గళం లేదని, ఆమె ఆ దేశంలోనే ఉండి ఉంటే, క్షేత్రస్థాయిలో మహిళా హక్కుల పోరాటాలకు పెద్ద దిక్కుగా ఉండేవారనే అభిప్రాయమూఉంది. అదే సమయంలో ఆమె ప్రాణ రక్షణ దృష్ట్యా, దేశంలో తీవ్రమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా ఉండటం కోసం ఆమె దూరంగా ఉండటమే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా స్థానికులు భావిస్తున్నారు.'ఆమె స్వదేశానికి తిరిగి వస్తే ఆమె ప్రాణాలకే కాకుండా, ఆమె మద్దతుదారులకూ తీవ్ర ముప్పు ఉంటుంది. ఆమె చేసే తీవ్ర విమర్శ వల్ల దేశంలో మతపరమైన ఘర్షణలు, అల్లర్లు చెలరేగే ప్రమాదం ఉంది. కనుక ఆమె దూరంగా ఉండటమే శాంతిభద్రతల పరంగా మంచిది' అని ప్రభుత్వాలు భావించాయి

మహిళా హక్కుల విషయంలో తస్లీమా ప్రధాన పోరాటాలు చేశారు. మతం పేరుతో స్త్రీలను నాలుగు గోడలకే పరిమితం చేయడాన్ని, వారి హక్కులను కాలరాయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కొన్ని మతపరమైన ఆచారాలు, చట్టాలు మహిళల స్వేచ్ఛను, హక్కులను హరించేలా ఉన్నాయని బలంగా నమ్ముతారు. తమ వివిధ సాహిత్య ప్రక్రియల్లో స్త్రీల వేదనను, వారిపై జరిగే లైంగిక, మానసిక వేధింపులను నిర్భయంగా ప్రస్తావించారు.

తస్లీమా చేసిన సాహసోపేత రచనలు, వాక్ స్వాతంత్ర్య పోరాటానికి గాను యూరోపియన్ పార్లమెంట్ నుండి ప్రతిష్టాత్మక 'సఖరోవ్ బహుమతి', ఫ్రాన్స్ ప్రభుత్వ మానవ హక్కుల పురస్కారం,ఆనంద పురస్కారం వంటి అనేక అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. తస్లీమా దాదాపు 19 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, ఆగస్టు1,2026 న కోల్‌కతాలో జరిగే 'మత ఛాందసవాద వ్యతిరేక సాహిత్య సదస్సు'లో పాల్గొనేందుకు రావడం ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ వేదికపై తాను ప్రసంగిచడంతో పాటు కవితలు చదవనున్నట్లు ఆమె సామాజిక వేదికగా తెలిపారు.'సుమారు 19 ఏళ్ల తర్వాత ఒక స్వేచ్ఛా బెంగాల్‌కు తిరిగి వస్తున్నాను" అంటూ సంతోషాన్ని వ్యక్తపరిచారు. తస్లీమా నస్రీన్ భారతదేశంలో

కమలం

ఎక్కడైనా పర్యటించేందుకు కేంద్ర ప్రభుత్వం నుండి పూర్తి అనుమతి, వీసా సదుపాయం ఉందని అధికారులు ధ్రువీకరించారు. ఈ పర్యటన నేపథ్యంలో ఆమె భద్రతకు సంబంధించి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తగిన రక్షణ ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది.ఆమె కోల్‌కతాకు వస్తున్నప్పటికీ, మాతృభూమి బాంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లే అవకాశాలు ప్రస్తుతానికి కనిపించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలు మారాయి. ఇన్నేళ్ల తరువాత ఆమె మళ్లీ కోల్‌కతాలో అడుగుపెడుతుండటం వెనుక కూడా రాజకీయ వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. బీజేపీ వంటి పార్టీలు ఆమెను ''తూష్టీకరణ రాజకీయాల'కు వ్యతిరేకం చిహ్నంగా చూపిస్తూ, వామపక్ష, తృణమూల్ కాంగ్రెస్ పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాలను ఎండగట్టడానికి ఈ సందర్భాన్ని వాడుకుంటున్నాయంటున్నారు

మహిళా హక్కుల విషయంలో తస్లీమా ప్రధాన పోరాటాలు చేశారు. మతం పేరుతో స్త్రీలను నాలుగు గోడలకే పరిమితం చేయడాన్ని, వారి హక్కులను కాలరాయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కొన్ని మతపరమైన ఆచారాలు, చట్టాలు మహిళల స్వేచ్ఛను, హక్కులను హరించేలా ఉన్నాయని బలంగా నమ్ముతారు. తమ వివిధ సాహిత్య ప్రక్రియల్లో స్త్రీల వేదనను, వారిపై జరిగే లైంగిక, మానసిక వేధింపులను నిర్భయంగా ప్రస్తావించారు. తన రచనల ద్వారా చైతన్య పరిచేందుకు ప్రయత్నించారు. పురుషాధిక్య సమాజంలో స్త్రీని కేవలం ఒక వస్తువులా చూడడాన్ని ఆమె తప్పుపట్టారు. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం, తమ శరీరంపై, జీవిత నిర్ణయాలపై పూర్తి హక్కు ఉండాలని పోరాడారు. పెళ్లి, సంసారం అనే బంధాల పేరుతో స్త్రీల స్వేచ్ఛను హరించ కూడదని ఆమె రాశారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరికీ సమాన హక్కులు కల్పించే లౌకిక చట్టాలు ఉండాలని ఆమె వాదించారు. మతపరమైన, వ్యక్తిగత చట్టాల వల్ల ..ముఖ్యంగా వివాహం, విడాకులు, ఆస్తి హక్కుల విషయంలో మహిళలకు అన్యాయం జరుగుతోందని, అందరికీ సమానమైన లౌకిక చట్టాలు ఉంటేనే మహిళలకు నిజమైన రక్షణ, ప్రాధాన్యత లభిస్తుందని తస్లీమా వాదిస్తారు.

భారత్‌లో బీజేపీ రాజకీయాలు, మహిళా హక్కుల విషయంలో తస్లీమా వైఖరి ఆసక్తికరంగా ఉంటుంది. మహిళల విషయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలను స్వాగతించిన ఆమె, మరికొన్ని అంశాలపై భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయంగా మారిన 'త్రిపుల్ తలాక్' పద్ధతిని చట్టవిరుద్ధం చేస్తూ నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గట్టిగా సమర్థించారు. మతం పేరుతో మహిళలపై జరిగే అణచివేతను అరికట్ట డానికి ఇది ఒక మంచి అడుగు అని అభిప్రాయ పడ్డారు. దేశంలో 'ఉమ్మడి పౌరస్మృతి'ని తీసుకురావాలనే బీజేపీ ప్రభుత్వ యోచనకు మద్దతు ఇస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లు ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్త చేశారు.

మహిళా హక్కులు అంటే.. ప్రాథమిక మానవ హక్కులే అని తస్లీమా గట్టిగా చెబుతారు. పురుషుడికి సమాజంలో లభించే స్వేచ్ఛ, గౌరవాలు మహిళకు కూడా దక్కాలని నిరంతరం వాదిస్తుంటారు.చట్టాలు మతం ఆధారంగా కాకుండా, మానవత్వం, రాజ్యాంగం ఆధారంగా ఉండాలని,రాజకీయాల్లో లేదా ప్రభుత్వ నిర్ణయాల్లో మతం ప్రమేయం ఏ మాత్రం ఉండకూడదని తస్లీమా అంటారు. మతపరమైన వివాహం, విడాకులు, ఆస్తి హక్కులు వంటి వర్సనల్ చట్టాలు స్త్రీలను వెనక్కి నెడుతున్నాయని వాదిస్తారు. అందుకే అందరికీ సమానమైన ఉమ్మడి పౌర స్మృతిని సమర్థిస్తారు. మహిళా హక్కులను మెరుగుపరిచే బీజేపీ నిర్ణయాలను అభినందిస్తూ, అదే సమయంలో దేశంలో మహిళల భద్రత, స్వేచ్ఛ విషయంలో ఇంకా పూర్తిస్థాయి మార్పు రావాలని ఆమె ఆశిస్తారు.

'పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, లౌకికవాదం, మానవ హక్కుల కోసం అంతర్జాతీయంగా అవగాహన కల్పించడం నా భవిష్యత్ ఎజెండాలో ముఖ్య భాగం. ఆరోగ్యం సహకరించినంత కాలం నా అనుభవాలను, సమాజంలోని రుగ్మతలను విశ్లేషిస్తూ రచనలు చేయడం ఆపను' అని స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్తులో అక్కడ మాతృదేశంలో భావప్రకటన స్వేచ్ఛకు అనుకూలమైన వాతావరణం ఏర్పడితే, అక్కడికి తిరిగి వెళ్లడమే ఆశయంగా తస్లీమా జీవిస్తున్నారు.

జయశ్రీ ఆచంట
సీనియర్ జర్నలిస్ట్



ఇథనాల్ కలిపిన పెట్రోల్ లాభమా? నష్టమా?.. మన వాహనాల మైలేజీ తగ్గుతుందా? ఇంజన్ దెబ్బతింటుందా? ప్రస్తుతం దేశ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఇది. ముడి చమురు దిగుమతులనూ, కర్బన ఉద్గారాలనూ తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ దిశగా ప్రవేశ పెట్టిన ఈ20 పెట్రోల్ మీద అనుమానాలు ముసురుకున్నాయి. కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దూకుడు మీద అనుమానాలు వ్యక్తం చేసేవారూ ఉన్నారు. అయితే ఇవన్నీ అపోహలు మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారుల్లో ఆందోళనలు తొలగించేందుకు చమురు సంస్థలు కూడా రంగంలోకి దిగాయి.

కేంద్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల మీద విపక్షాలతో పాటు సమాజంలోని కొన్ని వర్గాల నుంచి విమర్శలు ఎదురు కావడం కొత్తేమీ కాదు. కానీ ఈసారి బీజేపీ అభిమానులు కూడా ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. దీనంతటికీ కారణం ఇథనాల్. ఈ విషయంలో స్పష్టత రావాలంటే కొన్ని క్షేత్ర స్థాయి వాస్తవాలు తెలుసుకోవాలి.. మన దేశంలో జనాభా, వాహనాలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక అవసరాల కారణంగా ఇంధనానికి డిమాండ్ పెరుగుతోంది. ఏటా దాదాపు 2,400 లక్షల ముడి చమురును వినియోగిస్తున్నాం. అయితే మనకు తగిన చమురు నిక్షేపాలు లేవు. దేశీయ ఉత్పత్తి కేవలం 15% మాత్రమే ఉండగా, మిగిలిన 85% నుండి 90% వరకు విదేశాల నుంచే దిగుమతి చేసు కుంటున్నాం. రోజువారీ సగటు దిగుమతి దాదాపు 49 లక్షల నుంచి 55 లక్షల బ్యారెల్స్ (సుమారు 7 నుండి 8 లక్షల టన్నులు) వరకు ఉంటుంది.

మన దేశం ప్రధానంగా రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాక్‌ల నుండి అత్యధి కంగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా రష్యానుండి భారత్‌కు సగం కంటే ఎక్కువ (సుమారు 50-52%) దిగుమతులు వస్తున్నాయి. రష్యా - ఉక్రెయిన్, అమెరికా - ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సంక్షోభంతో పాటు అమెరికా విధించిన ఆంక్షల సుంకాల కారణంగా కారణంగా దేశీయంగా చమురు అవసరాలకు కొరత రాకుండా బ్రెజిల్, వెనిజులా, నైజీరియా, అంగోలా, అర్జెంటీనా వంటి దేశాల నుంచి కూడా దిగుమతులను విస్తరించాం.

విదేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకోవడం కోసం ఏటా సగటున 123 నుండి 135 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10 లక్షల కోట్ల నుండి 11.2 లక్షల కోట్లు) విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేస్తోంది. దేశ మొత్తం దిగుమతుల బిల్లులో ఒక్క ముడి చమురు వాటానే అత్యధికంగా దాదాపు 20% వరకు ఉంటుంది.

పరిష్కారంగా ఇథనాల్

చమురు దిగుమతి కోసం పెద్ద ఎత్తు విదేశీ మారక నిల్వలను అధికంగా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా పుట్టిన ఆలోచనే ఇథనాల్. ఇది స్వచ్ఛమైన జీవ ఇంధనం. చెరకు, మొక్కజొన్న, జొన్నలతో పాటు గోధుమ, వరిపొట్టు, ఇతర వ్యవసాయ వ్యర్థాల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తారు. దీన్ని పెట్రోల్‌లో కలపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ డిస్టిలరీలు పెరగడం ద్వారా గ్రామస్థాయి ఆర్థికవ్యవస్థ బలపడి, రైతులకు వేగంగా ఆదాయం అందుతోంది.

అన్నింటికన్నా ముఖ్యంగా దేశానికి వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. భవిష్యత్తులో ఇంధన కొరత లేకుండా చూసుకోవడానికి, స్వయం సమృద్ధి సాధించడానికి ఇది ఒక ముఖ్యమైన చర్య. నిజానికి ఇథనాల్ బ్లెండింగ్ 2001లోనే మొదలైంది. ప్రయోగాత్మకంగా కొన్ని రాష్ట్రాల్లో మొదలై... రకరకాల దశలు దాటుతూ చివరకు 2014 నాటికి బ్లెండింగ్ 2%కి చేరింది. ఆ తర్వాత కేంద్రం వేగంగా కదిలి.. ఉత్పత్తిని పెంచే చర్యలు తీసుకోవటంతో ఇపుడు పెట్రోల్‌లో ఇథనాల్ 20% చేరిపోయింది. ఇపుడు దేశంలో ఏకంగా రోజుకు 2 లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తవుతోంది. ఇథనాల్ కలిపిన శాతాన్ని బట్టి ఈ5, ఈ20 పెట్రోల్‌గా పిలుస్తారు.

గడిచిన పదకొండేళ్లలో భారతదేశ ఇథనాల్ ప్రయాణం ఈ5 నుంచి ఈ20కి విజయవంతంగా సాగింది. గతేడాది డిసెంబర్ 15న ఈ20 (20% ఇథనాల్ - 80% పెట్రోల్)ను దేశవ్యాప్తంగా అధికారికంగా ప్రవేశపెట్టారు. వాస్తవానికి ఈ లక్ష్యాన్ని 2030నాటికి పెట్టుకోగా 2025 నాటికే సాధించాం. 2014-25 మధ్య లక్ష కోట్ల రూపాయలకు పైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అయింది. ఫలితంగా 736లక్షల టన్నుల మేర కర్బన ఉద్గారాలు తగ్గాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. అదేమీ చిన్న విషయం కాదు. దేశ ఇంధన చరిత్రలో ఒక కొత్త అధ్యాయం. దేశీయంగా ప్రస్తుతం ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి

2000-2100 కోట్ల లీటర్లు. ఈ20కి అవసర మయ్యేది 1000-1200 కోట్ల లీటర్లే. కొద్దినెలల క్రితం చమురు కంపెనీలు 1050 కోట్ల లీటర్ల ఇథనాల్ కొనుగోలుకు టెండర్లను పిలిచాయి. తయారీదారులేమో 1776 కోట్ల లీటర్లు (70% అధికం) సరఫరా చేస్తామంటున్నారు. తాజాగా ఈ20

స్వావలం

నుంచి 100 % ఇథనాల్ (ఈ85, ఈ100) వైపు పరుగులు తీయాలని ఉత్సాహపడుతున్నాం.

బ్రెజిల్ విజయమే ఆదర్శం

ఇథనాల్ ఉత్పత్తి, వినియోగంలో బ్రెజిల్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ఆ దేశం 1970లో తలెత్తిన చమురు సంక్షోభం నుండి పాఠాలు నేర్చుకుని, మొక్కజొన్న, చెరకు ఆధారిత ఇథనాల్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధి, పర్యావరణ పరిరక్షణలో అద్భుతమైన విజయాలను సాధించింది.బ్రెజిల్ ఇథనాల్ బ్లెండింగ్ చట్టాలను దశాబ్దాలుగా అమలు చేస్తోంది. పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని దశలవారీగా పెంచుతూ, ప్రస్తుతం ఈ దేశంలో పెట్రోల్‌లో ఈ32 ఇథనాల్ ఒక ప్రధాన విజయంగా చెప్పవచ్చు. 2003లో బ్రెజిల్ ప్రవేశపెట్టిన 'ఫ్లెక్స్-ఫ్యూయల్' ఇంజిన్ టెక్నాలజీ ఒక మైలురాయి. వాహనాలలో 100% స్వచ్ఛమైన ఇథనాల్‌ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధనంగా వాడుకోవచ్చు. నేడు ఆ

బనకే ఇథనాల్

దేశంలో అమ్ముడవుతున్న కొత్త కార్లలో ఎక్కువ భాగం ఈ టెక్నాలజీతోనే వస్తున్నాయి. ఇథనాల్ ధర పెట్రోల్ కంటే కనీసం 25 % నుండి 30 % చౌకగా ఉండేలా ప్రభుత్వం పన్ను మినహాయింపులు అమలు చేస్తోంది. దీనివల్ల వినియోగదారులు ఇథనాల్ వైపు మొగ్గు చూపుతారు. ప్రతి బంకులో ఇథనాల్ సులభంగా లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ మార్పులపై పోరాటంలో బ్రెజిల్ పాత్రను అత్యున్నతంగా నిలిపింది. ఇథనాల్ పరిశ్రమ బ్రెజిల్ జీడీపీకి గణనీయంగా దోహదపడుతోంది. సుమారు 1.5 మిలియన్లకు పైగా ఉద్యోగాలను సృష్టిస్తూ, గ్రామీణ అభివృద్ధిని, ఇంధన స్వావలంబనను సాధించి విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించింది.

ఇథనాల్ మీద అపోహలు

ఇప్పటికే బ్రెజిల్ సహా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకే, ఇతర ఐరోపా దేశాలు, చైనా తదితర దేశాలు ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని వాడుతున్నాయి. అయితే మన దేశంలో ఈ20 పెట్రోల్ అందుబాటులోకి రాగానే వినియోగదారుల్లో ఆందోళనలు మొదలయ్యాయి. అవి ఇలా ఉన్నాయి..

పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌లో శక్తి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీనివల్ల వాహనాల మైలేజ్ సుమారు 3% నుండి 10% వరకు తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా వాహనదారులు ఒకే దూరానికి ఎక్కువ ఇంధనం కొనాల్సి వస్తోంది. ఏప్రిల్ 2023 కంటే ముందు తయారైన పాత వాహనాల ఇంజన్లు ఈ20 ఇంధనానికి అనుకూలంగా లేవు. దీంతో పాత వాహనాలలోని రబ్బర్ ట్యూబులు, గ్యాస్కెట్లు, ఇంజన్ భాగాలు త్వరగా పాడవుతాయి. వాహనం వేగం పుంజుకోవడంలో ఆలస్యం కావడంతో చలికాలంలో ఉదయాన్నే స్టార్ట్ చేయడానికి కొంతమంది వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇథనాల్ గాలిలోని తేమను లేదా నీటిని త్వరగా లాక్కుంటుంది. వాహనాన్ని చాలా రోజులు వాడకుండా పక్కన పెడితే, ట్యాంకులో నీరు–ఇథనాల్ విడిపోతాయి. దీనివల్ల ట్యాంకు లోపల తుప్పు పట్టడం లేదా ఇంజన్ ఆగిపోవడం జరుగుతుంది.

ఈ నేపథ్యంలో వాహనదారుల్లో ఆందోళనలను తొలగించడానికి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో ఇంధన నాణ్యత తనిఖీలను మరింత ముమ్మరం చేశాయి. ఇంధన నాణ్యతపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా బంకుల్లో లేదా కస్టమర్ కేర్‌లో నమోదు చేయాలని, సోషల్ మీడియా పోస్టులను నమ్మవద్దని చమురు సంస్థలు కోరాయి.

అవాస్తవ ప్రచారం వద్దు

ఇథనాల్ విషయంలో ప్రచారంలో ఉన్నవన్నీ అపోహలే అని పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాల ఇంజిన్లు దెబ్బతినవు. అయితే, 2023 కంటే ముందు తయారైన పాత వాహనాలలో ఇథనాల్ రబ్బరు గొట్టాలు లేదా ప్లాస్టిక్ భాగాలను కొద్దిగా అరిగేలా చేసే అవకాశం ఉంది. ఆధునిక వాహనాలు ఈ ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునేలా తయారవుతున్నాయి. కొత్తగా వస్తున్న వాహనాలన్నీ ఈ20కి అనుకూలంగానే వస్తున్నాయని, పాత వాహనాలలో సాధారణ సర్వీసింగ్ సమయంలో చిన్నపాటి రబ్బర్ విడిభాగాలను మార్చుకుంటే పెద్దగా నష్టం ఉండదని ప్రముఖ వాహన తయారీ సంస్థలు స్పష్టం చేశాయి. ఇప్పటికే మారుతీ కార్ల సంస్థ వీటిని అందుబాటులోకి తెచ్చింది.

కాగా, ఇథనాల్‌లోని శక్తి స్వచ్ఛమైన పెట్రోల్ కంటే కొంచెం తక్కువగా ఉంటుంది. దీనివల్ల దాదాపు 2% నుండి 5% వరకు మైలేజీ తగ్గే మాట వాస్తవమేనని కేంద్రం అంగీకరించింది. కర్బన ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. పెట్రోల్ బంకుల్లో లేదా వాహనం ట్యాంకుల్లో నీరు చేరితే అది ఇథనాల్‌తో కలిసిపోయి ఇంజిన్ పనితీరును దెబ్బతీసే ప్రమాదం ఉంది. అయితే ఇది ఇథనాల్ చేసిన కల్తీ కాదు లీకేజీలు, నిర్వహణ లోపాల వల్ల జరిగే పరిణామం. కాగా, మన దేశం ఇథనాల్ లక్ష్యాలను చేరుకోవాలంటే, ముందుగా విక్రయ కేంద్రాలను విరివిగా అందుబాటులోకి తెచ్చేందుకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. రెండోతరం ఇథనాల్ కర్మాగారాలకు ఆర్థిక లోటును పూడ్చే నిధిని 2028 నుంచి 2035 వరకు పొడిగించాలి. ఈ20 అనుకూల కార్లు తయారైన తరవాత, ఈ30కి అనుకూలమైన కార్ల ఉత్పత్తి కోసం తయారీదారులను ఇప్పుడే ఆదేశించాలి.

పెట్రోల్‌లో ఇథనాల్ 20 కలపడం వల్ల వాహన ఇంధన సామర్థ్యంలో ఎలాంటి తగ్గుదల తమ అధ్యయనంలో కనిపించలేదని ఐఐటీ కాన్పూర్ పరిశోధకులు వెల్లడించారు. ప్రస్తుత లేదా పాత వాహనాలకు నష్టం కలిగించే ఏ ఒక్క ఆధారం కూడా కనిపించలేదని స్పష్టం చేశారు. మైలేజీ అనేది ఇంధనం కంటే కూడా వాహనం నడిపే విధానం, రోడ్ల పరిస్థితి, వాహనం సకాలంలో మెయింటెనెన్స్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని ఐఐటీ కాన్పూర్‌లోని ఇంజిన్ రీసెర్చ్ ల్యాబొరేటరీ ప్రాజెక్టు సైంటిస్ట్ ధ్రువ్‌రాజ్ అభిప్రాయపడ్డారు. స్వచ్ఛమైన పెట్రోల్‌తో పరీక్షలు చేసినా ఫలితాలు ఇలాగే ఉంటాయన్నారు.

వ్యవసాయానికి ప్రమాదమా?

ఇథనాల్ తయారీకి ఆహార పంటలను మళ్లించడం సరైందేనా? అనే ప్రశ్న వేస్తున్నారు.. ఇథనాల్ తయారీకి ప్రధాన వనరు అయిన చెరకు

పంటకు 10,000 లీటర్ల నీరు అవసరమనే ప్రచారం జరుగుతోంది. ఇది భూగర్భ జలాలపై ఒత్తిడి పెంచుతుంది అంటున్నారు. అయితే ఇది అవాస్తవమని కేంద్రం కొట్టి పారేసింది. లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి 3-4 లీటర్ల నీరు అవసరమవుతుంది. నీటి ఎద్దడి లేని ప్రాంతాల్లో ప్లాంట్లు పెడితే చాలు. అలాగే ఇథనాల్ కోసం మొక్కజొన్న, విరిగిన బియ్యం వంటి ఆహార ధాన్యాలను భారీగా వాడటం వల్ల భవిష్యత్తులో పశుగ్రాసం లేదా ఆహార వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉం దంటున్నారు. కాగా దేశ ఆహార భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి, ఆ తర్వాత మిగిలిన ధాన్యం, చెరకును మాత్రమే ఇథనాల్ తయారీకి ఉపయోగిస్తున్నారు. దీనికి కేవలం పంట వ్యర్థాలు, అవశేషాలు, వెదురు చాలు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణకూ ఆస్కారం ఉంటుంది. పంజాబ్, హర్యానాల్లో ఏటా 3.5కోట్ల టన్నుల వరిగడ్డి ఉత్పత్తి అవుతోంది. అందులో సగం గడ్డిని తగలబెడుతున్నారు. అక్కడ మిగిలే వ్యర్థాలతోనే పదివేల కోట్ల లీటర్ల ఇథనాల్‌ను తయారు చేయవచ్చు. భారత చమురు సంస్థ పానీపట్‌లో రూ.900 కోట్ల పెట్టుబడితో రెండు లక్షల టన్నుల వరిగడ్డిని మూడు కోట్ల లీటర్ల ఇథనాల్‌గా మార్చే రెండోతరం కర్మాగారాన్ని నిర్మించింది. దానివల్ల 63వేల కార్లను రోడ్లపై నుంచి తొలగించినంతగా ఉద్గారాలు తగ్గాయి.

ఈ20 తప్పని సరి ఎందుకు?

కాగా దేశంలో ఈ 20 పెట్రోల్ విక్రయాలను తప్పనిసరి చేయడంపై వాహనదారులు, ప్రతిపక్షాలు, పరిశ్రమ నిపుణుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బంకుల్లో ఇథనాల్ లేని పెట్రోల్ లభించకుండా పోయింది. పాత వాహనాలు ఉన్నవారు కూడా బలవంతంగా ఈ20 ఇంధనాన్నే కొట్టించాల్సి వస్తోంది.

ప్రధానంగా వాహనాల మైలేజీ తగ్గడం, పాత ఇంజన్లు పాడవడం, పారదర్శకత లేకపోవడం వంటి అంశాలపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వస్తోంది. ఈ20 పెట్రోల్ వాడటం వల్ల ఇంజన్ పాడైందంటూ దాఖలైన ఒక కేసులో, కస్టమర్‌కు కొత్త కారు ఇవ్వాలని, లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని కన్స్యూమర్ కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. దీనితో దాదాపు 45% మంది వాహనదారులు చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు.

మరోవైపు పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్నందున ధరలు తగ్గించాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. గతంలో ఇథనాల్ వాడకం పెరిగితే పెట్రోల్ ధర లీటరుకు రూ. 15 వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సంకేతాలు ఇవ్వడంతో ప్రజల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్

ఇథనాల్ విషయంలో నితిన్ గడ్కరీ మీద విమర్శలకు వస్తున్నా, ఆయన సమర్థవంతగా తిప్పికొడుతున్నారు. వాస్తవానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రిగా ఆయన సాధించిన విజయాల ముందు ఆయనపై వస్తున్న వ్యక్తిగత దాడులు దిగదుడుపుగా చెప్పవచ్చు. దేశ మౌలిక వసతుల రంగంలో గడ్కరీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.

ఉత్పత్తి ఖర్చు చాలా తక్కువ. అందువల్ల, 20% చౌకైన ఇథనాల్ కలిపినప్పుడు ఆ లాభాన్ని వాహన దారులకు బదిలీచేసి, లీటరు ధరను తగ్గించాలని కోరుతున్నారు. మైలేజీ తగ్గినప్పుడు వినియోగదారుడిపై అదనపు ఆర్థిక భారం పడుతుంది కాబట్టి, ఇంధన ధరను తగ్గిస్తేనే అది సమన్యాయం అవుతుందని వాహనదారులు కోరుతున్నారు

100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్ మాత్రమే కావాలనుకునే వారు, ఎక్కువ ధర చెల్లించి దానిని కొనుగోలు చేయవచ్చని నితీన్ గడ్కరీ స్పష్టం చేశారు. దేశంలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇ20 ఇంధనం అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రత్యామ్నాయాలు సాధ్యంకావని, అయితే ఇథనాల్ లేని పెట్రోల్ కోరుకునే వారికోసం ప్రీమియం ధరలో అది లభిస్తుందని చెప్పారు.

నితిన్ గడ్కరీ దూకుడు

ఇథనాల్ వినియోగం, ఉత్పత్తిని ప్రోత్సహించడంలో నితిన్ గడ్కరీ కీలకపాత్ర పోషిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ఇంధన రంగంలో స్వయం సమృద్ధి, రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఇథనాల్ వాడకాన్ని బలంగా సమర్థిస్తున్నారు. మన దేశం తన ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. దీనివల్ల ఏటా భారీగా విదేశీ మారకద్రవ్యం ఖర్చవుతోంది. ఈ భారాన్ని తగ్గించడానికి పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ శాతాన్ని దశలవారీగా పెంచాలని గడ్కరీ సూచిస్తున్నారు. భవిష్యత్తులో 100 వినియోగం సాధించాలని ఆయన లక్ష్యంగా నిర్దేశించారు.

రవాణా శాఖ మంత్రిగా దేశంలో నడిచే వాహనాలు ఏ రకమైన ఇంధనాన్ని వాడుతున్నాయనేది ఆయన పరిధిలోకి వస్తుంది. 100% ఇథనాల్‌తో నడిచే వాహనాలను, ఈ100 నిబంధనలను ఆటో మొబైల్ కంపెనీలు తయారు చేసేలా గడ్కరీ స్వయంగా చొరవ తీసుకుని ఆ ఫైళ్లపై సంతకాలు చేశారు. వాహనాలనుంచి వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించడం, పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడం తన మంత్రిత్వ శాఖ ప్రాధాన్యతల్లో ఒకటని ఆయన తెలిపారు. అయితే స్వచ్ఛమైన పెట్రోల్ లభ్యత గురించి ప్రశ్నించినప్పుడు, ఆ నిర్ణయం తీసుకోవాల్సింది పెట్రోలియం మంత్రిత్వ శాఖేనని, తన పరిధి కాదు అని అంగీకరించారు. సాంప్రదాయ ముడి చమురు దిగుమతుల ద్వారా లబ్ధి పొందే కొన్ని పెద్ద కార్పొరేట్ శక్తులు, ఇంధన లాబీలు కావాలనే ఇథనాల్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని, దేశ ప్రయోజనాల కోసం ఆ లాబీలను ఎదిరించడానికే తాను ఈ విషయంలో గట్టిగా మాట్లాడుతున్నానని గడ్కరీ స్పష్టం చేశారు

గడ్కరీ సాధించిన విజయాలు

ఇథనాల్ విషయంలో నితిన్ గడ్కరీ తనపై వస్తున్న విమర్శలను సమర్థవంతగా తిప్పికొడుతున్నారు. వాస్తవానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రిగా ఆయన సాధించిన విజయాల ముందు ఆ విమర్శలు దిగదుడుపుగా చెప్పవచ్చు. దేశ మౌలిక వసతుల రంగంలో గడ్కరీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. జాతీయ రహదారుల విస్తరణ వేగవంతమైన నిర్మాణం, అత్యాధునిక సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఆయన ఎనలేని విజయాలు సాధించారు.

చివరగా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఇథనాల్, విద్యుత్, హైడ్రోజన్, సీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించారు. దీనిలో భాగంగా స్వయంగా హైడ్రోజన్ కారును ఉపయోగించి ప్రజలకు అవగాహన కల్పించారు.

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

ప్రత్యేక వ్యాసం

బోనాలతో భోగభాగ్యాలు

బోనాలు తెలంగాణ జానపద సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం. ఆషాఢం రావడంతోనే భాగ్యనగరిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. వారం వారం ఉత్సవ ఉత్సాహం రెట్టింపు అవుతుంది. ఆషాఢ తొలి ఆదివారం గోల్కొండ జగదాంబిక ఆలయంలో బోనాలు ఉత్సవాలు ప్రారంభమై మిగిలిన మూడు ఆదివారాల్లో వరుసగా బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, పాతబస్తీ లాల్‌దర్వాజ మహంకాళి అమ్మవార్ల ఆలయాల్లో వైభవంగా జరుగుతాయి. వాటికి సమాంతరంగా జంటనగరాల నలుమూలల, శివారు ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలలో బోనాలు జరుపుకుంటారు. రాష్ట్రంలోని పల్లెల్లో మఖ కార్తె ప్రవేశంతో ఈ వేడుకను నిర్వహించుకుంటారు.

శక్తితత్వం సమస్త ప్రకృతిని ముందుకు నడిపిస్తోందని విశ్వాసం. ఆ శక్తి సంవిధానాన్ని పలు రూపాలుగా ఆరాధించడం ఆర్ష సంప్రదాయం. వివిధ మతాల, జాతుల ప్రజలు సామరస్యంగా కలసిమెలసి అపురూపంగా నిర్వహించుకొనే వేడుకల్లో బోనాలు ముందు వరుసలో ఉంటుంది. శతాబ్దాల సహజీవనానికి ఇది చిరునామాగా నిత్యనూతనంగా సాగిపోతోంది. బోనాలు ఆరంభ వికాసాలను, ప్రధానంగా భాగ్య నగరంలోని సంబరాలను మననం చేసుకుంటే...

గోల్కొండ జగదాంబిక...

చారిత్రక ఆధారాలను బట్టి కాకతీయులు గోల్కొండ కోటను కట్టక ముందు యాదవ కులస్థులు అక్కడ మేకలు, గొర్రెలను మేపేవారు. అప్పటికే అక్కడ గల ఆలయం (ఎల్లమ్మ)లో తరచూ బోనాలు సమర్పించేవారు. అనంతర కాలంలో నిర్మితమైన కోటను 'గొల్లకొండ'గా పిలిచే వారని, కాలక్రమంలో గోల్కొండగా వాడుకలోకి వచ్చిందని చెబుతారు. అక్కడి జగదాంబిక ఆలయంలో మొదటగా నిర్వహించే ఈ బోనాలును చెలిమి బోనాలు అంటారు.

బల్కంపేట ఎల్లమ్మ

ఒకనాటి బెహలూఖాన్‌గూడ నేటి బల్కంపేటలో శతాబ్దాల క్రితం ఊట బావిలో ఆవిర్భవించిన ఎల్లమ్మ తల్లి నాటి నుంచి విశేషపూజలు అందుకుంటోంది. ఒక రైతు తన పొలంలో బావి తవ్వుతుండగా శయన రూపంలో గల అమ్మవారి విగ్రహం కనిపించింది. దానిని గ్రామస్థుల సహకారంతో ఒడ్డుకు చేర్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అలాగే చిన్నపాటి గుడి కట్టించారు. అనంతరం సంస్థానాధీశుడు రాజా శివరాజ బహద్దూర్ నూటపాతికేళ్ల క్రితం (1919) అమ్మవారికి ఆలయం నిర్మించారు. అమ్మవారు జలధివాసినిగా ఆవిర్భవించినందున అమెను 'జలదుర్గ' అవతారంగా పూజిస్తారు.

ఉజ్జయిని మహంకాళి

సికింద్రాద్‌లోని మహంకాళి బోనాలు లష్కర్ బోనాలుగా ప్రసిద్ధి. ఈ ఆలయంలో అమ్మవారి మూర్తి దారుశిల్పంగా ఉండేదట. 1815 ప్రాంతంలో నర్సయ్య అనే సైనికోద్యోగి ఉజ్జయిని నుంచి తెచ్చిన కాళికాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిం చారట. బదిలీపై అక్కడికి వెళ్లిన నర్సయ్య అప్పట్లో అక్కడ ప్రబలిన కలరా బారినుంచి తనను కాపాడి స్వస్థలానికి చేరిస్తే అమ్మవారికి గుడికడతానని మొక్కుకున్నాడని, ఆ మొక్కు ఫలితమే నేటి ఆలయమని చరిత్ర చెబుతోంది.

లాల్ దర్వాజా మహంకాళి

లాల్ దర్వాజాలోని మహంకాళి అమ్మవారు ఉగ్రరూపంలో దర్శనమిస్తారు. సింహవాహిని మహంకాళిగా పూజిస్తారు. నాడు ప్లేగు, కలరా మహమ్మారి నుంచి అమ్మవారు కాపాడారని, నేటికీ ఆమె కరుణా కటాక్షాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ ప్రధాన ఆలయాలతో పాటు వాడవాడలా కొలువైన ముగ్గురమ్మల మూలపుటమ్మ దుర్గమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, మారమ్మ, పెద్దమ్మతల్లి, అంకాలమ్మ, రేణుకమ్మ, ముత్యాలమ్మ, పోలేరమ్మ, మాంకాళమ్మలను కాళీమాత రూపాలుగా పూజిస్తూ బోనాలు సమర్పించుకుంటారు. అమ్మ అనుగ్రహించే ఫలితాలను బట్టి జానపదులు శక్తి రూపాలకు పేర్లు నిర్ణయించు కున్నారని తెలుస్తోంది. పిల్లలను చల్లగా కాచే తల్లిని పోచమ్మగా, ఆడపడుచులకు అండగా ఉండే ముత్యాలమ్మ, ఊరి సరిహద్దులకు రక్షణగా ఉండే పోలేరమ్మ, మహమ్మారులనే మటు మాయంచేసే మాంకాళమ్మా.. ఇలా శక్తిమాతలకు ఆషాఢంలో సభక్తికంగా బోనాలు సమర్పిస్తారు.

బోనమంటే...

బోనమంటే భోజనమని అర్థం. అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్ని ప్రత్యేకంగా తయారు చేస్తారు. కరవుకాటకాలు నెలకొన్నప్పుడు, రోగకారక పరిస్థితులు ఎదురైనప్పుడు, ఉపద్రవాల సంభవించినప్పుడు శక్తి స్వరూపాలకు వైవిధ్య భరితమైన అన్న పదార్థాలను నివేదించాలని 'కాళికా పురాణం' సూచించింది. కొత్త కుండలో బియ్యం, పాలు, బెల్లం, చక్కెర కలిపి నైవేద్యం తయారు చేస్తారు. ఈ కుండకు సున్నంరాసి, పసుపు కుంకుమ, వేపకొమ్మలతో అలంకరి స్తారు.దానిపై గండదీపం పేరిట జ్యోతిని వెలిగించి మహిళలు శిరస్సున దాల్చి, మేళతాళాలతో వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు.

బోనం కోసం వినియోగించే పూజాద్రవ్యాల్లో ఆరోగ్య సూత్రాలు ఇమిడి ఉం డడవల్ల సామాజిక శాస్త్రవేత్తలు వీటిని 'ఆరోగ్య బోనాలు' అని సూత్రీకరించారు. వీటిలో ఉపయోగించే నిమ్మకాలు, వేపమండలు, జ్యోతిలో వ్యాధినిరోధకాలు ఉన్నాయని సైన్స్ చెబుతోంది. వేదాంతపరంగా చూస్తే, బోనపు కుండ మానవ శరీరానికి ప్రతీక. అందులోని అన్నం జీవశక్తికి సంకేతం. కుండపై వెలిగే జ్యోతి మన ఆత్మజ్యోతి. దానిని పరంజ్యోతితో మమేకం చేయాలన్నదే బోనాల వేడుకల అంతరార్థంగా చెబుతారు. పాంచభౌతికమైన మట్టికుండలాంటి ఈ శరీరాన్ని సర్వాత్మకంగా దైవశక్తికి బోనంగా సమర్పిం చడం ద్వారా అమ్మతల్లి అనుగ్రహానికి పాత్రులు కావచ్చన్నదే బోనాలు ఉత్సవాల పరమార్థంగా చెబుతారు. 'సాగనంపు' ఘట్టం ద్వారా.. పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డను చీరసారెలతో సాగనంపినట్లు అమ్మతల్లికి పసుపు కుంకుమలు, పండ్లుపూలు కానుకగా ఇచ్చి ఆమె నెలవుకు తిరిగి పంపడం ద్వారా ఆషాఢ బోనాలు పరిసమాప్తమవుతాయి.

– స్వామి

తెలుగు తోటలో

తెలుగు రాష్ట్రాల్లో విద్యాకుసుమాలను పూయించిన విజ్ఞాన గని, విశాఖపట్టణానికి గర్వకారణమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం, 2026 ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంది. ఈ విశ్వవిద్యాలయం నాడు ఏర్పడటానికి ఎందరో కృషి చేశారు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు, ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపన ఆంధ్రుల ప్రధాన డిమాండ్లు, వారి కృషిని ఒకసారి స్మరించుకుందాం.

ఆంధ్రప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఒక భాగంగా ఉండేది. దీనిని కాంపోజిట్ మద్రాసు స్టేట్ అని పిలిచేవారు. ఈ రాష్ట్రంలో ఆంధ్రప్రాంతం 58 శాతం విస్తీర్ణంలో, (రెండు కోట్ల జనాభా) రాష్ట్ర జనాభాలో 40 శాతంగా, భాషాపరంగా ఆలోచిస్తే తెలుగువారు 3వ స్థానంలో ఉండేవారు. కాని బెంగాలీలు, గుజరాతీలు, తమిళులతో పోలిస్తే ఆంధ్రులు చాలా వెనుకబడి ఉన్నారు. ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపు ఉండేది కాదు, వారిని 'మద్రాసీలు' గానే పిలిచేవారు.

1910 నాటి గణాంకాలు చూస్తే ఆంధ్రులు ఎంతటి నిరాదరణకు గురయ్యారో తెలుస్తుంది. రాష్ట్రంలో 31 కళాశాలలు ఉండగా, ఆంధ్రాలో 8 మాత్రమే స్థాపితమయ్యాయి. రాష్ట్రంలో 583 సెకండరీ పాఠశాలలుండగా 163 మాత్రమే ఆంధ్రాలో ఉన్నాయి. పారిశ్రామిక పాఠశాలలు 3800 ఉండగా ఆంధ్రాలో 400 మాత్రమే ఉండేవి. ఇంజనీరింగ్, మెడికల్, లా కాలేజీలు ఆంధ్రాలో ఒక్కటీ లేదు. ఆయా విద్యాసంస్థల్లో ప్రిన్సిపాల్, హెడ్ మాస్టర్లుగా ఆంధ్రేతరులే పని చేసేవారు. రాష్ట్ర రాజధాని అయిన మద్రాసులోనే అన్ని కళాశాలలు, పరిశ్రమలు స్థాపితమయ్యాయి.

గుంటూరులో జొన్నవిత్తుల గురునాధం 'యంగ్‌మెన్ లిటరరీ అసోసియేషన్' స్థాపించారు. దీనిలో చల్లా శేషగిరివారు, గొల్లపూడి సీతారామశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సభ్యులుగా వుండేవారు. వీరంతా పత్రికలకు వ్యాసాలు రాసి ఆంధ్రాలో విద్యాభివృద్ధి ఆవశ్యకతను, ప్రత్యేకాంధ్ర ఏర్పాటును ప్రచారం చేసేవారు. 1912 మే నెలలో నిడదవోలులో కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల 21వ సంయుక్త సమావేశాలు నిర్వహించారు. దానితోపాటు ఆంధ్రసాహిత్య సమావేశం జరపాలని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వేమవరపు రామదాసు పంతులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించారు.

1913లో బాపట్లలో ప్రధమాంధ్ర మహాసభ మే 20వ తేదీన బయ్యా నరసింహేశ్వర శర్మ అధ్యక్షతన జరిగింది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర తీర్మానం చేశారు. రెండవ సభ 1914 ఏప్రిల్‌లో విజయవాడలో న్యాపతి సుబ్బారావు అధ్యక్షతన, 3వ సభ విశాఖపట్నంలో 1915 మే నెలలో పానగల్ రాజా పానుగంటి రామరాయణి అధ్యక్షతన జరిగింది.

1913 బాపట్ల ప్రధమాంధ్ర మహాసభలో ప్రత్యేక ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆవశ్యకతను గూర్చి చర్చించారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు భాషకు సరైన పరిగణన లేదని, తెలుగు పాఠ్య పుస్తకాలు పరిశీలించే సంఘ సభ్యులకు, పరీక్ష పేపర్లు దిద్దేవారికి కూడా తెలుగుభాష సరిగ్గా రాదని, మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు వారికి ప్రవేశం కష్టసాధ్యమని అనేకమంది సభ్యులు పేర్కొన్నారు. తెలుగువారి విద్యాభివృద్ధి కోసం, తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రత్యేక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని. ఇది ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర స్థాపనకు దారి తీయగలదని వారు భావించారు. భాషా ప్రయుక్తంగా విశ్వవిద్యాలయాలు ఏర్పాటుకావాలని వారు కోరారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పాటు వీలుకాదని మద్రాసు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది.

1925లో కొత్తగా ఏర్పడిన రెండవ కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను రామదాసు పంతులు వివరించారు. సరిగా అదే సమయంలో జస్టిస్ పార్టీ తరుపున గెలిచిన శ్రీకాకుళానికి చెందిన అన్నపు పరశురామ్‌దాస్ పాత్రో విద్యాశాఖ మంత్రి అయ్యారు. నాడు కాంపోజిట్ మద్రాసు స్టేట్ ముఖ్యమంత్రి సుబ్బరాయన్, కుమార మంగళం తండ్రి అప్పటికే 1916లో మైసూర్ విశ్వవిద్యాలయం, 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాదు) స్థాపించడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఏర్పాటుకు డిమాండ్ పెరిగింది.

1917 ఫిబ్రవరిలో వేంకటపతిరాజు మద్రాసు శాసనసభలో ఒక తీర్మానం ప్రతిపాదిస్తూ మొదటి ప్రపంచ యుద్ధానంతరం తెలుగు జిల్లాలకు ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, ఈ లోపుగా ఆంధ్రదేశంలో మరికొన్ని కళాశాలలూ, పాఠశాలలు స్థాపించాలని కోరారు. 1919, 1920ల్లో కూడా ఇలాంటి ప్రతిపాదనే వచ్చింది.

1920 అక్టోబర్ 15వ తేదీన మద్రాసు విశ్వవిద్యాలయ సెనేట్ రాష్ట్రంలో మరికొన్ని విశ్వవిద్యాలయాలు ఏర్పాటుకు సమయం ఆసన్నమైందని, వీలైనంతవరకు ఈ విశ్వవిద్యాలయాలు భాషా ప్రయుక్తంగా ఉండాలని తీర్మానించింది. ప్రత్యేక ఆంధ్రవిశ్వవిద్యాలయం స్థాపించాలని కోరుతూ విశాఖపట్టణానికి చెందిన సభ్యుడు సూర్యనారాయణ శాసనమండలిలో తీర్మానం ప్రతిపాదించారు. కాని కొందరు తమిళ సభ్యులు వ్యతిరేకించారు. చివరకు తీర్మానం 1921 సెప్టెంబరు 2వ తేదీన శాసన మండలి ఆమోదం పొందింది, కానీ విద్యామంత్రి ఎ.పి.పాత్రో మద్రాసు యూనివర్శిటీ పునర్ వ్యవస్థీకరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఇది ఆంధ్రా యూనివర్శిటీ ఏర్పడకుండా పన్నిన పన్నాగమని పలువురు సభ్యులు భావించారు.

తరువాత నాలుగేళ్ల కాలవ్యవధిలో ఆంధ్ర విశ్వ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన బిల్లు శాసనమండలిలో ప్రవేశపెట్టి, సెలక్ట్ కమిటీకి నివేదించారు. ఈ కమిటీలోని రాయలసీమ సభ్యులు తమ ప్రాంతాన్ని ఆంధ్ర విశ్వ విద్యాలయ పరిధి



నుండి తొలగించాలని కోరారు. బళ్లారి జిల్లాను మినహాయించమని సత్యమూర్తి కోరారు. ఈ సవరణలన్నీ వీగిపోయాయి. కె.వి.రెడ్డి నాయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బదులుగా తెలుగు విశ్వవిద్యాలయంగా వ్యవహరించాలని సవరణ ప్రతిపాదించగా, అది రెండు ఓట్ల తేడాతో వీగి పోయింది. చివరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926 ఏప్రిల్ 26న బెజవాడలో ప్రారంభమయ్యింది.

ఈ విశ్వవిద్యాలయ నిర్వహణకు 33మంది సభ్యులతో సెలెక్ట్ కమిటీని ఏర్పాటుచేశారు. మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే ఈ విశ్వవిద్యాలయానికి కట్టమంచి రామలింగారెడ్డి (సి.ఆర్.రెడ్డి) ప్రధమ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. భాషాపరంగా పేరు పెట్టిన భారత దేశంలోని ప్రధమ విశ్వవిద్యాలయం ఇదే. ఇక్కడ తెలుగు, కన్నడ, ఒరియా మొదలైన ప్రాంతీయ

జ్ఞాన పుష్పం

భాషలలో బోధన, పరీక్షల నిర్వహణకు అనుమతిం చారు.

విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయం ఏర్పాటు గురించి వివాదం నెలకొంది. 33మంది సభ్యులలో 20మంది వేరు వేరు పట్టణాలను సమర్థిస్తూ భిన్నా భిప్రాయాలను ప్రతిపాదించారు. చివరకు 1929లో వ్యవస్థాపక వైస్ చాన్స్‌లర్ సర్.సి.ఆర్.రెడ్డి కృషి ఫలితంగా వైజాగ్ ఈ గొప్ప విద్యాకేంద్రానికి వేదికగా ఎంపికైంది. సి.ఆర్.రెడ్డి స్థానంలో 1931లో డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ వైస్ ఛాన్స్‌లర్‌గా నియమిత లయ్యారు. ఆయన 1931 జూలైలో "కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్"ను ప్రారంభించారు. ప్రారంభ కోర్సులుగా తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, ఆర్థిక శాస్త్రం,

The 'Executive' of the Andhra University Students' Union, Waltair, 9 December 1933

రాజనీతి శాస్త్రం ప్రారంభించారు. ఒక ఏడాది తర్వాత జైపూర్ రాజా విక్రమ దేవవర్మ ఆర్థిక సహాయంతో, 1932 జూలై 4న కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భౌతిక, రసాయన శాస్త్ర శాఖలు ప్రారంభిం చాడు. 1955లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలతో ఆంధ్రాయూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ స్థాపితమైంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయ చట్టంలో విశ్వవిద్యాలయ పాలనా విభాగాలు విజయవాడలో ఏర్పరచాలని, రాజమండ్రిలో బోధనాశాఖలు ఏర్పరచాలని నిర్ణయమైంది. కానీ ఈ నిర్ణయం అనుచితమని గమనించిన ప్రభుత్వం బోధనాశాఖలను కూడా విజయవాడకు మార్చడం ఉచితమని విశ్వవిద్యాలయ సెనేట్‌కు సిఫార్సు చేసింది. దీనితో వివాదం మొదలైంది. రాయలసీమ సభ్యులు విశ్వవిద్యాలయం తమ ప్రాంతంలో ఉండాలని పట్టుబట్టారు. వారి అభిప్రాయాన్ని మన్నించి అనంతపురం విశ్వవిద్యా లయ కేంద్రంగా ఉండాలన్న ప్రతిపాదనను ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ 35-20 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. మద్రాసు శాసన మండలి సెలక్ట్ కమిటీ దీనిని అంగీకరించింది. వివాదం ముగిసినట్లే అనేవేళ, విశాఖ పట్నంలో విశ్వవిద్యాలయ కేంద్రంగా ఉండాలని అనేకమంది సభ్యులు ప్రతిపాదించిన మీదట మద్రాసు రాష్ట్ర ముఖ్య మంత్రి డా॥ సుబ్బరాయన్ విశాఖపట్టణం విశ్వవిద్యా లయ కేంద్రంగాను, బోధనా విశ్వవిద్యాలయంగా కొనసాగాలని నిర్ణయించారు. చిత్తూరుకు చెందిన బొల్లిని మునిస్వామి నాయుడు రాయలసీమ ప్రాంతాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధి నుండి తొలగించాలని సవరణ తీర్మానం ప్రతిపాదించగా దానిని ఆమోదించారు. రాయలసీమ జిల్లాలను తిరిగి మద్రాసు విశ్వవిద్యాలయ పరిధిలోనే ఉంచారు.

1937లో ఆంధ్ర మహా సభ రజతోత్సవ వేడుకలు కడప కోటరెడ్డి అధ్యక్షతన విజయవాడలో ప్రారంభమయ్యాయి. దానిలో ప్రారంభ ఉపన్యాసం హాలహర్వి సీతారామిరెడ్డి చేశారు. ఆయన మాట్లా డుతూ రాయలసీమ ప్రజలకుగల అనుమానాలను నివృత్తి చేస్తేగాని ఆంధ్ర రాష్ట్ర సాధనకు సహకరించలేమని తేల్చే శారు. దానితో ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య విభేదాలు ప్రారంభమ య్యాయి. వాటిని తొలగించడానికి 1937 నవంబరు 16న కాశీనాధుని నాగేశ్వర రావు పంతులు నివాసమైన శ్రీభాగ్‌లో సమావేశమై చర్చించి ఒక అంగీకారానికి వచ్చారు. దీనిని శ్రీభాగ్ ఒడంబడిక అని పిలుస్తారు. దీని ప్రకారం ఆంధ్ర విశ్వవిద్యాలయ పర్యవేక్షణలో రెండు కేంద్రాలు వాల్తేరు, అనంతపురంలలో నెలకొల్పాలి. ఆంధ్రుల మధ్య సాంఘిక, సాంస్కృతిక సమన్వయం సాధించాలి. అందుకుగాను కళాశాలలను స్థాపించాలని నిర్ణయించారు. 1939లో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమవ్వడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో (1939-45) ముఖ్యంగా జపాన్ బాంబు దాడుల భయంతో ఆంధ్ర విశ్వ విద్యాలయ భవనాలను 1942 ఏప్రిల్ 16 న మిలటరీ అవసరాల కోసం సైన్యం స్వాధీనం చేసుకున్నది. ఆ సమయంలో తరగతుల నిర్వహణకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు విశ్వవిద్యా లయాన్ని గుంటూరు తరలించారు, కాని కెమిస్ట్రీ శాఖను మాత్రం మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజికి మార్చారు. 1945లో యుద్ధానంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విశాఖకు తరలించారు. నాటి నుండి ఈ విశ్వవిద్యాలయం నిరాటంకంగా కొనసాగుతోంది.

ఆంధ్ర విశ్వకళా పరిషత్‌కు ఎంబ్లమ్‌ను కేతు రామమోహన శాస్త్రి తయారుచేశారు. ఎంబ్లమ్‌లో 'తేజస్వినావధీతమస్తు' అంటే మమ్మల్ని తేజోవంతులుగా చేయుము. సముద్రం, తామర పువ్వులు దానిపై ఉదయించే సూర్యుడు, ఆ కిరణాలు తామరపువ్వు పుష్పంపై పడుతున్నట్లుగా రూపొందిం చిన ఈ చిహ్నం చాలా అర్థవంతమైనది. దానికి రెండు ప్రక్కల నాగుపాములు ఉం టాయి. సముద్రం జ్ఞానానికి ప్రతీక. కలువ చదువుల తల్లి కూర్చునే ఆసనం, కిరణాలు అక్కడ బోధించే వివిధ బోధనాంశాలు. నాగులు జ్ఞాన పరిరక్షకులు.

నేడు 450 ఎకరాలలో 215 భవనాలతో 76 సమావేశ మందిరాలతో, 58 విభాగాలలో 16 పరిశోధనా కేంద్రాలతో 20 వేల మంది విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతున్నారు. సుమారు 59 దేశాల నుండి వేయిమంది విద్యార్థులు చదువుకుంటు న్నారు. నాక్ ఎక్రిడేషన్‌లో ఆంధ్రాయూనివర్శిటీ 'ఎ++ గ్రేడ్‌ను పొందింది. ఈ విద్యా ప్రాంగణానికి ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు న్నాయి.

ఆంధ్రాయూనివర్శిటీ శతాబ్ది దార్శనిక పత్రం (2026-2126)ను విడుదల చేసింది. 1926లో స్థాపించిన ఈ సంస్థను ఆవిష్కరణ, పరిశోధన, సుస్థిర అభివృద్ధిలో ప్రపంచ అగ్రగామిగా మార్చడంపై దృష్టి సారిస్తుంది. కాంవన్ వారనత్వ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం. "100 పేటెంట్ల సేకరణ కార్యక్రమాన్ని" ప్రారంభించడం, డిజిటల్ బోధనా పద్ధతి మెరుగుపరుచు కోవడం, పరిశ్రమ, విద్యాసంస్థల భాగస్వామ్యంను పెంపొం దించడం, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడం దీని ముఖ్య లక్ష్యాలు.

"ఎంత చక్కనిదోయి ఈ తెలుగుతోట
ఎంత పరిమళమోయి ఈ తోట పూలు
ఏ అమృత హస్తాలు ఏ సురలు తాకిరో
ఏ అచ్చెరల మెరుపులీ తీరు దిద్దిరో
ఈ పూల తీరులో ఇంత తీయదనము
ఈ లతల పోకిళ్ల కింత వయ్యారము".

కందుకూరి రామభద్రరావు చెప్పినట్లు ఈ విశ్వవిద్యాలయంపై పాటలా విరాజిల్లుతోంది.

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

సంఘ కార్యమే వారి జీవితం

హల్దేకర్‌జీ సైద్ధాంతిక కాంతిపుంజం. వారి కాంతి మనకు సదా దిశా దర్శనం గావిస్తుంది. సంఘకార్యంలోనే జీవించేవారికి మరణముండదు. ఎందుకనగా సంఘకార్యమే వారి జీవనంగా ఉండినది కనుక. వారిది యుగానుకూల ఆలోచన. వారు వాస్తవ రూపంలో అత్యంత ఆధునికులు.

సంఘకార్యంలో మృత్యువే విశ్రాంతి అని హల్దేకర్‌జీ తరచూ చెబుతుండేవారు... ఇదే విధంగా వారు వారి జీవితపు అంతిమ ఘడియవరకు సంఘకార్యంలోనే నిమగ్నమై ఉన్నారు. వారు సదా స్ఫూర్తిప్రదాత, నిరంతర చలనశీలి. ఒకసారి తృతీయవర్ష సంఘ శిక్షావర్గలో శిక్షక్‌గా 58 నిమిషాలపాటు ఆగకుండా గణసమత తీసుకున్నారు. ఆనాడు అంతసేపు ఆగకుండా సమత తీసుకోవటం విశేషంగానే కనిపిస్తుంది. అయినా అంతసేపు అలసిపోకుండా గణసమత తీసుకోవటం హల్దేకర్‌జీ కార్యక్షమతను, సమర్థతను గుర్తుచేసుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యమనిపిస్తుంది. గుండెకు లబ్‌డబ్ శబ్దం ఎటువంటిదో సంఘ శాఖకు దక్ష-ఆరమ అటువంటివని చెబుతుండేవారు.

హల్దేకర్‌జీ సంఘటన వ్యవస్థను నియమబద్ధంగా తీర్చిదిద్దారు. వారు ఎక్కడికి వెళ్లినా కొత్త వ్యక్తుల్ని పరిచయం చేసుకొని వారిని సంఘకార్యంలోకి తీసుకొచ్చేవారు. వ్యవస్థపట్ల పూర్ణ సమర్పిత వ్యక్తిత్వం వారిది. వ్యవస్థలో భాగంగా ఏదేని నిర్ణయం జరిగితే ఆ నిర్ణయంపట్ల వారెప్పుడూ వ్యతిరేకతను, అసంతృప్తి భావనను వ్యక్తంచేసేవారు కాదు. కార్యకర్తలు తమ తోటి అభిప్రాయాలు చెబుతుంటే పూర్తి ధ్యానమగ్నులై మందస్మిత సహనంతో వినడం వీరి ప్రత్యేకత. స్థానిక కార్యకర్తలు తీసుకున్న నిర్ణయాలను సమ్మతించడంలోనే విశిష్టత కనిపిస్తుంది. వారు అనారోగ్యంగా మంచం మీదుండి చికిత్స పొందుతున్నపుడు, జ్యేష్ఠ ప్రచారక్‌గా వారు క్షేత్రస్థాయి కార్యకర్తలను పిలిపించుకొని, కార్యకర్తలలో దోషాలను ఎలా సరిచేయాలో చర్చించేవారు. ఈ ప్రక్రియలో ఒక్కొక్కసారి కంటతడి పెట్టేవారు. ఆర్ద్రతతో విషయ ప్రస్తావన ఉండేది. దోషాలను సరిచేసే చక్కటి వ్యవస్థకోసం పరితపించేవారు.

హల్దేకర్‌జీకి తమ కింద పనిచేసే ప్రచారకులపై సంపూర్ణ విశ్వాసం ఉండేది. అందువల్ల సంఘకార్యం విషయంలో వాళ్లకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చేవారు. ఎప్పుడైనా, ఏదైనా పొరపాటు జరిగినా తీవ్రంగా పరిగణించేవారు కాదు. బైఠక్‌లలోనే ఆ విషయం ప్రస్తావనకు తెచ్చి మార్గదర్శనం చేసేవారు. అది కూడా వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి కాకుండా అందరికీ వర్తించే విధంగానే చేసేవారు. ప్రచారక్ లేక సంఘ కార్యకర్త తన గ్రహణశక్తితో, అనుభవంతో సంఘ పని ఎలా చేయాలనే విషయం స్వయంగానే తెలుసుకోగలుగుతాడని వారు భావించేవారు. ఈ సందర్భంలో స్వర్గీయ దాదారావు పరమార్థ్ గారిని ఉదహరిస్తుండేవారు. కొత్తగా తమిళనాడుకు ప్రచారక్‌గా వచ్చిన ఒకరు దాదా రావ్‌జీని సంఘ పని ఎలా చేయాలో చెప్పండని అడిగాడట. అప్పుడు దాదారావుజీ "నీకు ఏం చేయాలో తెలుసుగదా? ఎలాచేయాలో అదే తెలుస్తుంది – చేస్తూపో' అన్నారట. బహుశా దాదారావుజీ చెప్పిన ఈ సమాధానమే హల్దేకర్‌జీకి మార్గదర్శకమై ఉంటుంది.

సంఘకార్యానికి మూలాధారం సంపర్కమే. అందువల్ల నిరంతరం స్వయంసేవకులను కలవటానికి హల్దేకర్‌జీ ఎక్కువ ప్రాముఖ్యమిచ్చేవారు. స్వయంసేవకుల కుటుంబాల్లో జరిగే శుభ, అశుభ కార్యాలన్నిటికీ వారు తప్పక హాజరయ్యేవారు. అక్కడికి వచ్చే బంధువులందరితో పరిచయాలు చేసుకుని వాళ్లతో కలిసిపోయేవారు. ఆ సంఘటనలను వారెప్పుడు మర్చిపోయేవారు కాదు. శాఖకు కొత్త స్వయంసేవక్ ఎవరైనా వచ్చినట్లయితే ఇంట్లో శిశువు పుట్టినప్పుడు కుటుంబసభ్యులందరూ ఆ శిశువును చూసి ఆనందించినట్లుగా మన నిత్యశాఖలో ఎవరైనా కొత్తగా శాఖకు వస్తే అదేవిధంగా మనం ఆనందిస్తాము. అతనితో పరిచయం పెంచుకుంటాము అని అభివర్ణించేవారు. ఇంట్లో కొత్తగా పుట్టిన శిశువుపట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటామో సంఘశాఖకు కొత్తగా వస్తున్న స్వయంసేవక్ పట్ల కూడా అంతే ప్రేమ, ఆప్యాయతతో తప్పకుండా శ్రద్ధ తీసుకోవాలని వారు కోరేవారు. స్వయంసేవకుల పట్ల వారు చూపించే ఆత్మీయ ప్రేమానురాగాలు అనిర్వచనీయం.

సామాజికంగా చాలా సంస్థలు ప్రారంభమవుతుంటాయి. ఒకటి రెండు కార్యక్రమాలు ఉత్సాహవంతంగా ప్రారంభిస్తారు. కార్యాలయం ప్రారంభం చేస్తారు. తరువాత కార్యక్రమాలు చల్లబడుతాయి. ఎందుకు ఆగిపోయిందంటే నిధులు లేవంటారు. మన శాఖలు 1925 నుండి నడుస్తున్నాయి. ఒకవేళ శాఖ ఆగిందంటే ముఖ్యశిక్షక్ బదిలీ అయితే బహుశా ఎపుడైనా శాఖ ఆగవచ్చు. తిరిగి ఎవరో ఒకరు ప్రారంభం చేస్తారు. కానీ నిధులు లేవు, శాఖ ఆగిపోయింది అనే పరిస్థితి మనకు రాదు అంటుండేవారు. శాఖ పనికి డబ్బుతో పనేముంది. ధ్వజముంటే పెడతాము లేకపోతే ధ్వజస్థానం శుభ్రం చేసి దానికే ప్రణామ్ చేస్తాము. ఆడుకుంటాము, పాడుకుంటాము అని స్వయంసేవకులకు ఉద్బోధ చేసేవారు. హల్దేకర్‌జీ ఆదర్శ స్వయంసేవక్. తన సంపూర్ణ జీవితాన్ని డాక్టర్‌జీ, గురూజీలు కలలుకన్న రాష్ట్ర కార్యానికి అంకితం చేసారు. వీరు సంఘ దీక్షాపరుడిగా జీవించారు. ఏ కోణం నుంచి దర్శించినా వీరి నిస్వార్థసేవ ఎంతోమందికి ప్రేరణనిస్తోంది. ఆయనే శ్రీరామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ. వారు క్షేత్ర ప్రచారక్ బాధ్యతల నుంచి విముక్తులైనా చివరిశ్వాస వదిలేవరకు రకరకాల పనులను చేపట్టి అనేకమంది స్వయంసేవకులకు అహర్నిశలు మార్గదర్శనం చేస్తూనే వచ్చారు.

– ఆత్మీయతకు ప్రతిరూపం హల్దేకర్‌జీ పుస్తకం నుండి

సమర్పిత జీవనం

కేవలం యుద్ధం చేయడమే పురుషార్థం కాదు. జీవన సర్వస్వాన్ని ఏకైక ధ్యేయం కోసం సమర్పించడం కూడా పురుషార్థమే. రాంభావు హల్దేకర్‌జి 1954లో సంఘప్రచారక్‌గా వచ్చారు. అన్ని రకాలుగా ఎందరో సంఘాన్ని బాగా ద్వేషిస్తున్న కాలఖండమది. అంతటి విషమపరిస్థితిలోనూ ప్రచారక్‌గా రావడాన్ని మించిన పురుషార్థమేముంటుంది. అనేకమంది శ్రీ హల్దేకర్ సంపర్కంలోకి వచ్చారు. వారికి సంఘాన్ని అర్థంచేయించడానికి బౌద్ధిక్, చర్చవంటివి అవసరం లేకపోయింది. శ్రీ హల్దేకర్‌జీ జీవనమే సంఘజీవనంగా అందరిముందు నిలిచి ఉండినది. వారు మహారాష్ట్ర నుండి వచ్చి ఆంధ్రుడిగా (తెలుగు) సామాజిక జీవనంతో, అక్కడి సంఘకార్యంతో, కార్యకర్తలతో, వేషభాషలతో అద్భుత సామంజస్యాన్ని సాధించే కఠిన కార్యాన్ని కూడా సహజంగా చేసేశారు. పర్యటన చేయుటకు శక్తి తగ్గిపోయిన పిదప లేఖన, రచన కార్యమాధ్యమంగా సంఘసాధనలో లీనమై ఉండిపోయాడు. అనేక మరాఠీ పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. కేవలం వ్రాయడం వరకే కాదు, ఆ సాహిత్యం పాఠకులకుచేరే విషయాన్ని కూడా బాగా ఆలోచించారు.

-భయ్యాజీ జోషి, ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ

శ్రీ గురవే నమః!!

భారతీయ జీవన విధానంలో వ్యాసమహర్షి స్థానం విలక్షణమైనది.గురుప్రసక్తి వచ్చినప్పుడు ఆయనను సభక్తిగా ప్రస్తావించడం సహజం. భారతీయ ఆధ్యాత్మిక ఆచార్యుల ప్రధాన ప్రతినిధిగా ఆ మహర్షిని అర్చిస్తారు. 'ఒక ముఖంతో దిగివచ్చిన చతుర్ముఖుడు, రెండు చేతులతో తిరుగాడిన చతుర్బాహుడు, నుదుటిపై మూడవ కంటిని దాచిన నీలకంఠుడు...' అని ఆయనను త్రిమూర్తి స్వరూపునిగా శ్లాఘించింది గీతామహాత్మ్యం. ఆయన వేదవిభజన చేసి, పురాణేతిహాసాలను, బ్రహ్మసూత్రాలను అందించిన ఆ మహనీయుడి జయంతే గురుపూర్ణిమ.

శిశువుకు తొలిగురువులు తల్లిదండ్రులే అయినా తరగని జ్ఞానాన్ని అందించి మనిషిని మనీషిగా తీర్చిదిద్దేది మాత్రం గురువే. అందుకే గురువు త్రిమూర్తులతో సమానమని, పరబ్రహ్మ స్వరూపమని ఆర్షవాక్కు. అలా జ్ఞానప్రదాత గురువుకు భారతీయ సమాజంలో తరతరాలుగా అత్యంత గౌరవ స్థానం దక్కుతోంది. గురువునే ప్రత్యక్ష దైవంగా విశ్వసించి, ఆయనను ఆశ్రయించేవాడే నిజమైన శిష్యుడు. గురువు తాను ఆర్జించిన జ్ఞానాన్ని శిష్యుల ద్వారా లోకానికి అందిస్తారు. అయితే.. 'గురువుగా ఉండడానికి తగిన వారెవరు?' అని ప్రశ్నించిన ఆదిశంకరులే శాస్త్ర సంప్రదాయాలపట్ల చక్కని జ్ఞానం కలిగి ఉండడం ('అధిగత తత్త్వ'..), నిరంతరం శిష్యుల అభ్యుదయాన్ని ఆకాంక్షించడం (శిష్య హితాయోద్యతః సతతమ్) గురువుకు ఉండవలసిన ప్రధాన లక్షణాలుగా వివరించారు. వేదవేదాంత విదురుడు, జ్ఞానసంపన్నుడు, ఈర్ష్యా ద్వేషాలు లేశమైనా లేనివాడు, నిస్వార్థపరుడు, యోగ సాధకుడు, నిరాడంబరుడు మాత్రమే గురువు కాగలడని, అలాంటి గురువే శిష్యులలోని / సమాజం లోని అంధకార తిమిరాన్ని పారదోలి జ్ఞానమార్గంలో నడపించగలడని ఉపనిషత్తులు చెబుతున్నాయి. తత్వం ఎరిగిన వాడు, ధర్మాన్ని బోధించేవాడు, దైవత్వం గలవాడు గురువు కాగలడని జైనం; గురువే ధర్మం, సంఘం అని బౌద్ధం విశ్వసిస్తున్నాయి. గురువు రూపమే ధ్యానానికి మూలమని, ఆయన పాదాలే పూజకు, ఆయన అనుగ్రహమే మోక్షానికి మూలమని 'గురుగీత' చెబుతోంది.'దేవుడు, గురువు పక్కపక్కనే నిలబడితే మొదట గురువుకి నమస్కరిస్తాను' అన్నాడు కబీరు.

చతుర్వేదాలు సుమారు అయిదువేల ఏళ్ల క్రితం ఒకే వేదంగా కలిసి ఉండేవి. అపారమైన ఈ విజ్ఞాన రాశిని ఆకళింపు చేసుకోవడం, ప్రచారం చేయడం ప్రజలకు కష్టతరమైంది. ఆ అనంత జ్ఞానరాశిని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో విభజించి, వాటిని లోకంలో ప్రచారం చేయడానికి వ్యవస్థను ఏర్పరచిన వాడు కృష్ణద్వైపాయన మహర్షి వ్యాసుడు.

గురు ఆరాధన శ్రేష్ఠమైన దేవతారాధన కన్నా మిన్న అని పురాణ, చారిత్రక గాథలు చెబుతున్నాయి. రామకృష్ణుల వంటి సాక్షాత్ అవతారపురుషులే నరులుగా జన్మించిన వారి వద్ద శిష్యరికం చేశారు. 'యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః'(శ్రేష్ఠుడు ఆచరించినదే ఇతరులూ ఆచరిస్తారు) అన్న గీతాచార్యుని మాటను ఈ సందర్భంగా అన్వయించ వచ్చు. 'నేను ధర్మాన్ని అనుసరించకపోతే ఇతరులు కూడా అనుసరించరు. అందువల్ల వారిని ధర్మ మార్గంలో నిలబెట్టేందుకే నేను వారికి ఆదర్శ ప్రాయంగా ఉండాలి' ('యది హ్యహం న వర్తేయ జాతు కర్మణ్య తన్ద్రితః/ మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః.గీత-23:3) అనడం ఆయన పాటించిన గురుభక్తి, గురు ధర్మానికి ప్రతీకగా చెబుతారు.

పురాణ యుగం నుంచి ఆధునిక యగం వరకు ప్రభవించిన ఎందరో మహనీయులకు ఉన్నతోన్నతు లైన వారు గురువులుగా లభించారు. 'గురు 'శబ్దాన్ని సార్థకం చేశారు. మర్యాద రాముడికి విశ్వామిత్రుడు, జగద్గురువు కృష్ణుడికి సాందీపని మహర్షి గురువు. గోవిందపాదుల వద్ద ఆదిశంకరులు, పంచగురువుల వద్ద రామానుజాచార్యులు శిష్యరికం చేశారు. సమర్థ రామదాసు.. హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీకి, భారతీయ సంస్కృతీ వైభవాన్ని విదేశాలలో చాటి చెప్పిన స్వామి వివేకానందకు రామకృష్ణ పరమహంస గురువులుగా దిశానిర్దేశం చేశారు.

సరైన గురువు తన శిష్యుడిని సన్మార్గంలో నడిపిస్తాడు. గురుశిష్యులు ఆత్మశరీరం వంటివారు. ఒకరు వాక్కు అయితే మరొకరు భావం.గురువే ప్రత్యక్ష దైవం అనే విశ్వాసంతో అనుసరించేవాడే శిష్యుడు. 'తనకు తెలిసినది శిష్యునికి విపరింపని వాడు గురువే కాదు' ('ఆచారోప్యనాచార్యో భవతి శ్రుతాత్పరి హరమాణః') అని అపస్తంబ మహర్షి సెలవిచ్చారు. అదే సమయంలో, గురువు సామర్థ్యంపై నమ్మకం లేనివాడు, గురువు సమర్థుడు కాడని చెప్పేవాడు ('అంతేవాసీ అనంతవాసీ భవతి'... 'గురావనైపుణమాపద్యమానః'..) శిష్యుడే కాడని కూడా వ్యాఖ్యానించారు. అలాంటి శిష్యుల తీరు...గురువు శక్తి సామర్థ్యాలను పరీక్షించడమే కానీ విద్య నేర్చుకోవడం కాదు' ఆ మహర్షి పేర్కొన్నారు. గురువుపట్ల పరిపూర్ణ విశ్వాసం ఉన్నవాడే శిష్యునిగా అర్హుడు,రాణిస్తాడు.. సమాజం ప్రగతి సాధించా లంటే గురువు అందించే జ్ఞానం, వివేకానికి శిష్యుడి శక్తియుక్తులు జత కలవాలి. వాటిని ఎందుకు? ఎలా ఉపయో గించాలనే అవగాహన, వివేకాన్ని అందించి, సరైన దారిలో నడపగలిగినవాడు గురువే. ప్రకృతిని అర్థం చేసుకుంటూ, కోరికలను అదుపులో పెట్టు కుంటూ, ఆధ్యాత్మిక, విజ్ఞానమార్గం పయనించాలంటే సమర్థ గురువు మార్గదర్శనం అనివార్యం. అందుకే గురువును భగవంతునిగా భావించి, ఆయన ముందు మోకరిల్లాలని మన సంప్రదాయం చెబుతోంది.

డా॥ ఆరవెల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

పర్యావరణ హితానికి హైడ్రోజన్ రైలు

భారతదేశంలో పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన మొట్టమొదటి హైడ్రోజన్ ఇంధన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై 17న అధికారికంగా ప్రారంభించారు. ఫలితంగా మన దేశపు హరిత రవాణా రంగంలో (గ్రీన్ మొబిలిటీ) సరికొత్త విప్లవానికి బీజం పడింది. హర్యానాలోని జింద్–సోనిపత్ మార్గంలో ఈ రైలు విజయవంతంగా తన తొలి ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆధునిక రైల్వే సాంకేతిక రంగాలలో భారతదేశ స్వయంసమృద్ధికి, సాంకేతిక సామర్థ్యానికి, స్వచ్ఛమైన ఇంధనానికి ఈ ప్రాజెక్ట్ ఒక నిదర్శనంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణతోపాటు సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఈ రైలు అందుబాటులోకి వచ్చింది. ఈ అద్భుతమైన సాంకేతికతను రైల్వే రంగంలో ప్రవేశపెట్టిన ప్రపంచంలోని కొన్ని ప్రత్యేక దేశాల సరసన ఇప్పుడు భారత్ సగర్వంగా నిలిచింది.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ హైడ్రోజన్ రైలులో ప్రయాణానికి కనీస టికెట్ ఖర్చు రూ. 5 మాత్రమే, ఆ పైన ప్రయాణం చేసే దూరాన్ని బట్టి గరిష్టంగా రూ. 25 వరకూ ఉంటుంది. దీని గరిష్ట వేగం 110 కిలోమీటర్లు. ఇప్పుడు ఈ రైలు పనితీరు, దీనికి ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకుందాం...

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ...

హైడ్రోజన్ రైళ్లు సాధారణ డీజిల్ రైళ్లకు భిన్నంగా, రైలు లోపలున్న ఫ్యూయల్ సెల్ వ్యవస్థ ద్వారా అవసరమైన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకుంటాయి. రైలులో అమర్చిన సిలిండర్లలో నిల్వ ఉన్న కంప్రెస్డ్ హైడ్రోజన్ వాయువు, వాతావరణంలోని ఆక్సిజన్‌తో 1200 కిలోవాట్ల సామర్థ్యంగల ఫ్యూయల్ సెల్‌లో రసాయనచర్య జరపడం ద్వారా విద్యుత్ తయారవుతుంది. ఈ విద్యుత్ సహాయంతో రైలు ఇంజన్లు నడుస్తాయి. ఈ ప్రక్రియలో ఎలాంటి హానికర వాయువులు విడుదల కావు. కేవలం నీటి ఆవిరి, కొంత వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా బయటకు వస్తాయి. దీనివల్ల ఎలాంటి పర్యావరణ కాలుష్యం ఉండదు.

ఈ బ్రాడ్–గేజ్ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. వీటిలో రెండు చివర్లా డ్రైవింగ్ పవర్ కార్లు (డిపిసి/టి), మధ్యలో 8 ప్యాసింజర్ కోచ్‌లు అమర్చారు. రైలులో 3200 హార్స్‌పవర్ (2400 కిలోవాట్) హైబ్రిడ్ ప్రొపల్షన్ సిస్టమ్ ఉంది. ఇది ప్రోటాన్ ఎక్స్చేంజ్ మెంబ్రేన్ ఫ్యూయల్ సెల్ (పిఇఎంఎఫ్‌సి), లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పి) బ్యాటరీ సాంకేతికతల కలయికతో పని చేస్తుంది. ప్రయాణికుల రక్షణ కోసం హైడ్రోజన్ లీకేజీలను, వేడిని, పొగ, మంటలను ముందుగానే గుర్తించగల అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఈ రైలులో ఏర్పాటు చేశారు.

ఈ ప్రయోగంతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అగ్ర దేశాల జాబితాలో భారతదేశం చేరింది. ఇప్పటివరకు ఈ సాంకేతికతను వాడుతున్న దేశాల వివరాలను గమనిస్తే.. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా హైడ్రోజన్ ప్యాసింజర్ రైళ్లను వాణిజ్యపరంగా నడిపిన దేశంగా జర్మనీ రికార్డు సృష్టించింది. నాన్–ఎలక్ట్రిఫైడ్ ప్రాంతీయ మార్గాలలో డీజిల్ రైళ్ల స్థానంలో వీటిని ప్రవేశపెట్టింది. ఆసియాలోనే మొదటి హైడ్రోజన్ అర్బన్ రైలును, హైడ్రోజన్ ట్రామ్‌లను చైనా అభివృద్ధి చేసింది. సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూ నగరం చుట్టుపక్కల ఈ నెట్‌వర్క్ విస్తరించి ఉంది. టొయోటా ఫ్యూయల్ సెల్స్, హిటాచీ బ్యాటరీ సిస్టమ్స్ సాయంతో జపాన్ 'హిబారి' పేరిట హైడ్రోజన్ రైలు పరిశోధనలను విజయవంతంగా చేపట్టింది. ప్యాసింజర్, ఫ్రీట్ (సరుకు రవాణా) రైళ్ల కోసం అమెరికా ఈ టెక్నాలజీని వాడుతోంది. పరీక్షల సమయంలో ఒకే ఒక్క హైడ్రోజన్ ట్యాంక్‌తో ఏకంగా 2803 కిలోమీటర్లు ప్రయాణించి ఈ రైలు గిన్నిస్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఇవి సేవలు అందిస్తున్నాయి. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో, కార్బన్ ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలలో ఈ హైడ్రోజన్ రైలు ప్రారంభం ఒక కీలకమైన మైలురాయి. విద్యుద్దీకరణ చేయడం కష్టమైన లేదా ఎక్కువ ఖర్చుతో కూడుకున్న రైల్వే మార్గాలలో హైడ్రోజన్ రైళ్లు పర్యావరణహితమైన ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. భారతీయ రైల్వే ఇప్పటికే పర్యావరణ పరిరక్షణ కోసం రైల్వే లైన్ల విద్యుద్దీకరణ, పునరుత్పాదక ఇంధన వాడకం వంటి ఎన్నో పనులను చేపట్టింది. ఇప్పుడు ప్రారంభమైన హైడ్రోజన్ రైలు ప్రాజెక్ట్ ఈ హరిత ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చింది.

"ఆటో డ్రైవర్ భరత్.. ధర్మవీరుడు"

యావత్ హిందూ యువతరానికి ప్రేరణనిస్తూ స్ఫూర్తిగా నిలిచాడు భాగ్యనగరానికి చెందిన భరత్.. ఓ ఆటో డ్రైవర్. తన ఆటో వెనుక నీ మతాన్ని మార్చుకోవడమనేది తండ్రిని మార్చుకోవడం లాంటిది అని, ఈ భూమ్మీద పుట్టిన ఎవరైనా హిందువే.. అని రాసుకున్నాడు. మీరు చదువుతున్న ఈ సంఘటన హైదరాబాదులోని అత్తాపూర్ ప్రాంతంలో జరిగింది. భరత్ అక్కడ తన ఆటోను నిలిపి వుంచిన సమయంలో స్థానికులైన కొందరు ముస్లిం యువకులు ఆ కొటేషన్లను గమనించి, భరత్‌ను ప్రశ్నించారు. "అలాంటి పదాలు వాడొద్దు.." అంటూ గొడవపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భరత్ వారికి సూటిగా "ఇది నా ఆటో.. నా ఇష్టం, మీకు వచ్చిన ఇబ్బంది ఏంటి? అని ఎదురు ప్రశ్న వేశాడు. ఫిర్యాదు చేసింది ముస్లింలు కావడంతో ఎన్ఐ భరత్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడుతూ హైదరాబాదులో రూల్స్ వేరేగా ఉంటాయని బెదిరిస్తూ వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నాడు. ఈ ఆడియో కూడా వైరల్ అవుతోంది. దీంతో చాలామంది జాతీయవాదులు ఆటోవాలా భరత్‌కి మద్దతుగా నిలిచారు. ఓ ఆటో డ్రైవర్ తన సొంత ఆటోపై తన మతాన్ని సమర్థిస్తూ రాసుకోవడం తప్పా? అంటూ హిందువులు గొంతు విప్పారు. మరోవైపు వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కూడా ఆటో డ్రైవర్‌కు మద్దతుగా రంగంలోకి దిగాయి. భరత్‌కి న్యాయం జరిగేలా చూస్తామని, మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఛాందస ముస్లింలను, పోలీసులను కూడా అడ్డుకుని నిలబడ్డ భరత్‌కి హిందూ సంఘాలు ఘనంగా ఆత్మీయ సత్కారం చేశాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్, వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావి నూతల శశిధర్ ఇంకా పలువురు నేతలు భరత్ సాహసాన్ని మెచ్చుకున్నారు.

దేశ రక్షణే అంతిమ లక్ష్యం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈ సంస్థ పిలుపుతో చేపట్టిన 'పంచ పరివర్తన్' ఉద్యమం నేటి కాలానికి ఎంతో ఆవశ్యకమని కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్పష్టం చేశారు. ఈ ఉద్యమంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని స్వామీజీ పిలుపునిచ్చారు. కేరళలోని పాలక్కాడ్ పట్టణం చంద్రనగర్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ సాంఘిక్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను సమాజ శ్రేయస్సు, ప్రజల మేలు కోసమే ఉపయోగించాలని సూచించారు. సాంకేతిక పురోగతిలో కీలకమైన సరళత, నిబద్ధత, వేగం వంటి లక్షణాలను సమాజ వికాసానికి ఉపయోగపడేలా మలచుకుని వినియోగించుకోవాలని సూచించారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునేందుకు సంస్కృత భాషను, భారతీయ సంస్కృతిని రక్షించి, పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్వామీజీ పిలుపునిచ్చారు. భక్తి, దేశభక్తి రెండూ ముఖ్యమైనవే అయినప్పటికీ.. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో దేశరక్షణ, సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మన కర్తవ్యానికి నాలుగు ముఖ్యమైన స్తంభాలు ఉన్నాయని, అవి "ధర్మాన్ని అధ్యయనం చేయడం, దాని అర్థాన్ని గ్రహించడం, ఆచరించడం, ప్రచారం చేయడం" అని తెలిపారు. అయితే, నేటి కాలంలో ధర్మాన్ని అర్థం చేసుకోవడం, ఆచరించడం కంటే.. ప్రచారం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని స్వామీజీ ఆందోళన వ్యక్తం చేశారు. కేరళను "పవిత్రమైన తంత్రభూమి"గా అభివర్ణించిన కంచి పీఠాధిపతి.. ఇతరుల కుట్రలకు ఈ పుణ్యభూమి బలి కాకుండా ప్రజలు కాపాడుకోవాలని అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కంచి శంకరాచార్యులకు పూర్ణకుంభంతో సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. 23 సంవత్సరాల క్రితం ఆయన గురువైన శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి కూడా వడక్కంతరలో జరిగిన ఆర్ఎస్ఎస్ సాంఘిక్ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ★

భారత్‌లో 'మే' విప్లవం?

నూరేళ్ల క్రితం రష్యాలో మే నెలలో వచ్చిన విప్లవం ప్రభావం మొత్తం ప్రపంచం మీద ప్రసరించింది. ఇండియాలో ఈ సంవత్సరంలో ఒక విప్లవం వచ్చింది. వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో విచిత్రమైన పరిణామాలు సంభవించాయి. కేరళలో కమ్యూనిస్టు పార్టీ తుడిచిపెట్టుకు పోయింది. దీనితో ఇండియా కమ్యూనిస్టు ముక్త భారత్‌గా మారింది. తమిళనాట ద్రవిడవాదం మట్టికరిచింది. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న డియంకె, ఒక ఫిలిం నటుడి చేతిలో ఓడిపోయింది. ఫలితంగా ద్రవిడవాదాన్ని ప్రజలు తిరస్కరించినట్లు అయింది. అస్సాంలో బిజెపి తన అధికారాన్ని నిలబెట్టుకుంది. తద్వారా కాంగ్రెస్ ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. మరొక ముఖ్యమైన పరిణామం బెంగాల్‌లో చోటు చేసుకుంది. ఇక్కడ మమతాబెనర్జీ పాలనను ప్రజలు తిరస్కరించారు. ఎన్నికల ఫలితాల తరువాత జరిగిన తిరుగుబాటు ఫలితంగా తృణమూల్ పార్టీ అంతరించిపోయింది. మమతాబెనర్జీ తండ్రి హిందూ, తల్లి ముస్లిం. ఈమె మొదట కాంగ్రెస్ పార్టీలో ఉంది. తరువాత సోనియాగాంధీతో విభేదించి స్వంత కుంపటి పెట్టుకుంది. అరాజకాన్నీ, వీధి పోరాటాలని ఆశ్రయించి, ఆనాటి కమ్యూనిష్టు పార్టీని నిర్మూలించింది. తరువాతి కాలంలో ఈమె పార్టీ కార్యకర్తలు అంతకన్నా ఎక్కువ హింసకు తెగబడ్డారు. హత్యలు, మానభంగాలు, నిత్యకృత్యా లుగా మారాయి. ఆమె తన నచ్చని ప్రతిపక్షాల కార్యకర్తలను చంపి చెట్లకు వ్రేలాడదీసింది.

బెంగాల్‌లో ముప్పైశాతం ముస్లింలు ఉన్నారు. వీరి ఓట్ల కోసం హిందువులను హింసించింది. శ్రీరామనవమి, దుర్గాపూజ వంటి ఉత్సవాలపై ఆంక్షలు విధించింది. బెంగాల్ భారతదేశంలో అంతర్భాగం కాదు అన్నట్లు ఆమె పరిపాలన సాగింది. శారదా స్కామ్, నారదా స్కామ్, టీచర్ల నియామకాలు, సందేశ్‌ఖాలీ మానభంగం కేసు వంటి వివిధ నేరాల్లో ఈమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ప్రధాన ముద్దాయి. అంతేకాదు ఈశాన్య రాష్ట్రాలను భారతదేశం నుంచి విడదీసే ప్రయత్నంలో ఈమె దేశద్రోహానికి సిద్ధపడింది. దీనినే చికెన్ నెక్ కుట్ర అంటారు. ఇన్ని దుర్మార్గాలు జరుగుతున్నా ఈమెను సహించడం ఆశ్చర్యకరమైన విషయం. అయితే మే నెలలో జరిగిన ఎన్నికలలో ఘోరపరాజయాన్ని చవి చూడవలసి వచ్చింది. తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయంలో కొన్ని వందల తెల్లచీరెలు దొరికాయి. ఈమె గెలిస్తే బిజెపి కార్యకర్తల్ని హత్యచేయించి వారి భార్యలను విధవలుగా చేసి, వారికి ఈ తెల్లచీరలు కానుకగా ఇవ్వాలని మమతా దీదీ ప్రణాళిక సిద్ధంచేసిన విషయం ఎందరికి తెలుసు? ఈ ఘోర కలి నుండి ఇప్పుడు బెంగాల్ విముక్తమైంది. భారత రాజకీయాల్లో ఇది చాలాపెద్ద పరిణామం. ఈ సంఘటనలన్నీ మే నెలలోనే జరిగాయి. కాబట్టి దీనిని 'భారత్‌లో మే విప్లవం' అని పిలువవచ్చు.

ఎన్నికలలో ఓడిపోయినంత మాత్రాన ఈ జాతీయ వ్యతిరేక శక్తులు ఊరుకుం టాయి అని అనుకోలేము. దేశ విభజనకు వీరు కొత్త కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ వంటి శత్రుదేశాలు మమతాదీదీ వంటివారిని కీలుబొమ్మలుగా ఉపయోగించుకుంటున్నాయి. నిజానికి ఇది భారతదేశానికి ఒక పరీక్షా కాలం. బెంగాల్ ప్రాంతాన్ని బిజెపి పాలిత రాష్ట్రంగా మార్చటంతో దేశభక్తులు విజయం సాధించారు. మమతా దీదీ వంటి వారి ఓటమిని చూసి సోనియాగాంధీ సానుభూతి ప్రకటించడం విచిత్రం. ఈ ఎన్నికల ప్రభావం భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా మారింది. కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి మరింత బలహీనపడింది. ఇప్పుడు రకరకాల మార్గాలలో దేశద్రోహానికి పాల్పడవచ్చు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి. అర్బన్ టెర్రరిస్టులను ఉపేక్షించకూడదు. సింధూ నదీజలాల వివాదం యుద్ధానికి దారితీయవచ్చు.



ప్రొ. ముదిగొండ శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు, 9059216905

కథ

ఆ కాకి ఎక్కడ?



పూజ ముగిసింది. పెద్దల పేరిట పెట్టిన బట్టల దొంతరల మీద నిప్పులు వడకుండా పిల్లలు, పెద్దలు అందరూ జల్లికంటిలో ఉన్న నిప్పుల మీద సాంబ్రాణి వేస్తూ పటాల చుట్టూ వరుసగా తిప్పి ఒకపక్కగా ఉంచారు. సాంబ్రాణి పొగ పటాల మీదికి వెళ్తుంటే సంతృప్తిగా నిట్టూర్చాడు రాజారావు. అందరూ తీర్థం తీసుకున్న తర్వాత వంటగదికేసి కదిలారు.

పూజలో ఉంచిన మూడు విస్తరాకుల నైవేద్యాల లోంచి ఒక విస్తరిని జాగ్రత్తగా తీసుకుని మిద్దె మెటికలు ఎక్కాడు రాజారావు. అతని భార్య రమాదేవి ఒక చిన్న చెంబుతోను, మరి ఒక పెద్ద గ్లాసుతోను మంచినీళ్లు పట్టుకుని అతన్ని అనుసరిం చింది.

మిద్దె మీదకు చేరుకున్నాక మంచినీళ్ల గ్లాసు పిట్టగోడ మీద ఉంచి చెంబులోని నీళ్లను పిట్టగోడ మధ్యలోని పెద్ద జాయింట్ మీద చల్లి శుద్ధి చేసి మూడుసార్లు శుద్ధంగా నీళ్లు చల్లింది. ఇక అప్పుడు రాజారావు తన చేతుల్లోని విస్తరిని భక్తితో శ్రద్ధగా ఆ శుద్ధి అయిన ప్రదేశంలో ఉంచాడు. రమాదేవి విస్తరి పక్కగా నీళ్ల గ్లాసును ఉంచింది.

ఇద్దరూ కాసేపు ఆకాశంకేసి చూస్తూ నిలబడ్డారు.

ఆకాశంలో ఎక్కడా కూడా కాకి జాడలేదు.

‘‘ఇంకా ఎక్కడ కాకులండీ? ఊరునిండా పెరిగిపోయిన సెల్ టవర్ల దెబ్బకు మొదట గువ్వలు కనపడకుండాపోయాయి. ఆ తరువాత క్రమంగా కాకులు మాయమైపోయాయి’’ అంది రమాదేవి.

‘‘నిజమే కానీ మొన్న ఉదయం వది గంటలప్పుడు ఇంటి ముందర పైన ఎక్కడో అరచి వెళ్లింది కదా?’’

‘‘అదే ఆశ్చర్యం..పండగలకు రెండు మూడు రోజులకు ముందు ఇంటి ముందో ఇంటిపైనో ఏదో ఒక కాకి అరచి వెళ్తుంది.. కానీ కళ్లకు కనపడదు. మన పూర్వికులు ఎవరైనా అలా వచ్చి హెచ్చరించి వెళ్తారేమో?’’ అంది ఆమె.

‘‘మనకెలా తెలుస్తుంది రమా? మన పిల్లలేమో నవ్వేస్తారు.. వాళ్ల పిల్లలేమో చాదస్తం, మూఢవిశ్వాసాలు అంటూ పరిహసిస్తారు’’ అన్నాడు రాజారావు కాస్త బాధగా.

‘‘మనవరకు ఉన్న తరం వేరండీ.. ఇప్పుడు మన పిల్లలలోనే అనేక ఆధునిక భావాలు వచ్చేసాయి. వాటిలో కొన్నైతే మంచివీ ఉన్నాయి.. పిల్లల్ని పక్కదోవ పట్టించగలిగినవి కూడా చాలా ఉన్నాయి. కానీ మనం దేన్నీ చక్కదిద్దలేని పరిస్థితులయితే వచ్చేశాయి’’ అంది రమాదేవి.. ఆమె స్వరంలో కూడా ఇంచుక బాధ.

తరువాత దాదాపు ఐదు నిమిషాలపాటు వారి మధ్య మౌనం రాజ్యమేలింది.

‘‘ఇక రావండీ.. అసలు ఊర్లో కాకులే లేవు కదా? నేను వెళ్తాను. నా కాళ్లు బొబ్బలెక్కేలా ఉన్నాయి’’ అంటూ చెంబు, గ్లాసు పట్టుకుని కిందకు నడిచింది రమాదేవి.

కాళ్లు మంటలెక్కుతున్నా ఆశగా ఆకాశంకేసి చూస్తూ చాలాసేపు నిలబడ్డాడు రాజారావు. తరువాత గాఢంగా నిట్టూర్చి అసంతృప్తిగా మిద్దెమెట్లు దిగాడు.

అతడు ఒక్క పొద్దు తీర్చుకుంటున్నప్పుడు, తరువాత హాల్లో కూర్చున్నప్పుడు, సాయంకాలం కాఫీ తాగుతున్నప్పుడు, లైబ్రరీ కేసి బయలుదేరుతున్నప్పుడు కూడా కాకి అరుపు ఏమైనా వినవస్తుందేమోనని చెవులు రిక్కించుకుని ఎదురు చూస్తూనే ఉన్నాడు.

అయితే ఆ శబ్దం మాత్రం వినిపించలేదు.

* * *

గ్రంథాలయం కేసి నడుస్తున్న రాజారావుకు తన చిన్నతనం నాటి సంఘటన ఒకటి గుర్తుకు వచ్చింది. ఆ ఘటనను చుట్టుకుంటూ అనేక జ్ఞాపకాలు...

అప్పట్లో పూర్వికులకు చెందిన ఒక పాత పెద్ద ఇంటిలో వన్నెండుమంది సభ్యులతో కాపురం ఉండేవారు. ఒకరోజు స్కూలుకు సెలవు అయినందున అన్నదమ్ములతో, అక్కచెల్లెళ్లతో కలిసి ఇంటి ముందర ఖాళీ స్థలంలో ఆడుకుంటున్నాడు రాజారావు. మధ్యలో దాహం వేయడంతో వంట గదికేసి పరుగు తీశాడు. దాహం తీర్చుకుని ఇటు తిరిగేసరికి ముక్కాలి టేకుపీటమీద కూర్చున్న తన తల్లి చాటతో బియ్యం చెరుగుతూ బియ్యంలో వస్తున్న వడ్ల గింజలను నేల మీద వేస్తుంటే రెండు గువ్వలు ఎలాంటి భయం లేకుండా వచ్చి ముక్కులతోటే గింజలు వలచుకుని బియ్యం తింటూ పొట్టు చక్కగా వదిలేస్తున్నాయి. ఆ దృశ్యం అతని

కోణం

టిఎస్ఏ కృష్ణమూర్తి

కళ్లకు అద్భుతంగా కనిపించడంతో కాసేపు ఆ గువ్వల చర్యలకు భంగం కలిగించకుండా అలా చూస్తుండిపోయాడు. అదే సమయంలో వెనక గుమ్మం గుండా అవతల నీళ్ల తొట్టి గోడమీద నిశ్శబ్దంగా కూర్చుని ఉన్న పెద్ద కాకి కనిపించింది.

"అమ్మా కాకి.. తరిమేస్తాను" అంటూ అటు వెళ్లబోయాడు.

"ఒరేయ్ ఒరేయ్ వద్దురా.. ఏమీ అనకు" అంటూ వారించింది తల్లి.

"ఎందుకమ్మా?" ప్రశ్నించాడు ఆశ్చర్యంగా.

"ఎందుకంటే మీ జేజో, మీ తాతో, ముత్తాతో ఆ రూపంలో వచ్చి కూర్చుని ఉండవచ్చు"

"ఎందుకమ్మా?"

"అవతల మర్నాడు ఉగాది పండగ కదరా? మనం ఎక్కడ మర్చిపోతామో అని జ్ఞాపకం చేయడానికి వచ్చి ఉంటారు"

తన జేజి మరణించడం లీలగా జ్ఞాపకం అతనికి. తాతయ్య మరణించడం మాత్రం బాగా గుర్తుంది. ముత్తాతను మాత్రం చూసి ఉండలేదు. ఎందుకంటే తను పుట్టకమునుపే ఆయన మరణించి ఉన్నాడు.

తాతను, జేజిని జ్ఞాపకం చేసుకుంటూ కాసేపు దిగులుగా కాకిని చూసిన తరువాత ఆడుకోవడానికి వెళ్లిపోయాడు. ఆ తరువాత కొన్ని పండగలకు ముందు పెరటివైపు గోడల మీద రెండు కాకులు నిశ్శబ్దంగా కూర్చుని కనిపించేవి. పెద్దల పండగ నాడు మాత్రం పూజ ముగిశాక ఒక ఆకుపళ్లెం తీసుకువెళ్లి మిద్దిమీద శుద్ధి చేసి పెట్టేవారు పెద్దవాళ్లు. ఒకటేమిటి ఆరేడు కాకులు గబగబా వచ్చేసి పళ్లెంలోని పదార్థాలలో తమకు నచ్చినవి పట్టుకుని వెళ్లిపోతే, ఒకటి రెండు కాకులు మాత్రం మనుషులు ఉన్నారని కూడా లెక్కచేయకుండా పళ్లెం పక్కన కూర్చుని సావధానంగా తిని నీళ్లు కూడా తాగి వెళ్లేవి.

రాజారావు పెరిగి పెద్దవాడయ్యాక అతని తండ్రి ఆ ఇంటిని అమ్మి ఆడపిల్లల పెళ్లిళ్లు, మగపిల్లల చదువు సంధ్యలు చూడాల్సి వచ్చింది. ఇక ఆపైన అవిభక్త కుటుంబం కాస్తా ఉద్యోగాలు, వ్యాపారాలతో ఎవరి కుటుంబం వారిదవుతూ వచ్చింది. తల్లిదండ్రులు మాత్రం పిల్లల అవసరాల నిమిత్తం ఒక్కొక్కరి వద్ద కొంతకాలం చొప్పున అలా అలా ఉంటూ వారి కాలం ముగించుకు వెళ్లిపోయారు. రాజారావు అన్నదమ్ముల కుటుంబాలలో దసరా, దీపావళి, సంక్రాంతి పండగల మీద ఉన్నంత శ్రద్ధ, పెద్దల పండుగ మీద అంతగా కనిపించదు. రాజారావు మాత్రం ఇతర పండగలు ఎలా జరిపినా పెద్దల పండగ మాత్రం అతి శ్రద్ధగా, భక్తిశ్రద్ధలతో జరిపిస్తాడు. తన తల్లిదండ్రుల నుండి లభించిన శ్రద్ధాసక్తులు అవి.

పెందలాడే ఇంటి ముందు కాకి అరిస్తే 'ఈరోజు ఎవరో బంధువులు దిగుతారు' అనేది అతని తల్లి. చాలాసార్లు అలా నిజంగానే బంధువులు దిగేవారు. చిన్నతనం నుండి అదంతా చాలా ఆసక్తికరంగా ఉండేది రాజారావుకు. ప్రస్తుతం పెద్దల పండుగలో పెద్దలకు బట్టలు పెట్టి సాంబ్రాణి వేసినా, సంక్రాంతికి తర్పణాలు వదిలినా మరణించిన తల్లిదండ్రుల, పూర్వికుల ఆశీస్సులు తప్పక లభిస్తాయి అనే విశ్వాసం అతని నరనరాల్లో జీర్ణించుకు పోయింది.

పెద్దల పండగ నాడు టెంకాయ కొట్టి హారతి ఇచ్చి సాంబ్రాణి వేసిన వెంటనే ఆ విస్తరిని తీసుకు వెళ్లి శుద్ధిచేసి పెట్టడం ఆలస్యం ఎక్కడెక్కడ నుంచో కొన్ని కాకులు వచ్చి ఆ ఆహారాన్ని తీసుకువెళ్లేవి.

అయితే గత ఐదారు సంవత్సరాలుగా కాకులు కనిపించకుండా పోయాయి. ఆహారాన్ని ముట్టడానికి కనీసం ఒక్క కాకైనా రావడంలేదు. ఆ విషయం మాత్రం రాజారావును విపరీతంగా బాధిస్తూ తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది.

ఉమ్మడి కుటుంబం కాస్తా విడిపోయి ఎవరి కుటుంబం వారిదైపోయాక ప్రైవేట్ కంపెనీ ఉద్యోగంలో వచ్చే జీతంతో కుటుంబ అవసరాలు, పిల్లల బరువు బాధ్యతలు ఎన్ని సమస్యలు సృష్టించినా ఉన్నంతలో పండగలు నిలపకుండా జరిపించేది రమాదేవి. పెద్దల పండగ మాత్రం కచ్చితంగా, ఘనంగా జరుగుతుంది రాజారావు ఇంట. ఎటోచ్చీ ఇటీవల కాలంలో నైవేద్యం స్వీకరించే కాకులు కరవవడం అంతులేని అసంతృప్తి.

* * *



లైబ్రరీ దగ్గర పడటంతో రాజారావు ఆలోచనలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

* * *

ప్రతి రెండవ ఆదివారం జ్ఞానోదయ ఉన్నత పాఠశాల సమావేశమందిరంలో వయోవృద్ధుల సమావేశం జరుగుతుంది. క్రమం తప్పకుండా హాజరవడం రాజారావుకు అతని మిత్రులకు అలవాటు.

ఐదు పది నిమిషాలు అటూ ఇటూగా రాజారావు, అతని మిత్రులం దరూ మీటింగ్ హాల్ చేరుకున్నారు.

ఆ మధ్యనే రాజధానిలో జరిగిన స్టేట్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మీటింగుకు వెళ్లి వచ్చిన అధ్యక్షులు గోపాలకృష్ణగారు అక్కడ జరిగిన కార్య క్రమాలు, సభాముఖంగా తీసుకున్న నిర్ణయాలు మొదలైన వాటిని వివరించారు.

కొందరు సభ్యులు ప్రభుత్వపరంగా తమకు రావాల్సిన కరవు భత్యం మొదలైన బకాయాలను గూర్చి ప్రశ్నించడం కార్యదర్శి ఇచ్చిన సమాధానాలతో అసంతృప్తి చెంది నిరాశపడడం జరిగాక, ఒక సభ్యుడు తన కుటుంబంలో తనపట్ల జరుగుతున్న అవమానాలను, హింసను కన్నీటితో వివరించాడు.

ఆ విషయంలో సభ్యులందరూ తీవ్రంగా స్పందించారు. అధ్యక్షులు, కార్యదర్శి కొందరు సభ్యులతో కలసి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఫలితం లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

సమావేశం ముగిశాక మిత్రులందరికీ వెలుపల చెట్ల కింద కుర్చీలు వేయించాడు దినేష్. అందరూ కూర్చుని నవ్వుకుంటూ మాట్లాడడం మొదలు పెట్టారు.

రాజారావు మాత్రం పరధ్యానంగా ఉండడం చూసి "రాజా ఏమిట్రా ఏదో కొంపలు మునిగినట్లు దీర్ఘాలోచనలో ఉన్నావు" అని ప్రశ్నించాడు కరుణాకర్.

"ఏం లేదు" అన్నాడు క్లుప్తంగా రాజారావు.

"వాని ఆలోచన ఎప్పుడూ ఒకటే.. పండగలకు కాకులు కనపడటం లేదని!" నవ్వుతూ అన్నాడు సుబ్బయ్య.

"నిజమేరా ఈ రేడియేషన్ ప్రభావం వల్ల గువ్వలు, కాకులు మొదలైన పక్షులు అంతరిస్తు న్నాయి. దాదాపు ప్రతి ఇంట్లో సెల్ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్ లు, చార్జర్లు ఉంటున్నాయి. ఇక ఇంటి నిండా, ఇంటి చుట్టూ రేడియేషన్. వీటికి కనెక్టవిటీగా పవర్ఫుల్ సెల్ టవర్లు సరేసరి. కొన్నేళ్ల క్రితం వరకు మా ఇంట్లో ఎక్కడ చూసినా గువ్వలు గూళ్లు కట్టేవి. కరెంట్ మీటర్ల మీద, ఫ్యాను పైకప్పుల్లో, పుస్తకాల షెల్ఫుల మీద గూళ్లు పెట్టేసేవి. పొదిగిన గుడ్ల లోంచి పిల్లలు రాకపోతే ఆ గుడ్లను కిందికి తోసేసేవి. అవి

పగిలి ఒకటే నీచువాసన. అంతేకాక ఆడ గువ్వల కోసం మగ గువ్వలు ఇల్లంతా తిరుగుతూ యుద్ధాలు చేసేవి. మాకెవరికీ భయపడేవి కూడా కాదా సమయంలో. గువ్వలను తరిమేస్తానంటే నా భార్య పిల్లలు ఒప్పుకునే వారు కాదు. క్రమంగా ఇంట్లోకి రావడం మానేశాయి. ఇప్పుడైతే కనపడటమే మానేశాయి. ఒకటి రెండు వడ్రంగి పిట్టలు మనీ ప్లాంట్‌లో గూడు కట్టాయి. కానీ వాటిని పిల్లి భయపెట్టి తరిమేసింది. తర్వాత అవి కనపడ లేదు. కొన్నాళ్లు కాకులు అరుదుగా అక్కడక్కడ కనబడేవి. ఇప్పుడు అవీ కనపడటం లేదు. ఊరి వెలుపల రహదారుల పక్కన ఇదివరకు వరుసగా చెట్లు ఉండేవి. నాగరికతను సూచిస్తూ రోడ్లు విస్తరిస్తు న్నాయి కానీ రోడ్ల ప్రక్కన చెట్టు చేమా కనిపించడం లేదు. ఇక ఎలా మనుగడ సాగిస్తాయి పక్షులు?" అన్నాడు శ్రీధర్.

"పక్షులు కనపడకుండా పోవడానికి రేడియేషన్ కాక మరో కారణం కూడా ఉంది" అన్నాడు తిరుపతిరావు.

"ఏమిటది?"

"గతంలో అయితే దీపావళికి మాత్రమే టపాకాయలు కాల్చేవారు మన ప్రాంతంలో. ఇటీవల కాలంలో పెళ్లిళ్లకు, అంత్యక్రియలకు, రాజకీయ నాయకుల ఆగమనాలకు, చివరకు కౌన్సిలర్ వార్డులోకి వచ్చినా కూడా విపరీతంగా పటా కాయలు కాలుస్తున్నారు. చెవులు చిల్లులు పడేలా విపరీతమైన శబ్దాలతో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట పటాకాయలు పేలుతూనే ఉంటాయి. ఆ పేలుళ్ల మోతలను, శబ్ద కాలుష్యాలను, మనుషులే భరించలేకపోతున్నారు.. ఇక వక్షులేమి భరిస్తాయి? అడవులనైనా వెతుక్కుంటుంటాయి లేదా అంతరించిపోతుంటాయి" అన్నాడు తిరుపతిరావు.

కఠోరమైన వాస్తవాలను వినడం వల్ల కాసేపు మౌనం రాజ్యమేలింది ఆలోచనాపరులైన మిత్రుల మధ్య.

"ఒరేయ్ రాజా! నీవు కాకిని చూడాలంటే మా ఊరికి తీసుకువెళతాను. నేనూ చాలా ఏండ్లైంది మా ఊరికి వెళ్లి. బంధువులంతా గోల పెడుతున్నారు. మా గ్రామం అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండడం వల్ల అక్కడ పక్షులకు, నీ కాకులకు కూడా కరవు లేదు. పైగా అక్కడ దీపావళికి కూడా పెద్దగా మతాబులు, పటాకాయలు కాల్చరు. ఎందుకంటే అక్కడ పేద కుటుంబాలే ఎక్కువ" అన్నాడు కృష్ణమూర్తి.

"పట్టుకు పోరా బాబూ.. వీడికి పుణ్యక్షేత్రంలో దేవుని చూడడం కన్నా కాకులను చూడాలనే కోరిక ఎక్కువైపోతున్నట్లుంది" అన్నాడు సుబ్బయ్య.

"ఏరా.. ఏమంటావు?" అని ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"తప్పకుండా ఓసారి వెళ్లొద్దాం లేరా" అన్నాడు రాజారావు.

* * *

పది రోజులు గడిచాక ఓ రోజు ఉదయం తన మోటార్ సైకిల్ మీద రాజారావు ఇంటికి వచ్చేసాడు కృష్ణమూర్తి. అప్పటికే స్నానం సంధ్య ముగించుకుని సిద్ధంగా ఉన్న రాజారావును తీసుకుని రైల్వే స్టేషన్ కేసి బయలుదేరాడు బయలు దేరాడు.

ఆరు గంటల ప్రయాణం తర్వాత ఘంటాపురం రైల్వే స్టేషన్లో రైలు దిగారు. చాలా చిన్న స్టేషన్ అయినా చాలా ఆధునికంగా కనిపిస్తోంది.. అభివృద్ధికి సంకేతంలా!

స్టేషన్ వెలుపలికి రాగానే నాలుగైదు ప్యాసింజర్ ఆటోలు కనిపించాయి.

'అబ్బో మా ప్రాంతానికి ఆటోలు కూడా వచ్చేశాయి"అంటూ ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.

కొండ కిందపల్లెకు పోవాలనగానే "వరుసలో మూడో ఆటో ఎక్కండి సార్ ఆ రూట్లో ఈరోజు అదొక్కటే పోతుంది" అంటూ చెప్పాడు ఒక ఆటో డ్రైవర్.

ఆ ఆటోలో అప్పటికే మరో ముగ్గురు ఉన్నారు! కృష్ణమూర్తి, రాజారావులు కూడా ఎక్కి సర్దుకుని కూర్చున్నారు. ఆటోలో కూర్చున్న వారి ముందర ఉన్న చెక్క మీద నలుగురిని, ఆటో వెనుక లగేజ్ పెట్టే డిక్కీ మీద మరో నలుగురిని కూర్చోబెట్టుకున్నాక పది నిమిషాలకు ఆటో బయలుదేరింది.

"అబ్బో కొత్త తారు రోడ్డు" అన్నాడు కృష్ణమూర్తి సంబరంగా.

"కొత్త రోడ్డు కాదయ్యా పాతదే.. చానా వానలు పడి పాడయింది. కీలు, కంకరతో అతుకులేస్తున్నారు" అన్నాడు పక్కన కూర్చున్నాయన.

ఊరు దగ్గర పడగానే మరింత ఆశ్చర్యంతో తలమునకలయిపోతూ అన్నాడు కృష్ణమూర్తి..

"ఇది మా ఊరేనా? "

"ఎందుకు సామీ అట్టా అంటా ఉండావు?" ఎదురుగా చెక్క మీద కూర్చున్న ముసలాయన నవ్వుతూ అడిగాడు.

"ఆరేడేండ్లకు ముందు నేను వచ్చినప్పుడు కూడా

అన్నీ గుడిసెలు, అడ్డ పిండ్లు, సున్నారం రాతిమిద్దెలే. పెద్దిండ్లు మూడో నాలుగో ఉన్నాయి అంతే. ఇదేమిటి ఇన్ని మిద్దెలు, మేడలు ఇంత కలర్‌ఫుల్‌గా టౌన్ లెక్కన కనిపిస్తున్నాయి! ఇంత డబ్బు ఎలా వస్తోంది?"

"కాలం మారింది కదా సామీ.. అదున్లో పదున్లవుతున్నాయి, ఒక పంటకు ధర రాకపోయినా ఇంకో పంటకు వస్తోంది, ఆడోళ్లందరూ నాటావుల నిడిసిపెట్టేసి సింధీ ఆవులను పట్టుకుని ఫ్యాక్టరీ పాలవ్యాన్లకు పాలు పోస్తున్నారు, మగవాళ్లంతా తెల్లార్తే అన్నం కట్టుకుని రైలెక్కిపోయి రాజపురంలో బేల్దారుపనో, చెక్క పనో, కూలిపనో సేసి నాలుగు దుడ్లు సంపాదించుకుని రేయి అన్నానికి ఇంటికొచ్చే త్తున్నారు. ఇంగా ఇంట్లో ఒకరో ఇద్దరో ముసలోళ్లుంటే ఆళ్లూ ఎవరికీ బరువు గాకుండా వారికి వారి వృద్ధాప్య పెన్షన్ వస్తుంది. ఇంతో అంతో నేలుంటే అడపాదడపా పంట డబ్బులు పడతాయి.. ఇంగా ఏం గావాలి సామీ? గుడిసిండ్లు మేడల య్యాయి, బుద్ధున్న బుడ్డోల్లు బాగా సదువుకునేసి కొలువులు సేసేస్తున్నారు, బుద్ధి లేనోళ్లు దళారి పనులు చేసుకుని బతికేస్తున్నారు" అంటూ వివరంగా చెప్పాడు ముసలాయన.

ఇంత సంభాషణ జరుగుతున్నా ఆటో నుంచి వెలుపలికి చూస్తూనే ఉన్నాడు రాజారావు కాకులేవైనా కనిపిస్తాయేమోనని. కానీ అతనికి నిరాశ ఎదురయింది. ఊర్లోకి ప్రవేశించాక పెద్ద పెద్ద మిద్దెలు మేడలు తప్ప కాకులు కాదు కదా కనీసం పచ్చని చెట్లయినా కనిపించలేదు.

* * *

మొదట కృష్ణమూర్తి మేనమామ ఇంటికి వెళ్లారు వారు. కృష్ణమూర్తి మేనమామ పండు ముదుసలి. మేనత్తకు కూడా బాగా వయసయిపోయింది. ఆశ్చర్యమేమంటే ఇద్దరూ బాగా ఆరోగ్యంగా ఉన్నారు.

పెద్దంతయింటినిండా జనాలు. ముసలాయన ఉమ్మడి కుటుంబాన్ని చెక్కు చెదరకుండా కాపాడు కొస్తున్నట్లుంది. కృష్ణమూర్తి వచ్చినందుకు

సంబరపడిపోయి రకరకాల వంటకాలు చేయడం మొదలుపెట్టారు.

"మీ వాళ్లు ప్రేమతో నిన్ను, వంటకాలతో నన్ను చంపేసేలా ఉన్నారే?" అన్నాడు రాజారావు. అతడు అన్నంత పని అయింది. భోజనాలకు కూర్చున్న ప్పుడు.. ఒక్కొక్కరు వచ్చి కొసరి కొసరి వడ్డిస్తుంటే. భోజనాలు ముగిశాక హాల్లోకి వచ్చి కూర్చున్నారో లేదో.... బాంబులు పేలుతున్నట్టుగా పెద్ద పెద్ద శబ్దాలు వినిపించ సాగాయి.

"ఏమిట్రా ఈ శబ్దాలు?" అని కంగారుగా ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"ఏం లేదు మామా! రాజధానికి వెళ్లిన సర్పంచ్ తిరిగి వచ్చినట్లు ఉన్నాడు. స్వాగతం చెబుతూ టపాకాయలు పేలుస్తున్నట్టున్నారు. ఇంతకూ, అంతకూ ఇదైతే ఎప్పుడూ ఉండే గోలేలే" అన్నాడు మేనల్లుడు గణేష్.

"అత్తా! పెద్దమ్మ ఇంటికి పోయెస్తాము. రాత్రికి అక్కడే పడుకుని ఉదయాన్నే వస్తాము" అని మేనత్తకు చెప్పేసి రాజారావుని తీసుకుని బయలుదేరాడు కృష్ణమూర్తి.

* * *

"అరేబిడ్డా ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి? తెల్లార్తో నీళ్లపోయ్యి మోరుస్తుంటే ఎవరో చుట్టాలు వస్తారులే అనుకున్నాను. నాబిడ్డే వచ్చేస్తాడని అనుకోలేదు" అంటూ కృష్ణమూర్తిని వాటేసుకుని కన్నీళ్ల పర్యంత్రం అయిపోయింది అతని పెద్దమ్మ లక్ష్మీదేవి.

రాజారావుకు తన తల్లి గుర్తుకు వచ్చింది. అప్పుడప్పుడు ఆమె అంటుం టుండిన..

"ఇంట్లో పొయ్యి వార్చినా, ఇంటిముంగిట కాకి అరచినా బంధుజనాలు దిగుతారురా" అన్న మాటలు గుర్తుకు వచ్చి అప్రయత్నంగా కళ్లు చెమ్మగిల్లాయి.

పెద్ద ఇంట్లో కృష్ణమూర్తి పెద్దమ్మ, కొడుకు కోడలు ముగ్గురే! పెద్దమ్మ ఇతర బిడ్డలు, మనవళ్లు, మనవరాళ్లు చెన్నై, బెంగళూరు, హైదరాబాదు,

"మీ వాళ్లు ప్రేమతో నిన్ను, వంటకాలతో నన్ను చంపేసేలా ఉన్నారే?" అన్నాడు రాజారావు. అతడు అన్నంత పని అయింది. భోజనాలకు కూర్చున్న ప్పుడు.. ఒక్కొక్కరు వచ్చి కొసరి కొసరి వడ్డిస్తుంటే. భోజనాలు ముగిశాక హాల్లోకి వచ్చి కూర్చున్నారో లేదో.... బాంబులు పేలుతున్నట్టుగా పెద్ద పెద్ద శబ్దాలు వినిపించ సాగాయి.

తిరుపతి, విశాఖ ఊర్లలో ఉద్యోగ వ్యాపారాల్లో కొనసాగుతున్నారు. ఈ ముగ్గురు అయితే ఉండూరును, పల్లె జీవితాన్ని వదులుకోలేక స్వగ్రామంలోనే ఉండిపోతున్నారు.

గ్రామమంతా బంధువులే కృష్ణమూర్తికి. సాయంకాలం వరకు ఆ ఇల్లు ఈ ఇల్లు తిప్పుతూనే ఉన్నాడు రాజారావును.

రాత్రి భోజనాలు చేస్తున్నప్పుడు పెద్దమ్మను అడిగాడు రాజారావు..

"అమ్మా! ఇక్కడ కూడా అందరూ క్యాన్ వాటరే తాగుతున్నట్లు ఉన్నారే?"

"అలవాటైపోయిందయ్యా ఏం చేయాలి? అందరితో పాటే మనమూ కదా?" అంది పెద్దమ్మ.

పెద్దమ్మ కుమారుడు గోపాలయ్య నవ్వాడు.

"అలవాటు కాలేదయ్య.. అలవాటు చేశారు.. ఊరి చెరువులో, కోనేట్లో, బావుల్లో, బోర్లలో చాలా మంచి నీళ్లు ఉన్నాయి. చెరువులో పశువులు కడుగుతారు, కోనేట్లో పిల్లోల్లు ఈతలు కొడతారు. ఆ నీళ్లు వదిలేస్తే బావుల్లో, బోర్లలో మంచి నీరు ఉంది. అయితే ఇప్పుడు ఎవరూ ఆ నీళ్లు తాగరు. రెండు రోజులు నీళ్ల కాను ఆటోలు రాకపోతే తల్లడిల్లి పోతారు తప్ప అమృతం లాంటి ఈ నీరు తాగరు. అంతే!" అన్నాడు.

భోజనాలు ముగిశాక "మీ గ్రామంలో గువ్వలు గానీ, కాకులు గాని కనపడడం లేదే!" అని ప్రశ్నించాడు రాజారావు.

"ఎక్కడ నాయనా! నిన్న మొన్నటిదాకా కొండల నిండా అడవులుండె. అడవులు తినేసిరి. కొండలను కరిగించేస్తా ఉండారు. అడవులున్నన్నాళ్లు అన్ని రకాల పక్షులు ఊర్లోనే ఉంటా ఉండె. ఇప్పుడేమీ అగపడవు" అంది పెద్దమ్మ.

గోపాలయ్య మళ్లీ నవ్వాడు.

"అప్పుడప్పుడు ఒకటో, రెండో గద్దలు ఆకాశంలో ఊరి మీద తిరుగుతూ కనిపిస్తాయయ్యా! అడపా దడపా, ఉడతలు కనిపిస్తాయి. తొండలు కూడా కనిపి స్తాయి. ఇండ్లలో అయితే బల్లులు ఉన్నాయి. వాటితో జాగ్రత్తగా ఉండాల్సిందే వంటల్లో పడకుండా. ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రతి ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యలో స్కూల్ కాంపౌండ్‌లో ఉన్న రావి చెట్టు మీద నుండి ఒక నెల రోజుల పాటు కోయిల కూత మాత్రం క్రమం తప్పకుండా వినిపిస్తుంది." అన్నాడు.

"ఇక్కడ కూడా ప్రకృతి, వాతావరణం క్రమం తప్పుతోందన్నమాట" అన్నాడు రాజారావు.

"వాస్తవం చెప్పావయ్యా! రాబోయే తరాల వాళ్లు ప్రాణవాయువు డబ్బాలను వీపునకు కట్టుకొని, రబ్బరు గొట్టాలను ముక్కులకు తగిలించుకొని బతకాల్సి వస్తుందేమో?" అన్నాడు గోపాలయ్య.

'ఈయన చాలా ఆలోచనపరుడు' అని మనసులో అనుకున్నాడు రాజారావు.

* * *

రాజారావు కృష్ణమూర్తి వాళ్ల ఊరు నుండి తిరిగి రాగానే "అక్కడయినా కాకులు కనిపించాయా" అంటూ ఆసక్తిగా ప్రశ్నించింది అతని శ్రీమతి.

లేదు అన్నట్లుగా తల అడ్డంగా ఆడించి విసుగ్గా సోఫాలో కూర్చున్నాడు రాజారావు బ్యాగు పక్కనపెట్టి. అతని విసుగును పట్టించుకోకుండా..

"మా పిన్నమ్మ వాళ్లు టూర్ పోయి వచ్చారు కదా? నిన్న ప్రసాదాలు పట్టుకు వచ్చారు. వారు త్రివేండ్రంలో దిగినప్పటినుండి తిరిగి బస్సు ఎక్కేంతవరకు వందల వందల కాకులను చూశారట" అంది రమాదేవి.. కాఫీ పట్టుకు రావడానికి వెళ్తూ.

'మనమూ త్రివేండ్రం వెళ్లాలి కాకి కోసం.. మరి ఎప్పుడు వెళతామో ఏమో తెలియదు. అంతవరకూ' అయినా అక్కడ కాకులు ఉంటాయా? ఉంటాయా?' అని మనసులో అనుకున్నాడు రాజారావు. ★

జీవిత సత్యాల పాఠం

'పరమపద' అంటే భగవంతుని నివాసమైన వైకుంఠం అని, 'సోపానం' అంటే మెట్టు అని అర్థం. అంటే మోక్షానికి దారితీసే మెట్టు అని దీని భావం. 'వైకుంఠపాళి' ఆట కూడా ఈ తత్వంతోనే ముడిపడి ఉంది. మంచి పనులు చేస్తే నిచ్చెనలు (పుణ్యం) ఎక్కుతామని, చెడు పనులు చేస్తే పాము (పాపం) మింగుతుందని ఇది సూచిస్తుంది. పూర్వం దీనిని 'పరమపద సోపాన పటం' అని పిలిచేవారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన రాత్రంతా నిద్రపోకుండా (జాగరణ) ఉండటం కోసం భక్తులు ఈ ఆటను ఆడేవారు. తద్వారా పుణ్యపాపాల గురించి ఆలోచిస్తూ దైవచింతనలో ఉండేవారు. ఈ ఆట కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, దీని వెనుక ఒక లోతైన తాత్విక సందేశం కూడా ఉంది.

ఈ పటంపై గడులు, నిచ్చెనలు, పాములు ఉంటాయి. దయ, వినయం, సత్యం వంటి మంచి లక్షణాలకు నిచ్చెనలు సంకేతం. వీటివల్ల మనిషి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటాడు. కోపం, లోభం, అసూయవంటి దుర్గుణాలకు పాములు సంకేతం. వీటివల్ల మనిషి కిందకు పడిపోతాడు. అన్ని అడ్డంకులను అధిగమించి, చివరి గడి వైకుంఠం చేరుకోవడమే ఈ ఆట ఉద్దేశ్యం. జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా, సన్మార్గంలో నడిస్తే మోక్షం లభిస్తుందని ఇది చెబుతుంది. పటంలో పాము తల ఒక గడిలో ఉంటే, దాని తోక చాలా కిందకు ఉంటుంది. అంటే చేసే చిన్న చెడు గుణం మనల్ని ఎంతో ఎత్తునుండి పాతాళానికి పడవేస్తుందని అర్థం.

'వైకుంఠపాళి' ఆట "జీవితంలో ఎన్ని పాపపు పాములు మింగినా, పుణ్యమనే నిచ్చెన సాయంతో దేవుడిని చేరుకోవచ్చు" అనే ఆశను కలిగిస్తుంది. పరమపద సోపాన పటంలో 'జనలోకం' ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఒక ఉన్నతమైన స్థితి.

హిందు పురాణాల ప్రకారం మొత్తం 14లోకాలు ఉన్నాయి. అందులో భూలోకానికి పైన ఉన్న ఊర్ధ్వ లోకాలలో ఇది ఐదవది. పురాణాల ప్రకారం, ఈ లోకంలో బ్రహ్మదేవుని పుత్రులైన గొప్ప మహర్షులు సనక సనందనాదులు నివసిస్తారు. ఇక్కడికి చేరుకున్న వారు పవిత్రమైన వారు, జ్ఞాన సంపన్నులు. ఆటలో కింది గడుల నుండి నిచ్చెనల సాయంతో పైకి వెళ్తున్నప్పుడు, సాధారణంగా 'తపస్సు' లేదా 'సత్యం' వంటి నిచ్చెనలు ఎక్కినప్పుడు మనం ఇటువంటి ఉన్నత లోకాలకు చేరుకుంటాం. పరమపద సోపాన పటంలో ప్రయాణం ఈ విధంగా సాగుతుంది. భూలోకం, భువర్లోకం, సువర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం.

జనలోకానికి చేరుకున్న సాధకుడు మళ్లీ వెనక్కి పడిపోయే అవకాశం తక్కువగా ఉంటుంది, కానీ అక్కడ కూడా అహంకారం వంటి 'పాము' కరిస్తే కిందకు వచ్చే ప్రమాదం ఉంటుందని ఈ ఆట మనకు హెచ్చరిస్తుంది. పరమపద సోపాన పటంలో 'తపోలోకం' ఆరవ ఊర్ధ్వ లోకం. ఇది జనలోకానికి పైన, సత్యలోకానికి క్రింద ఉంటుంది. ఆధ్యాత్మిక సాధనలో ఇది అత్యున్నతమైన, కఠినమైన దశను సూచిస్తుంది. 'తపస్సు' అనే పదం నుండి ఈ లోకానికి ఆ పేరు వచ్చింది. ఇక్కడ నివసించే వారు నిరంతరం తపస్సులో మునిగి ఉండటంవల్ల దీనిని 'తపోలోకం' అంటారు. పురాణాల ప్రకారం, ఇక్కడ 'వైరాజ' అనే దేవతలు, అత్యంత కఠినమైన తపస్సు చేసిన మహర్షులు నివసిస్తారు. ఈ గడికి చేరుకోవడం అంటే ఆటగాడు ఇంద్రియాలను జయించి, పరమాత్మపై సంపూర్ణ ఏకాగ్రతను సాధించాడని, వైకుంఠానికి చాలా దగ్గరగా ఉన్నాడని అర్థం. ఇది సత్యలోకానికి వెళ్లేముందు ఉండే చివరిమెట్టు వంటిది. సాధారణంగా 'వైరాగ్యం' లేదా 'నిశ్చల భక్తి' అనే నిచ్చెనల ద్వారా సాధకుడు ఈ లోకానికి చేరుకుంటాడు. తపోలోకంలో ఉన్నప్పుడు కూడా 'అహంకారం' అనే పాము కరిస్తే, మనిషి నేరుగా మళ్లీ కింది లోకాలకు పడిపోయే అవకాశం ఉంటుంది. అంటే ఎంతటి గొప్ప తపస్సు చేసినా గర్వం దరిచేరకూడదని ఈ ఆట హెచ్చరిస్తుంది. తపోలోకంలో వారు అగ్నితేజస్సుతో వెలిగిపోతుంటారని, వారికి మరణం అనేది బ్రహ్మదేవుని ప్రళయకాలంలో తప్ప సాధారణంగా ఉండదని చెబుతారు. ఇక 'సత్యలోకం', సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని నివాసం. ఇక్కడ అబద్ధం, మోసం, కోపం వంటి దుర్గుణాలకు తావుండదు. కేవలం సత్యం, ధర్మం మాత్రమే వర్ధిల్లుతాయి కాబట్టి దీనికి 'సత్యలోకం' అని పేరు వచ్చింది. ఈ లోకానికి చేరుకున్న ఆత్మలు తిరిగి జన్మించవు. పరమపద సోపానపటంలో దాదాపు ఆట చివరిదశకు చేరుకున్నారని దీని అర్థం. ఆఖరి గడి అయిన 'వైకుంఠం' చేరుకోవడానికి ముందు కొన్ని చిన్న చిన్న పాములని తప్పించుకుంటేనే మోక్షం లభిస్తుంది. బ్రాహ్మీ స్థితిని లేదా ఆత్మజ్ఞానాన్ని పొందినవారు ఈ లోకంలో ఉంటారు. పురాణాల ప్రకారం, ఈ లోకంలోని వారు బ్రహ్మ ప్రళయం వరకు అక్కడే ఉండి, ఆ తర్వాత నేరుగా పరమాత్మలో లీనమై పోతారు. సత్యలోకాన్ని కూడా దాటిన తర్వాతే మనకు లభించేది 'పరమపదం' లేదా 'వైకుంఠం'.

'కుంఠం' అంటే అడ్డంకి లేదా కొరత అని అర్థం. 'వైకుంఠం' అంటే ఏ అడ్డంకులు లేనిది, ఎప్పటికీ తరిగిపోని ఆనందం ఉండే చోటు అని అర్థం. ఇది శ్రీమహావిష్ణువు నివాసం. హిందూ ధర్మం ప్రకారం, ఇక్కడికి చేరుకున్న జీవుడు మళ్లీ ఈ జనన మరణ చక్రంలోకి తిరిగి రాడు. 100వ గడి (లేదా పటాన్ని బట్టి 132వ గడి) కి చేరుకోవడమే ఆట ముగింపు. ఇది ఆత్మ పరమాత్మలో లీనమవ్వడాన్ని సూచిస్తుంది.

వైకుంఠంగడికి వెళ్లే ముందు 'అహంకారం' అనే పెద్ద పాము ముఖం ఉంటుంది. సరైన సంఖ్య పాచికతో(డైస్) పడితేనే లోపలికి వెళ్తారు, లేదంటే పాము కరిచి మళ్లీ అథోలోకానికి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అంటే, దేవుడికి చేరువైనప్పుడు కూడా గర్వం ఉండకూడదని దీని అర్థం. పరమ పద సోపాన పటంలో కొన్ని ప్రత్యేక గడుల నుండి నేరుగా వైకుంఠానికి నిచ్చెనలు ఉంటాయి. నిజమైన భక్తి కలిగిన వారు తనను తాను భగవంతుడికి సమర్పించుకోవడంద్వారా మధ్యలో ఉండే లోకాలతో పనిలేకుండా నేరుగా వైకుంఠానికి చేరుకోవచ్చు.

పరమపద సోపానపటంలో లోభం, క్రోధం అనేవి మనిషిని ఆధ్యాత్మికంగా పతనంచేసే ప్రమాదకరమైన పాములు. వీటిని 'అరిషడ్వర్గాలు' అని పిలుస్తారు.'లోభం' అంటే అతి ఆశ. ఉన్నదానితో తృప్తి పడకుండా, ఇతరులది కూడా కావాలను కోవడం. పుణ్య కార్యాల ద్వారా మంచి గడులకు చేరుకున్నప్పుడు, ఈ 'లోభం' అనే పాము గడి మీద కాలు వేస్తే, అది నేరుగా అధోలోకాలకు పంపేస్తుంది. 'క్రోధం' అంటే కోపం. వివేకాన్ని నశింపజేసే భయంకరమైన శత్రువు. పటంలో ఈ పాము నోరు సాధారణంగా మధ్యస్థ గడులలో ఉంటుంది. ఇది కరిస్తే సాధించిన పురోగతి అంతా కోల్పోయి, మళ్లీ మొదటి దశలకు పడిపోతారు. "క్రోధాద్భవతి సమ్మోహః" – కోపం వల్ల మనిషికి ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణ పోతుంది. ఒక్కక్షణం కోపం జీవితకాలపు సాధనను బూడిదలో పోసిన పన్నీరు చేస్తుంది. అందుకే క్రోధం అనే పాముకు దూరంగా ఉండాలని ఈ ఆట హెచ్చరిస్తుంది.

'కామం' భౌతిక బంధాలలో చిక్కుకునేలా చేసి, పైకి వెళ్లకుండా అడ్డుకుంటుంది. కోరికలు అదుపులో లేకపోతే మనిషి శాంతిని కోల్పోయి, మళ్లీ మళ్లీ జన్మలెత్తాల్సి వస్తుంది. 'మోహం' అంటే అజ్ఞానం వల్ల కలిగే భ్రమ. ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో తెలియకపోవడం. నా ఇల్లు, నా సంపద, నా వారు అనే బంధనాల్లో చిక్కుకుపోవడం. మోహం అనే పాము కరిస్తే, మనిషి తాను చేరుకున్న జ్ఞానభూమి నుండి మళ్లీ మమకారపు లోయల్లోకి పడిపోతాడు. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని మర్చిపోతే పతనం తప్పదు. 'మదం' అంటే

అహంకారం. ఈ పాము సాధారణంగా ఉన్నత లోకాలలో (జనలోకం లేదా తపోలోకం వంటి చోట్ల) ఉంటుంది. ఎందుకంటే మనిషి ఎత్తుకు ఎదిగే కొద్దీ గర్వం వచ్చే అవకాశం ఎక్కువ. 'నేను' అనే అహంకారం కలిగితే దేవుడికి దూరం అవుతాం. 'మాత్సర్యం' అంటే అసూయ. ఇతరుల ఎదుగుదల చూసి ఓర్వలేకపోవడం. ఇది మనిషి మనస్సును కలుషితం చేసి, సాధనను నాశనం చేస్తుంది. ఇతరుల సుఖాన్ని చూసి ఆనందించలేకపోవడం వల్ల మనం సాధించిన పుణ్యం కూడా హరించుకుపోతుంది.

సద్గుణాల నిచ్చెనలు : వైకుంఠపాళి పటంలో సద్గుణాల నిచ్చెనలు మనల్ని కింద నుండి ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితికి తీసుకెళ్లే మార్గాలు. పాములు మనల్ని ఎలా పాతాళానికి లాగుతాయో, ఈ నిచ్చెనలు మనల్ని అంత వేగంగా దైవానికి చేరువచేస్తాయి. 'దయ' ప్రాథమికమైన నిచ్చెన. అన్ని జీవుల పట్ల జాలి, కరుణ కలిగి ఉండటం. దయ కలిగిన మనిషి సామాన్య గడుల నుండి పుణ్యలోకాలకు వేగంగా చేరుకుంటాడు. నిస్వార్థ సేవవల్ల ఆత్మశుద్ధి జరుగుతుందని ఇది సూచిస్తుంది. నిజాయతీగా ఉండటం అనేది ఈ ఆటలో అతిపెద్ద నిచ్చెనలలో ఒకటి. సత్యం అనే నిచ్చెన నేరుగా 'సత్యలోకం' వంటి ఉన్నత స్థితికి తీసుకెళ్తుంది. ఆడిన మాట తప్పకపోవడం, నిజాయతీగా బతకడం మోక్షానికి రాజమార్గమని దీని అర్థం. విద్య, జ్ఞానం వల్ల కలిగే అణకువ. వినయం అనే నిచ్చెన 'మదం' అనే పాముకు విరుగుడు. గర్వం లేకుండా ఉండేవారు దేవుడికి అత్యంత ప్రియమైన వారు. నిరంతర సాధనతో భగవంతునిపై మనస్సును నిలపడం నేరుగా 'తపోలోకం' గడికి చేరుస్తుంది. ఇంద్రియ నిగ్రహం కలిగిన వారికి ఉన్నత లోకాలు సులభంగా లభిస్తాయని దీని అర్థం.

పరమాత్మపై సంపూర్ణ విశ్వాసం: ఇది పటంలో చాలా పొడవైన నిచ్చెనగా ఉంటుంది. కొన్నిసార్లు ఈ నిచ్చెన కింది గడుల నుండి నేరుగా వైకుంఠం ముఖ ద్వారం వరకు తీసుకెళ్తుంది. పుణ్యకార్యాలు, మంచి గుణాలు ఆధ్యాత్మిక ప్రయాణాన్ని వేగవంతం చేస్తాయి. నిచ్చెన ఎక్కిన తర్వాత కూడా జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే పై గడులలో కూడా పాములు పొంచి ఉంటాయి. అంటే, ఉన్నతస్థితికి వెళ్లిన తర్వాత కూడా మన పవర్తన సరిగ్గా లేకపోతే పతనం తప్పదు. నిజ జీవితంలో ఆ నిచ్చెనలే మన సంస్కారం. వైకుంఠపాళి పటంలో ప్రతి గడికి ఒక ప్రత్యేకమైన సంస్కృత నామం ఉంటుంది. ఈ పేర్లు ఆ గడిలో ఉండే ఆత్మస్థితిని లేదా ఆ వ్యక్తి పొందే ఫలితాన్ని సూచిస్తాయి.

పాతకాలపు వైకుంఠపాళి పటాలను గమనిస్తే, ప్రతి గడిలోనూ ఒక చిన్నబొమ్మ, దానికింద ఈ సంస్కృత పేరు స్పష్టంగా రాసి ఉండేది. ఆట ఆడే పిల్లలు ఆ పేర్లను చదువుతూ, "సత్యం పలికితే పైకి వెళ్తాం, అబద్ధం చెబితే పాము మింగుతుంది" అని చిన్నప్పుడే నైతిక విలువలను నేర్చుకునేవారు. గడి 107 (మహర్లోకం) జ్ఞానులు ఉండే స్థితిని సూచిస్తుంది. ఇక్కడికి చేరిన వారు భౌతిక ప్రపంచాన్ని దాటినట్లు లెక్క. గడి 118 (తపోలోకం) అత్యున్నతమైన తపస్సు చేసే స్థితి. ఇక్కడ నిశ్చలమైన మనస్సు అవసరం. 17 నిచ్చెన (దాన ధర్మాలు), 26 నిచ్చెన (యజ్ఞం), 38నిచ్చెన (నిత్యపూజ) వంటి గడుల నుండి పైకి తీసుకెళ్తాయి. పాములు-53 (అనృతం-అబద్ధం), 74 (మౌఢ్యం - అజ్ఞానం) వంటి గడుల వద్ద పాము నోరు ఉండి కిందకు లాగుతుంది. చివరి పాము వైకుంఠం చేరడానికి కేవలం ఒక్క అడుగు లేదా కొన్ని అడుగుల దూరంలోనే పొంచి ఉంటుంది.

మనిషి అన్ని లోకాలను దాటి, గొప్ప జ్ఞానిగా మారి, మోక్షానికి చేరువైన సమయంలో కూడా "నేను మోక్షం పొందబోతున్నాను" అనే సూక్ష్మమైన అహంకారం లేదా 'మాయ' కలిగితే, అది అతడిని మళ్లీ పాతాళానికి పడవేస్తుంది. ఈ పాము నోరు వైకుంఠం ముఖద్వారం వద్ద ఉంటే, దాని తోక మాత్రం చాలా కిందకు..అంటే మళ్లీ జనన మరణ చక్రం (భూలోకం) వైపుకు ఉంటుంది. అంటే చివరి క్షణంలో తడబడితే మళ్లీ మొదటి నుండి ప్రయాణాన్ని మొదలుపెట్టాలని దీని అర్థం. ఈ ఆటలో చివరి గడికి వెళ్లాలంటే పాచికల మీద కచ్చితమైన సంఖ్య పడాలి. ఉదాహరణకు మీరు 130వ గడిలో ఉంటే, వైకుంఠం (132) చేరుకోవడానికి కచ్చితంగా 'రెండు' మాత్రమే పడాలి. ఎక్కువ పడితే మళ్లీ వెనక్కి లెక్క పెట్టాలి లేదా అక్కడే ఉండాలి. మోక్షం పొందడానికి కచ్చితమైన సాధన, క్రమశిక్షణ ఉండాలని దీని అంతరార్థం. అది కేవలం మన ప్రయత్నం (ఆట) వల్లే కాకుండా, భగవంతుని అనుగ్రహంవల్ల కూడా సాధ్యమవుతుందని భక్తులు నమ్ముతారు.

"నిచ్చెనల సాయంతో పైకి వెళ్లడం ఎంత కష్టమో, ఒక్క పాము కాటుతో కిందకు పడిపోవడం



వైకుంఠపాళి పటంలో క్రింది భాగంలో ఉండే గడులను అధోలోకాలు అంటారు. భూమికి దిగువన ఏడు లోకాలు ఉంటాయి. ఇవి సాధారణంగా మనిషిలోని తామస గుణాలను, భోగ లాలసను, పతనాన్ని సూచిస్తాయి. పటంలో చాలా ఎత్తులో ఉన్నప్పుడు 'అహంకారం' అనే పెద్ద పాము కరిస్తే, అది నేరుగా ఈ అధోలోకాలకు తీసుకువస్తుంది. ఇక్కడ పడటం అంటే సర్వం కోల్పోవడం కాదు..

అంత సులభం" – ఇదే వైకుంఠపాళి మనకు నేర్పే అతిపెద్ద జీవిత సత్యం. సాధారణంగా పటంలోని 72 గడులు, మానవ శరీరంలోని 72,000 నాడులకు సంకేతం. అంటే ఈ ఆట మన దేహంలో జరిగే ప్రాణశక్తి ప్రయాణాన్ని సూచిస్తుంది. మరికొన్ని పటాల్లో 132 గడులు ఉంటాయి, ఇవి మనిషి దాటాల్సిన వివిధ జన్మల సంఖ్యకు సంకేతం. 'అధర్మం' అనే పాము నోరు ఉన్నత లోకంలో ఉండి, తోక 'నరకం' లేదా 'పాతాళం'లో ఉంటుంది. అంటే ఎంతటి స్థితిలో ఉన్నా ధర్మం తప్పితే పతనం తప్పదని అర్థం. వైకుంఠానికి వెళ్లే ముందు ఉండే పాము పేరు 'మాయ'. ఈ చివరి పామును దాటడమే అత్యంత కష్టమైన పని. ఆటలో వేసే పాచికలు మన ప్రారబ్ధ కర్మను సూచిస్తాయి. కోరుకున్న సంఖ్య పడకపోవడం అంటే, జీవితంలో అన్ని మన చేతుల్లో ఉండవని, కొన్ని గత జన్మ కర్మల మీద ఆధారపడి ఉంటాయని దీని అర్థం. ఆటను కొనసాగించడం అంటే, కర్మను అనుభవి స్తూనే ముందుకు సాగాలని అర్థం.

పటాన్ని గమనిస్తే, అది మూడు భాగాలుగా ఉంటుంది. భౌతిక వాంఛలు, నరకప్రాయమైన బాధలు(అధోలోకాలు). మానవ ప్రయత్నం, పుణ్య కార్యాలు(మధ్య లోకాలు.) దైవ చింతన, మోక్ష మార్గం (ఊర్ధ్వ లోకాలు). నిచ్చెనలు ఎప్పుడూ పాముల కంటే తక్కువ సంఖ్యలో ఉంటాయి. పతనం అవ్వడానికి వంద దారులు ఉంటాయి, కానీ పైకి వెళ్లడానికి కొన్ని మార్గాలు (సత్యం, ధర్మం, దయ) మాత్రమే ఉంటాయి. ఆ కొద్ది మార్గాలను పట్టుకున్నవాడే విజేత అవుతాడు.

వైకుంఠానికి వెళ్లే ప్రయాణంలో ఎనిమిది మంది దేవతలు ఆత్మను పరీక్షిస్తూ, యోగ్యులైన వారిని మాత్రమే పైలోకాలకు అనుమతిస్తారు. అష్టదిక్పాలక గడులు మనకు ఏం చెబుతాయంటే – "దేవుడిని చేరుకోవాలంటే కేవలం భక్తి ఉంటే సరిపోదు, ప్రకృతిని, ప్రకృతిశక్తులను (దిక్పాలకులను) గౌరవిస్తూ, నీతితో బ్రతకాలి." ఈ గడులు దాటిన తర్వాతే సాధారణంగా 'మహర్లోకం' వంటి ఉన్నత లోకాలు ప్రారంభమవుతాయి.

వైకుంఠపాళి పటంలో క్రింది భాగంలో ఉండే గడులను అధోలోకాలు అంటారు. భూమికి దిగువన ఏడు లోకాలు ఉంటాయి. ఇవి సాధారణంగా మనిషిలోని తామస గుణాలు, భోగలాలసను, పతనాన్ని సూచిస్తాయి. పటంలో చాలా ఎత్తులో ఉన్నప్పుడు 'అహంకారం' అనే పెద్ద పాము కరిస్తే, అది నేరుగా ఈ అధోలోకాలకు తీసుకువస్తుంది. ఇక్కడ పడటం అంటే సర్వం కోల్పోవడం కాదు, మళ్లీ అక్కడి నుండి '[ప్రాయశ్చిత్తం' లేదా 'సత్కర్మ' అనే చిన్న చిన్న నిచ్చెనల ద్వారా పైకి రావచ్చు.

ఆధ్యాత్మిక సందేశం

వైకుంఠపాళి ఆట మనకు భయాన్ని మాత్రమే కాదు, ఆశను కూడా కల్పిస్తుంది. నరక గతులలో పడినా కూడా ప్రయాణం ముగిసిపోదు. నరక గతుల వద్ద కొన్ని చిన్న నిచ్చెనలు ఉంటాయి. ఇవి '[ప్రాయశ్చిత్తం' లేదా 'పశ్చాత్తాపం'ను సూచిస్తాయి. అంటే చేసిన తప్పును తెలుసుకుని క్షమాపణ కోరితే, మళ్లీ ప్రయాణం మొదలవుతుంది. నరక బాధలు అనుభవించిన తర్వాత, ఆత్మ మళ్లీ 'మానవ జన్మ' అనే గడికి చేరుకుంటుంది. అక్కడ నుండి మళ్లీ వైకుంఠం వైపు ప్రయాణించే అవకాశం లభిస్తుంది. "నరకం అనేది ఒక శాశ్వతమైన స్థానం కాదు, అది ఒక స్థితి. మనం చేసే చెడు ఆలోచనలే మనల్ని నరకానికి తీసుకెళ్తాయి."

వైకుంఠపాళి ఆటలో మనం ఉపయోగించే 'కాయిన్స్' కేవలం ఆట వస్తువులు మాత్రమే కాదు. ఆధ్యాత్మికంగా ఇవి 'జీవాత్మ'కు సంకేతం. గతంలో చింతపిక్కలు, గవ్వలు లేదా చిన్న రాళ్లను నాణేలుగా వాడేవారు. సహజ సిద్ధమైన వస్తువులను వాడటం వల్ల ప్రకృతితో అనుసంధానం ఏర్పడుతుందని భావించేవారు.

ప్రతి ఆటగాడి 'కాయిన్' ఒక జీవాత్మను సూచిస్తుంది. బోర్డు మీద ఎన్ని కాయిన్స్ ఉన్నా, ప్రతి కాయిన్ తన సొంత పాచికల సంఖ్య ప్రకారమే కదలాలి. జీవిత ప్రయాణంలో ఎవరి కర్మను వారే అనుభవించాలి. ఒక కాయిన్ నిచ్చెన ఎక్కితే ఇంకో కాయిన్ ఎక్కలేదు. ఎవరి ప్రయాణం వారిదే "ఏకైక జాయతే జంతుః ఏకైక ఏవ నశ్యతి" – పుట్టుక, చావు రెండూ ఒంటరివే అని దీని అర్థం. ఒక గడిలో రెండు కాయిన్స్ కలిసినప్పుడు లేదా ఒకరి కాయిన్ మరొకరిని దాటి వెళ్లినప్పుడు జీవితంలో తారసపడే ఋణానుబంధాలను సూచిస్తాయి. కొందరు తోడుగా వస్తారు, కొందరు దాటి వెళ్లిపోతారు. కానీ మన లక్ష్యం మాత్రం చివరి గడి (వైకుంఠం) చేరడమే. కాయిన్ పాము నోట్లో పడి కిందకు వచ్చినప్పుడు దానిని తీసి పక్కన పారేయం. మళ్లీ అక్కడి నుండే ప్రయాణం మొదలు పెడతాం. ఇది ఆత్మ ఓర్పును సూచిస్తుంది. జీవితంలో ఎన్ని పతనాలు ఎదురైనా, మళ్లీ ప్రయత్నిస్తూనే ఉండాలని, పతనం అనేది ప్రయాణం ముగింపు కాదని ఈ కాయిన్ మనకు నేర్పుతుంది. కాయిన్ అనేది జడ పదార్థం. దానిని కదిలించేది మనం వేసే పాచికలు (కర్మ/దైవ సంకల్పం). దైవం నిర్ణయించిన దారిలో ఆత్మ సాగిపోతుంటుంది. కానీ ఆ ప్రయాణంలో వచ్చే సద్గుణాల నిచ్చెనలను అందుకోవాలంటే ఆ కాయిన్ సరైన దిశలో (ధర్మ మార్గంలో) ఉండాలి.

తిరిగొప్పుల వి.ఎల్.ఎన్ మూర్తి
8008577834

హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళాజట్టు క్రికెట్ లార్డ్స్ స్టేడియంలో అద్భుతమే చేసింది. విశ్వమహిళా క్రికెట్ చరిత్రలో మరే జట్టూ సాధించలేని రికార్డును నమోదు చేసింది. ఆతిథ్య ఇంగ్లండ్‌ను చిత్తు చేయడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించింది.

'లార్డ్స్ స్టేడియం'లో

భారత క్రికెట్ మహిళాద్భుతం!

క్రికెట్ అనగానే లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానామే ఆ క్రీడాభిమానులకు ముందుగా గుర్తుకు రావడం సహజం. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన క్రికెట్ మైదానం లార్డ్స్ లేని క్రికెట్‌ను ఊహించడం అసాధ్యం. బ్యాటు, బంతి చేతపట్టిన ప్రతిఒక్కరూ తమ జీవితకాలంలో ఒక్కసారైనా లార్డ్స్ మైదానంలో అడుగుపెడితే జీవితం ధన్యమైనట్లుగా భావిస్తారు. ఇక..లార్డ్స్ వేదికగా ఓ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఆడే అవకాశం వస్తే, అందులో విజేతగా నిలిస్తే అది బ్రహ్మానందమే అవుతుంది. అలాంటి మహదానందాన్ని, అపురూప ఘనతను హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టు తమ తొలి ప్రయత్నంలోనే సాధించి మహిళా టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఓ ప్రత్యేకతను సొంతం చేసుకోగలిగింది.

లార్డ్స్ వేదికగా మొట్టమొదటి మహిళాటెస్టు...

ప్రసిద్ధిగాంచిన పేరుపొందిన లార్డ్స్ స్టేడియంలో గత శతాబ్దకాలంగా పురుషుల టెస్ట్ సమరం జరుగుతూనే ఉంది. అయితే మహిళల మొట్టమొదటి టెస్టు మ్యాచ్ నిర్వహణ కోసం 2026 జులై వరకూ వేచిచూడాల్సి వచ్చింది. ఆతిథ్య ఇంగ్లండ్-భారత్ జట్ల ఏకైక, లార్డ్స్ వేదికగా మొట్టమొదటి మహిళా టెన్టు మ్యాచ్‌ను జులై 10 నుంచి నాలుగురోజులపాటు నిర్వహించారు.

అయితే స్థాన బలంతో చెలరేగిపోతుందని భావించిన ఇంగ్లండ్‌ను భారతజట్టు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో అద్భుతంగా రాణించడం ద్వారా ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆట నాలుగురోజులూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఓపెనర్ స్మృతి మంధన 83, కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 58, దీప్తి శర్మ 57 పరుగులతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్ లో 285 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు.

క్రాంతి, యాస్తికా...ఇద్దరూ ఇద్దరే....

భారతయువ పేస్ బౌలర్ క్రాంతి గౌడ 37 పరుగులకే 5 వికెట్లు పడగొట్టడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలిపోయింది. దీంతో 115 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన భారత్ విశ్వరూపం ప్రదర్శించింది. తొలిఇన్నింగ్స్‌లో భారత్ జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచిన స్మృతి మంధన రెండో ఇన్నింగ్స్‌లోనూ 70 పరుగులతో భారత్‌కు శుభారంభాన్ని ఇచ్చింది. యువ బ్యాటర్ యాస్తికా భాటియా 113, రిచా ఘోష్ 50 పరుగులు చేయడంతో భారత్ 7 వికెట్లకు 341 పరుగుల భారీ స్కోరుతో కలుపుకొని...ఇంగ్లండ్ ఎదుట 457 పరుగుల భారీ విజయ లక్ష్యాన్ని ఉంచింది. భారత పేసర్ల జోడీ క్రాంతి, సయాలీ చెరో రెండు వికెట్లు, స్పిన్ జోడీ స్నేహారాణా 4, దీప్తిశర్మ 2 వికెట్లు పడగొట్టడంతో ఇంగ్లండ్ 186 పరుగులకే పరిమితమయ్యింది. భారత్ 270 పరుగుల అతిపెద్ద విజయంతో చరిత్ర సృష్టించగలిగింది.

ఇది భారత మహిళా జట్టు సాధించిన అరుదైన, అసాధారణ విజయాలలో ఒకటిగా నిలిచిపోతుంది. గతేడాది భారత్ వేదికగా జరిగిన మహిళా వన్డే ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలిచిన హర్మన్ సేన ..సాంప్రదాయ టెస్టు క్రికెట్లో సైతం..అదీ లార్డ్స్ వేదికగా సాధించిన ఈ విజయం గొప్పఘనతగా, కలకాలం గుర్తుంచుకోదగిన విజయంగా మిగిలిపోతుంది.

నాడు గంగూలీ.. నేడు హర్మన్ ప్రీత్

...ప్రపంచవ్యాప్తంగా ఎన్ని మైదానాలలో విజయాలు సాధించినా.. క్రికెట్ మక్కా లార్డ్స్ వేదికగా సాధించిన గెలుపునే ప్రత్యేకమైన గెలుపుగా క్రికెటర్లు, అభిమానులు పరిగణిస్తారు. 2002 జులై 13న లార్డ్స్ వేదికగా సౌరవ్‌గంగూలీ నాయకత్వంలోని భారతజట్టు విజేతగా నిలిస్తే...24 సంవత్సరాల తరువాత అదే రోజున హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళాజట్టు ఇంగ్లండ్‌పై చరిత్రాత్మక విజయం సాధించడం విశేషం.

లార్డ్స్ వేదికగా కపిల్ దేవ్ (1986), మహేంద్రసింగ్ ధోనీ (2014), విరాట్ కొహ్లీ (2021) సారథులుగా భారత పురుషుల టెస్ట్ జట్లు విజయాలు సాధిస్తే..హర్మన్ నాయకత్వంలోని మహిళాజట్టు 2026 సిరీస్ టెస్టు విజేతగా నిలిచింది.

2023 తరువాత కాలంలో భారత మహిళా టెస్టు జట్టు ఆడిన ఐదుటెస్టుల్లో ఇది నాలుగో విజయం. ఇంగ్లండ్ ప్రత్యర్థిగా ప్రస్తుత లార్డ్స్ టెస్టు వరకూ మొత్తం 16టెస్టులు ఆడిన భారత్ 4 విజయాలు, ఇంగ్లండ్ ఒకే ఒక్క గెలుపు రికార్డుతో ఉన్నాయి. మరో 11 టెస్టుమ్యాచ్‌లు ఫలితం తేలకుండానే డ్రాల పద్దులో చేరాయి.లార్డ్స్ స్టేడియం సాంప్రదాయం ప్రకారం 5 వికెట్లు పడగొట్టిన బౌలర్లు, శతకాలు బాదిన బ్యాటర్ల పేర్లను అక్కడి డ్రెస్సింగ్ రూమ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'హానర్ బోర్డు'పై లిఖించడం ద్వారా గౌరవిస్తారు. ఈ గౌరవాన్ని లార్డ్స్ టెస్టులో అసాధారణంగా రాణించడం ద్వారా క్రాంతి గౌడ, యాస్తికా భాటియా నంపాదించారు. క్రికెట్టు, లార్డ్స్ మైదానం ఉన్నంతకాలం రికార్డులతో బోర్డు కెక్కిన పేర్లు నిలిచిపోతాయి.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

భాగ్యనగర్ : జాగృతి వారపత్రికను నియమితంగా అందజేస్తున్న 11మంది పోస్ట్‌మెన్‌లకు జూలై 19న భాగ్యనగర్, కర్మన్‌ఘాట్‌లోని చంద్రాగార్డెన్స్‌లో జాగృతి పత్రిక యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ మాట్లాడుతూ తపాలావారి సేవలను ప్రశంసించారు.

9 దశాబ్దాల సేవికా సమితి సేవలు

భాగ్యనగర్ : 90 సంవత్సరాల క్రితం ప్రారంభమైన సంస్థ నిరంతరాయంగా కొనసాగడం సాధారణ విషయం కాదని, ఏ లక్ష్యంతో ప్రారంభించారో అదే పద్ధతిలో నడవటం గొప్ప విషయమంటూ సమితి సేవికలకు శుభాకాంక్షలు తెలుపుతూ వ్యక్తి నిర్మాణంతోనే రాష్ట్ర నిర్మాణం సాధ్యమని ముఖ్య అతిథి కొంపల్లి డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్య అన్నారు. రాష్ట్ర సేవికాసమితికి 90 సం.లు, వందనీయ మౌసీజీ జన్మదినం సందర్భంగా జూలై 19న భాగ్యనగర్‌లోని స్పైసిహబ్‌లో దిక్సూచి కార్యక్రమం జరిగింది. దృఢ సంకల్పం, సేవాభావం ఉంటే ఏ పనైనా సాధ్యమని మౌసీజీ జీవితంద్వారా మనకు అర్థమవుతుందని గౌరవఅతిథి ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వాసవి అన్నారు.

సమితి ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ మాట్లాడుతూ, ఒక వ్యక్తి 90 సం.లు పూర్తి చేసుకున్నాడంటే సంపూర్ణజీవితంగా భావిస్తాం. అదే ఒక సంస్థకు 90సం.లు నిండినది అంటే ఎన్నో ఆటుపోట్లు,విజయాలు, మైలురాళ్లు సాధించడంగా చూస్తారు. ఈ అనుభవాల కారణంగానే నేడు సమాజానికి సరైన దారిచూపించే సంస్థ సమితి అని, అందుకే ఈ కార్యక్రమానికి "దిక్సూచి" అని నామకరణం చేశామని చెప్పారు. కార్యక్రమ ప్రారంభంలో సేవికలు ప్రదర్శించిన మౌసీజీ నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ విభాగ్ కార్యవాహిక విజయలక్ష్మి, భాగ్యనగర్ విభాగ్ కార్యవాహిక ప్రసన్నలక్ష్మి తదితరులతోపాటు సమితి కార్యకర్తలు 600 మంది పాల్గొన్నారు.

భాగ్యనగర్ : పోలీసు నియామకపరీక్షలకు హాజరు కావాలనుకొనే యువతులకు సేవాభారతి, వైదేహి సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో భాగ్యనగర్, నాదర్‌గుల్‌లోని వైదేహికౌశలంలో 45 రోజుల శిక్షణాశిబిరం జూలై 19న మొదలైంది. తెలంగాణనుండి దరఖాస్తుచేసుకొన్న 312 మందిలో ఎంపిక చేసిన 54 మంది యువతులు శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సేవాప్రముఖ్ శివశంకర్ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా వందేమాతరం ఫౌండేషన్ సంస్థాపకులు రవీందర్, ముఖ్యఅతిథిగా పోలీస్ కళాశాల ప్రిన్సిపల్ మధుకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతే నవ భవిష్యత్తు

"యువత చేతుల్లోనే భారత భవిష్యత్తు ఉంది. విలువలతో కూడిన యువ నాయకత్వమే వికసిత భారతానికి పునాది."

ఒక కుటుంబం అభివృద్ధి చెందాలంటే బాధ్యత గల కుటుంబ పెద్ద అవసరం. ఒక విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఉత్తమ గురువు మార్గదర్శకత్వం అవసరం. అలాగే ఒక దేశం ప్రపంచవేదికపై అగ్రస్థానంలో నిలవాలంటే దూర దృష్టి, నిజాయతీ, సేవాభావం, త్యాగం కలిగిన నాయకత్వం అత్యంత అవసరం. నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో వేగంగా ఎదుగుతున్న భారత దేశానికి, అటువంటి నాయకత్వాన్ని అందించాల్సిన బాధ్యత భారత యువతపై ఉంది. అందుకే నయాభారత్‌కు ఇప్పుడు యువ నాయకత్వం అవసరంగా మారింది. లేదంటే దేశం... లెఫ్ట్ లిబరల్, వేర్పాటు వాద, విచ్ఛిన్నకరశక్తుల (కాక్రోచ్ జనతా పార్టీ) మాయలో పడే అవకాశం ఉంది

నాయకత్వం అనేది పదవితో వచ్చే గౌరవం కాదు; ప్రజల విశ్వాసంతో వచ్చే బాధ్యత. నాయకుడు తన కోసం కాకుండా సమాజం కోసం జీవించాలి. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారమార్గాలను అన్వేషించాలి. కష్టకాలంలో ధైర్యంగా నిలబడి, విజయ సమయాల్లో కీర్తిని అందరితో పంచుకుని, అపజయాల సమయంలో బాధ్యతను తన భుజాలపై వేసుకునే వ్యక్తే నిజమైన నాయకుడు.

నేటి యువత విజ్ఞానం, సాంకేతికత, ఆవిష్కరణలలో ప్రపంచంతో పోటీపడుతోంది. కానీ నాయకత్వానికి విద్య ఒక్కటే సరిపోదు. దానికి విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, మానవత్వం, నిస్వార్థ సేవా దృక్పథం కూడా తోడవ్వాలి. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకొని, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపగల దూరదృష్టి యువ నాయకుడికి ఉండాలి.

నిజమైన నాయకుడు ప్రజలను ఆకట్టుకునే మాటలు చెప్పడు. వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పనులు చేస్తాడు. ఇతరులను విమర్శించడం కాదు, వారిలోని ప్రతిభను వెలికితీయడం అతని లక్ష్యం. ప్రతి మనిషిలో దాగి ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి, అతడిని సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దడమే నాయకత్వ గొప్పతనం. తన చుట్టూ మరెందరో నాయకులను తయారు చేయగలిగినవాడే గొప్ప నాయకుడు. నాయకత్వం వయస్సుతో రాదు లక్ష్యంతో, త్యాగంతో, కర్తవ్యనిష్ఠతో వస్తుంది.

యువ నాయకత్వం అంటే కేవలం రాజకీయాల్లోకి రావడం కాదు. కుటుంబంలో బాధ్యతగా ఉండటం, పాఠశాలలో ఆదర్శంగా నిలవడం, కళాశాలలో సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం, గ్రామాభివృద్ధికి కృషిచేయడం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడడం అవినీతి వ్యతిరేక పోరాటం, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం. ఇవన్నీ నాయకత్వానికి తొలిమెట్లు. చిన్నచిన్న బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించే వారే భవిష్యత్తులో దేశాన్ని నడిపించే నాయకులుగా ఎదుగుతారు.

నాయకుడి గొప్పతనం అతని అనుచరుల సంఖ్యలో ఉండదు; అతను ప్రజల్లో నింపిన ఆత్మవిశ్వాసంలో ఉంటుంది. "మీరు చేయగలరు" అనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించగలిగితేనే అతడు నిజమైన నాయకుడు. తనతో పనిచేసేవారిని కేవలం సహాయకులుగా కాకుండా సహచరులుగా భావించడం, వారి అభిప్రాయాలను గౌరవించడం, విజయంలో వారిని భాగస్వాములను చేయడం నాయకత్వానికి నిజమైన నిర్వచనం.

నయా భారత్ నిర్మాణంకోసం యువతలో జాతీయ చైతన్యం మరింత పెరగాలి. కులం, భాష, ప్రాంతం వంటి సంకుచిత భావాలను దాటి భారతీయతను ముందుంచే దృక్పథం అవసరం. దేశ సమగ్రత, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, సామాజిక న్యాయం పట్ల అంకితభావం కలిగిన యువతే రేపటి భారతానికి దిక్సూచిగా నిలుస్తుంది.

స్వామి వివేకానంద యువతను దేశ పునర్నిర్మాణ శక్తిగా చూశారు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులు తమ యవ్వనాన్ని దేశానికి అంకితం చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. వారి జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది.

ఈ రోజు భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. విజ్ఞానం, అంతరిక్షం, రక్షణ, డిజిటల్ సాంకేతికత, స్టార్టప్‌లు, మౌలిక వసతులు వంటి ప్రతి రంగంలో దేశం అభివృద్ధి చెందుతోంది.

తాజాగా అంతరిక్ష రంగంలో స్టార్టప్

స్కైరూట్ విక్రమ్-1 ప్రయోగంను విజయవంతంగా నిర్వహించింది కూడా యువతే. సగటున 28 ఏళ్ల వయస్సున్న ఆవిష్కర్తలది. ఈ ఘనతను సాధించిన యువ శాస్త్రవేత్తల బృందాన్ని ప్రధాని కొనియాడారు. ఈ ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయని, భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకొని తిరిగి వచ్చాడని, ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కై రూట్ అద్భుతమైన ఘనతను సాధించిందని దేశ యువతను మోదీ అభినందించారు.

ఈ ప్రగతిని శాశ్వత విజయంగా మార్చేది విలువలతో కూడిన యువ నాయకత్వమే. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రహదారులు కాదు; ఉత్తమ పౌరులను తయారు చేయడం కూడా.

"దేశం నాకు ఏమిచ్చింది?" అనేకంటే, "దేశానికి నేను ఏమి చేయగలను?" అని. ఆ ఆలోచన వచ్చిన క్షణమే నాయకత్వం ప్రారంభమవుతుంది. సేవను జీవన విధానంగా, నిజాయతీని ఆయుధంగా, దేశభక్తిని ప్రేరణగా, కర్తవ్యాన్ని లక్ష్యంగా చేసుకున్న యువత చేతుల్లోనే నయా భారత్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

నేటి భారత్‌కు కావలసింది అధికారాన్ని ఆశించే నాయకులు కాదు; బాధ్యతను మోసే నాయకులు. ప్రజలను కులాలవారీగా, ప్రాంతాలవారీగా, భాషలవారీగా, విడదీసే నాయకులు కాదు. అందరిని ఏకతాటిపై కలిపే నాయకులు. స్వార్థాన్ని పెంచే నాయకులు కాదు. సేవాభావాన్ని పెంపొందించే నాయకులు. అలాంటి యువ నాయకత్వమే వికసిత భారతానికి పునాది వేస్తుంది.

రండి... మనలోని నాయకుణ్ణి మనమే మేల్కొల్పుదాం. బాధ్యతాయుతమైన యువ నాయకత్వంతో నయా భారత్ నిర్మాణంలో భాగస్వాములమవుదాం. అదే మన తరానికి చరిత్ర అప్పగించిన గొప్ప కర్తవ్యం.

- వనకల్ల వీరప్ప

దధీచి మహర్షి త్యాగం

కథ

దధీచి మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. జ్ఞానం, ధర్మనిష్ఠ, లోకహితం పట్ల అంకితభావానికి ఆయన ప్రసిద్ధి చెందాడు. తన జీవితం కేవలం తన కోసం కాదని, అవసరమైతే లోకక్షేమం కోసం అర్పించాలనే భావంతో జీవించేవాడు.

ఆ కాలంలో వృత్రాసురుడు అనే రాక్షసుడు దేవతలను తీవ్రంగా బాధించే వాడు. అతని శక్తి ముందు దేవతలు నిలబడలేకపోయారు. ఎన్నిసార్లు యుద్ధం చేసినా అతన్ని ఓడించడం సాధ్యం కాలేదు. చివరికి దేవతలంతా బ్రహ్మదేవుని ఆశ్రయించి, వృత్రాసురుడి నుంచి తమను రక్షించే మార్గం చెప్పమని కోరారు.

అప్పుడు బ్రహ్మదేవుడు,"వృత్రాసురుడిని సాధారణ ఆయుధాలతో సంహరించలేరు. దధీచి మహర్షి ఎముకలతో తయారుచేసిన వజ్రాయుధంతో మాత్రమే అతన్ని ఓడించగలరు" అని చెప్పాడు.

ఆ మాట విన్న దేవతలు దధీచి మహర్షి ఆశ్రమానికి బయలుదేరారు. కానీ ఆయనను కలిసి విషయం చెప్పడానికి సంకోచించారు. ఒక మహర్షిని తన ప్రాణాలను త్యాగం చేయమని అడగడం వారికి చాలా కష్టంగా అనిపించింది. వారి ముఖాల్లో కనిపిస్తున్న ఆందోళనను దధీచి మహర్షి గమనించాడు.

"మీరు ఏదో ముఖ్యమైన పనిమీద వచ్చినట్టున్నారు. సంకోచించకుండా విషయం చెప్పండి" అన్నాడు.

దేవతలు వినయంగా వృత్రాసురుడి వల్ల కలుగుతున్న కష్టాలను వివరించారు. చివరగా, "లోకక్షేమం కోసం మీ ఎముకలతో వజ్రాయుధాన్ని తయారు చేయాల్సి ఉంది" అని బాధతో చెప్పారు.

వారి మాటలు విన్న దధీచి మహర్షి ప్రశాంతంగా చిరునవ్వు చిందించాడు.

"ఈ శరీరం ఎప్పటికైనా నశించేదే. అలాంటి శరీరం లోకానికి ఉపయోగపడి, అనేకమందిని రక్షించగలిగితే అంతకంటే గొప్ప ప్రయోజనం ఏముంటుంది?" అన్నాడు.

దధీచి మహర్షి ధ్యానంలో కూర్చొని స్వచ్ఛందంగా ప్రాణ త్యాగం చేశాడు.

దేవతలు ఆయన ఎముకలతో వజ్రాయుధాన్ని తయారుచేశారు. ఇంద్రుడు ఆ వజ్రాయుధాన్ని ఉపయోగించి వృత్రాసురుడిని సంహరించాడు. అతని బాధల నుంచి దేవతలు, లోకాలు విముక్తి పొందాయి. మళ్లీ శాంతి నెలకొంది.

దధీచి మహర్షి భౌతికంగా లేకపోయినా, ఆయన చేసిన త్యాగం మాత్రం శాశ్వతంగా నిలిచిపోయింది. తన కోసం జీవించడం సహజం. కానీ ఇతరుల మేలుకోసం తనను తాను అర్పించడం మహాత్ముల లక్షణం. ★

మంచిమాట

సహనాన్ని కోల్పోయినవారు సత్యాన్ని, అహింసను కూడా కోల్పోతారు.

మెదడుకు మేత

ఎవరూ దొంగిలించలేని సంపద, పంచేకొద్దీ పెరిగే సంపద.. ఏమిటది?

జవాబు : జ్ఞానం

పద్యం

తడ వోర్వక, యొడ లోర్వక
కడు వేగం బడిచి పడిన గార్యం బగునే
తడ వోర్చిన, నొడ లోర్చిన
జెడిపోయిన కార్యమెల్ల జేకుఱు సుమతీ

భావం : ఏ పని అయినా తొందరపడి చేస్తే తప్పులు జరిగే అవకాశం ఎక్కువ. ఆలస్యాన్ని, శరీర శ్రమను ఓర్చి ప్రయత్నిస్తే ఇతర కారణాల వల్ల చెడిపోయిన పనులు కూడా పూర్తవుతాయి.

శ్లోకం

'దరిద్రాయ కృతం దానం
శూన్య లింగస్య పూజనమ్
అనాథ ప్రేత సంస్కారమ్
అశ్వమేథ సమం విదుః

భావం : పేదలకు దానం చేయడం, శిథిల ఆలయంలోని శివలింగాన్ని పూజించడం, దిక్కులేని శవానికి అంతిమ సంస్కారం.. అశ్వమేథ యాగాలతో సమానం.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

చెట్టు	జ్ఞానం
పుస్తకం	నీడ
గడియారం	ప్రయాణం
పడవ	సమయం
అద్దం	ప్రతిబింబం

జవాబులు : చెట్టు-నీడ; పుస్తకం-జ్ఞానం; గడియారం-సమయం; పడవ-ప్రయాణం; అద్దం-ప్రతిబింబం

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

డాక్టర్ కుమారస్వామి తంగరాజ్



జన్యు, పరమాణు శాస్త్రాల పేరు చెబితే గుర్తొచ్చే ప్రఖ్యాత శాస్త్రవేత్తల్లో డాక్టర్ కుమారస్వామి తంగరాజ్ ఒకరు. 1963 జూన్ 2న జన్మించారు. ఆదిమానవుల వలసలపై ఆయన చేసిన పరిశోధనలు ఎన్నో కీలక విషయాలను వెలుగులోకి తెచ్చాయి. అరుదైన వ్యాధులకు జన్యు చికిత్సలను రూపొందించడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారాయన. తన విశిష్ట సేవలకుగాను తంగరాజ్ ఇటీవలే పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

జనరల్ నాలెడ్జ్

1. అతి ఎత్తైన పర్వత శిఖరం ఏది?
2. భారతదేశ జాతీయ పుష్పం ఏది?
3. పంచతంత్ర కథలను రచించినవారు ఎవరు?

జవాబులు: 1. ఎవరెస్ట్; 2. తామర; 3. విష్ణుశర్మ

భక్తాగ్రేసరులు

జీజాబాయి

హిందూస్వరాజ్య తిలకం ఛత్రపతి శివాజీ మాతృమూర్తి జీజాబాయి. గొప్ప ఆధ్యాత్మికవేత్త. ఆమెకు హిందూ ధర్మం పట్ల ఎంతో ప్రేమ. హిందూ సమాజంపై మొగలుల దౌర్జన్యాలు, విధ్వంసాలు, గోహత్యల పట్ల కలతచెందేది. వారి దాష్టీకాలను అంతమొందించే పుత్రుడిని ప్రసాదించాలని శివనేరి దుర్గంలోని శివుడిని అర్చించింది. శివప్రసాదంగా కుమారుడిని పొంది, అతనిని ధీరోదాత్తుడిగా తీర్చిదిద్దింది. పుత్రుడిని అధికార వ్యామోహితుడిగా కాకుండా సామాన్యుల కష్టసుఖాలను ఎరిగి, వారి పురోగతిని పాటుపడే రాజుగా చూడాలన్న కలను సాకారం చేసుకొంది. మహిళలంతా మాతృసమానులని, వారిని అత్యంత గౌరవంగా చూడాలన్న ఆమె మాటలను తనయుడు శివాజీ అక్షరాల పాటించాడు. స్వతంత్ర మరాఠా రాజ్యం స్థాపించాలన్న శివాజీ సంకల్పానికి తల్లి జీజాబాయి ప్రేరణే కారణంగా చరిత్ర చెబుతోంది. ★

వారఫలాలు

27 జూలై- 02 ఆగస్ట్ 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

స్థిరాస్తి వివాదాల కొంత ఇబ్బంది కలిగిస్తాయి. ఇంటి నిర్మాణయత్నాలు ముందుకు సాగవు. ఆరోగ్యపరంగా చికాకులు. చేపట్టిన కార్య క్రమాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపారులు సామాన్య లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, వైద్యరంగం వారికి విదేశీ పర్యటనలు వాయిదా. 27,28 తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక ధనలాభం. ఆదిత్య హృదయం పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆత్మీయులతో, స్నేహితులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. సమాజంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. వ్యాపారులు గతం కంటే పుంజుకుంటారు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత ఉత్సాహం. 29,30 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్య సూచనలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. చాకచక్యంగా కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు కొన్ని వసూలయ్యే అవకాశం. వ్యాపారస్తులు గతం కంటే మెరుగైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు రావచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులకు అంచనాలు నిజమవుతాయి. 31, ఆగస్ట్1 తేదీల్లో వృథాఖర్చులు. శారీరక రుగ్మతలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

దేవాలయాలు సందర్శిస్తారు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. చిన్ననాటి విషయాలు గుర్తుకు తెచ్చుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు లాభాలు గడిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితల ఆశలు ఫలిస్తాయి. 31, ఆగస్ట్1 తేదీల్లో వ్యయప్రయాసలు. బంధువు లతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

గతంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. ఆదాయానికి లోటులేని పరిస్థితి. స్థిరాస్తి కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. విద్యార్థులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు సన్మానాలు, అవార్డులు రావచ్చు. ఆగస్ట్ 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

విద్యార్థులు విదేశీ విద్యావకాశాలు పొందుతారు. వాహనసౌఖ్యం. కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులు కొత్త భాగస్వాములను చేర్చుకుంటారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, పరిశోధకులు, క్రీడాకారుల యత్నాలు సఫలం. 27,28 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

సంగీత,సాహిత్య విషయాలపై ఆసక్తి చూపుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల నిరీక్షణ ఫలిస్తుంది. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు హోదాలు పెరిగే అవకాశం. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు పూర్వవైభవం కలిగే సూచనలు. 29,30 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. అంగారక స్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురుకావచ్చు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. వ్యాపారస్తులు స్వల్ప లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు పనిఒత్తిడులు పెరుగుతాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు శ్రమాధిక్యం. 31, ఆగస్ట్1తేదీల్లో వాహనయోగం. నూతన ఉద్యోగాలు. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

విద్యార్థులు నూతన అవకాశాలు సాధిస్తారు. నమాజంలో వలుకుబడి పెరుగుతుంది. వ్యాపారస్తులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. ఉద్యోగులకు విధుల్లో సమస్యలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు సమయానికి పెట్టుబడులు అందుకుంటారు. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. ఆగస్ట్ 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. నృసింహస్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రముఖులు నుంచి కీలక సందేశం అందుతుంది. ఆస్తి వివాదాలు తీరి ఊపిరిపీల్చు కుంటారు. విద్యార్థుల యత్నాలలో పురోగతి. ఇంటి నిర్మాణంలో ఆటంకాలు అధిగమిస్తారు. వ్యాపార లావాదేవీలు గతం కంటే పుంజుకుంటాయి. ఉద్యోగులకు అనుకూల మార్పులు. రాజకీయవేత్తలు పదవులు పొందుతారు. రచయితలు, క్రీడాకారులకు అనూహ్య అవకాశాలు. తేదీలలో 28,29 అనుకోని ఖర్చులు. అనారోగ్యం. దేవీస్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

వాహనాలు, గృహం కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులు లాభాలబాటలో పయనిస్తారు. ఉద్యోగస్తులకు కొన్ని సమస్యలు తీరతాయి. కళాకారులు అంచనాలు ఫలించి ఉత్సాహంగా గడుపుతారు. వైద్యులు, పారిశ్రామికవేత్తలకు శుభ వార్తలు. 31, ఆగస్ట్ 1 తేదీల్లో ఆరోగ్యపరమైన ఇబ్బందులు. దూరప్రయాణాలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆదాయ, వ్యయాలలో సమతూకం పాటిస్తారు. కొన్ని కార్యక్రమాలు చిక్కులు అధిగమించి పూర్తి చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వాహన యోగం. వ్యాపారస్తులకు ఆశించిన లాభాలు దక్కవచ్చు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం రావచ్చు. రాజకీయవేత్తలకు కొన్ని హోదాలు దక్కుతాయి. రచయితలు, క్రీడాకారుల ఆశలు ఫలిస్తాయి. 30,31 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. కుటుంబంలో చికాకులు. గణేశాష్టకం పఠించండి.

పదరసం-574

ఆధారాలు

అడ్డం

1. అమ్మ, జనని (2)
2. ఆకాశం (3)
4. ఆషాఢంలో తెలంగాణలో పెద్ద పండుగ (3)
8. బంధుత్వం (4)
10. పండితుడు (2)
11. పొడవైన కర్ర..అటు నుంచి (2)
13. ధ్వజం, పతాకం (3)
15. ఆంగ్ల మొదటి నెల (4)
17. బాజా బజంత్రీలు (2)
18. తాతకు ఇది నేర్పడమా? (2)
19. నూరు లక్షలు (2)
20. విరాళం (2)
21. తండ్రి, పిత (3)
23. గాలింపు, వెదకు (2)
24. కొంగ (2)
25. రాశి, పోగు (2)
26. కథకు వికృతి (2)
28. బంగారం (3)
30. అంగుళి (2)
31. మర్యాద వాచకం..తారుమారు (2)
33. వస్త్రం, కొలను (3)
33. గోక్షీరమే...(4)
36. శ్రీహరి ఐదవ అవతారం (3)

నిలువు

1. మాయలేడిగా వచ్చిన రాక్షసుడు (4)
3. భత్యమే... (2)
5. కాళోజీ ప్రసిద్ధ కవితా సంపుటి (4)
6. కొబ్బరి (4)
7. పర్వతరాజ పుత్రిక (3)
9. రంధ్రం, చిల్లి (2)
12. ఘనత, గొప్పతనం (3)
14. ఇంద్రుడి ఉద్యానవనం (3)
16. కవిత్రయంలో ప్రథముడు (3)
17. శ్రేష్ఠుడు, దిట్ట (2)
19. అభిలాష, వాంఛ (3)
20. సుమారు, రమారమి (3)
21. దివి, స్వర్గం (2)
22. మాద్రి పెద్ద కుమారుడు (4)
24. రాబడిలో పాఠశాల (2)
27. వృక్షం (3)
29. పద్నాలుగో నక్షత్రం.. తిరగబడింది (2)
30. ఒక ప్రసిద్ధ శతక కర్త (3)
32. తలగుడ్డ ..తిరగబడింది (2)
34. చిహ్నం, జ్ఞాపకం (2)



పదరసం - 573 సమాధానాలు

1 దే	వ	2 ద	త్తం		3 వే	గు		4 ఆ	ది
వ		ర్శ		5 రే	డు		6 సా	కు	
యా		7 నం	ది		8 కో	9 డ	లు		10 ఈ
11 ని	12 జం			13 వే	లు	పు		14 చీ	మ
	కు		15 ఎ	ద		మి		16 క	ని
		17 శి		18 వి	ధి		19 త	టి	
20 అ		21 ఖ	రీ	దు		22 ము	ప్పు		23 క
24 సం	25 బ	రం		డు		ను		26 వా	పి
27 గ	డి		28 చే		29 కా	పు	30 రం		సే
తం		31 మే	ను		శి		32 క	మే	న

కొన్నేళ్ల క్రితం వరకు జాతీయ సినీ అవార్డుల ప్రకటన వెలువడిన వెంటనే తెలుగు సినిమా రంగంలో నిరాశ నిస్పృహలు చోటు చేసుకునేవి. ఎంత గొప్ప సినిమాలు తెరకెక్కించినా... తమకు గుర్తింపు రావడం లేదని వాపోయేవారు. ఒకటో రెండో అవార్డులైనా ఇవ్వలేదని బాధపడేవారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా తెలుగు సినిమాను ఎంపిక చేయకుండా నిరాకరించిన సందర్భాలు కొన్ని లేకపోలేదు. అయితే ఇప్పుడు రోజులు మారాయి.

రెండేళ్ల క్రితం జాతీయ సినీ అవార్డులలో తెలుగు సినిమాలకు ఏకంగా 11 కేటగిరిల్లో అవార్డులు వచ్చాయి. అందులో ఆరు 'ఆర్.ఆర్.ఆర్.' సినిమాకు లభించాయి. తొలిసారి ఉత్తమ నటుడు అవార్డును తెలుగు సినిమా 'పుష్ప'కు గానూ అల్లు అర్జున్ అందుకున్నాడు. నిజానికి దానికి కొన్నేళ్ల ముందు నుంచే తెలుగు సినిమాలకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం పెరిగింది. శంకరాభరణం, మేఘసందేశం వంటి చిత్రాలు కొన్ని గతంలో జాతీయ స్థాయిలో తమ సత్తాను చాటినా... పూర్తి స్థాయిలో తెలుగు సినిమా అత్యధిక అవార్డులు అందుకున్నది మాత్రం 69వ జాతీయ సినీ అవార్డులలోనే. గత యేడాది కూడా తెలుగు సినిమాలకు ఏడు అవార్డులు రాగా... ఈ యేడాది తొమ్మిది కేటగిరిల్లో అవార్డులు లభించాయి.

నాలుగు చిత్రాలకు రెండేసి అవార్డులు

తాజాగా ప్రకటించిన అవార్డులలో ప్రభాస్ 'కల్కి 2898 ఎ.డి.' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా నిలిచింది. అమితాబ్‌బచ్చన్, దీపికా పదుకొనే, కమల్‌హాసన్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాతో దర్శకుడు నాగ అశ్విన్ ప్రేక్షకులను మరో లోకానికి తీసుకెళ్లాడు. దాంతో ఈ సినిమాకు సరైన కేటగిరిలో లభించిన అవార్డుగా అందరూ భావించారు. ఈ సినిమా సీక్వెల్ ప్రస్తుతం సెట్స్ మీద ఉంది. ఇదే చిత్రానికి బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ అవార్డ్ కూడా లభించింది. ఇక ఉత్తమ బాలల చిత్రం అవార్డు '35: చిన్నకథ కాదు'కు లభించడం పట్ల కూడా అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు పాఠాలను పాటలతో చెబితే ఎంతో తేలికగా అర్థ మౌతుందని, అప్పుడు చదవడం అనేది ఎంతమాత్రం భారం కాదని ఈ సినిమా ద్వారా తెలిపారు. అలానే ఇందులో ప్రధాన పాత్ర పోషించి మెప్పించిన అరుణ్ దేవ్‌కు ఉత్తమ బాలనటుడి అవార్డు లభించింది. విశేషం ఏమంటే 30 సంవత్సరాల క్రితం ఉత్తమ బాలల చిత్రంగా గుణశేఖర్ రూపొందించిన 'రామాయణం' అవార్డును అందుకుంది. అందులో జూనియర్ ఎన్టీఆర్ రాముడిగా నటించాడు. కొన్నేళ్ల క్రితం వరకూ హైదరాబాద్‌లో అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం జరుగుతుండేది. ఆ సమయంలో బాలల చిత్రాలు కొన్నైనా తెలుగులో నిర్మితమౌతూ ఉండేవి. వాటిని రద్దు చేమడంతో వాటి నిర్మాణం కూడా ఆగిపోయింది.

ప్రస్తుతం 'సమ్మర్ హాలిడేస్' అనే పిల్లల చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. '35: చిన్న కథ కాదు'కు జాతీయ, ప్రాంతీయ స్థాయిలో అవార్డులు రావడంతో 'సమ్మర్ హాలిడేస్' మేకర్స్ కు ఆక్సిజన్ అందించినట్టు అయ్యింది. ఇక ఎర్రచందనం స్మగ్లర్ కథతో తెరకెక్కిన 'పుష్ప'లో కథానాయకుడిగా నటించిన అల్లు అర్జున్‌కు రెండేళ్ల క్రితం ఉత్తమ నటుడిగా అవార్డు ఇవ్వడం అప్పట్లో విమర్శలకు దారితీసింది. బహుశా అందుకే కావచ్చు ఈసారి 'పుష్ప 2'కు వేరే కేటగిరిల్లో రెండు అవార్డులను మాత్రమే ఇచ్చారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్స్ సమకూర్చిన దీపాలి నూర్, శీతల్ శర్మకు అవార్డు రాగా, బెస్ట్ స్క్రీన్ ప్లే అవార్డును చిత్ర దర్శకుడు సుకుమార్ అందుకోబోతున్నాడు.

అవార్డులతో తెలుగు 'తెర' దరహాసం!

అప్పుడు తండ్రి... ఇప్పుడు తనయ!

జాతీయ స్థాయిలో రెండు అవార్డులు అందుకుంటున్న మరో సినిమా 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల నిర్మించిన ఈ సినిమా ఉత్తమ ప్రాంతీయ తెలుగు సినిమా కేటగిరిలో అవార్డును గెలుచుకుంది. అంతేకాదు... ఈ సినిమా మేకప్ ఆర్టిస్ట్ పి. రవికుమార్ కూ జాతీయ అవార్డు లభించింది. నిహారిక తండ్రి నాగబాబు సైతం తను నిర్మించిన తొలి చిత్రం 'రుద్రవీణ'కు జాతీయ అవార్డు అందుకున్నారు. చిరంజీవి కథానాయకుడిగా కె. బాలచందర్ దర్శకత్వం వహించిన ఆ సినిమాకు, ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రం అవార్డుతో పాటు ఉత్తమ సంగీత దర్శకుడిగా ఇళయరాజా, ఉత్తమ నేపథ్య గాయకుడిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అవార్డులు అందుకున్నారు. అలానే నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా ఇటీవల తెలంగాణలో బెస్ట్ ఫీచర్ ఫిలిమ్ ఆన్ నేషనల్ ఇంటగ్రేషన్, కమ్యూనల్ హార్మనీ అండ్ సోషల్ అప్ లిఫ్ట్ ఆఫ్ డిప్రెస్డ్ క్లాసెస్ కేటగిరిలో అవార్డు పొందింది. ఈ చిత్ర దర్శకుడు యదు వంశీ బెస్ట్ డెబ్యూ డైరెక్టర్‌గా గద్దర్ అవార్డు అందుకున్నాడు. ఆ రకంగా తండ్రి నాగబాబు అడుగు జాడల్లో నిహారిక రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తొలి చిత్రానికి అవార్డులు రావడం విశేషం. అలానే 'లక్కీ భాస్కర్' సినిమాకు గానూ ఆ చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా అవార్డుకు ఎంపికయ్యాడు.

ఈసారి నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ ఛైర్మన్‌గా మలయాళ చిత్రసీమకు చెందిన ప్రముఖ దర్శక నిర్మాత జయరాజ్ వ్యవహరించారు. ప్రతిసారి అవార్డుల ప్రకటన వెలువడగానే ఎవరో ఒకరు ఏదో రకంగా విమర్శనాస్త్రాలు సంధిస్తుండేవారు. కానీ ఈ సారి అలాంటివి జరగలేదు. కాకపోతే కొందరు కమ్యూనిస్టులు మాత్రం స్వాతంత్ర్య వీర సావర్కర్ చిత్రాన్ని రూపొందించిన నటుడు రణదీప్ హుడాకు బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ అవార్డు ఇవ్వడాన్ని నిరసించారు. కమ్యూనిస్టుల వైఖరి తెలిసిందే కాబట్టి ఎవరూ దాన్ని పెద్దంతగా పట్టించుకోలేదు. ఈసారి అవార్డులు పొందిన వాటిలో చాలా వరకూ బయోపిక్స్, స్ఫూర్తిదాయకమైన చిత్రాలే ఉన్నాయి. 'అమరన్, శ్రీకాంత్, చందు ఛాంపియన్' వంటివి ఆ కేటగిరికి చెందినవే. ఉత్తమ నటుడిగా నాలుగోసారి మమ్ముట్టి అవార్డుకు ఎంపిక కాగా ఆయనతో పాటే 'చందు ఛాంపియన్' కథానాయకుడి నటించిన కార్తీక్ ఆర్యన్ ఆ అవార్డును పంచుకున్నారు.

దశాబ్దాల కాలంగా రావణకాష్ఠంలా రగులుతున్న 'ఆర్టికల్ 370'కి కేంద్రం ఫుల్‌స్టాప్ పెట్టేసింది. ఆ నేపథ్యంలో తెరకెక్కిన 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా ఎంపిక కాగా, అందులో నటించిన యామీ గౌతమ్‌కు ఉత్తమ కథానాయిక అవార్డు దక్కింది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరజవాన్ కథతో రూపు దిద్దుకున్న తమిళ చిత్రం 'అమరన్' సినిమాకు మూడు అవార్డులు దక్కాయి. అలా మొత్తం మీద నవ్య చిత్రాలను, నవతరాన్ని ప్రోత్సహిస్తూ ఈసారి అవార్డుల ఎంపిక జరిగింది.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి
2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా
విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

జాగృతి ఆధ్వర్యంలో

స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక

'నవలల పోటీ- 2026'

రచనలను ఆహ్వానిస్తున్నాం..

ప్రథమ బహుమతి
రూ. 25,000

ద్వితీయ బహుమతి
రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 07 సెప్టెంబర్, 2026

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 41

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-

వెల : ₹.60/-

వెల : ₹.270/-

వెల : ₹.80/-



వెల : ₹.54/-

వెల : ₹.120



వెల : ₹.80



వెల : ₹.250/-



వెల : ₹.180/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.99/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687